
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



చిత్తూరు

శుక్రవారం, 18 ఆగస్టు 2017 | 16

చాలా ఏళ్ళుగా తాగునీటి సమస్యతో సతమతమైన ఆ గ్రామాలు పొరుగునే వున్న తమిళనాడు నుంచీ ట్యాంకర్లు తెప్పించుకుని దాహార్తి తీర్చుకునేవి. చేరువలోని అడవుల్లో కురిసే కొద్దిపాటి వర్షానికే పొంగి ప్రవహించే పిల్ల వంక ఆ గ్రామాల మధ్య నుంచే వృధాగా పరుగులు తీసేది. ఆ వాగుకు అడ్డుకట్ట వేసి నీటి కొరత తీర్చుకోవాలని గ్రామస్తులు నడుం కట్టారు. సర్పంచ్ చొరవ, దళితుల భూదానం, రైతుల శ్రమ దానం వెరసి పిల్ల వంక ఉధృతికి అడ్డుకట్ట పడింది. దానిపై చిన్నపాటి కుంట తయారైంది. తర్వాతి వర్షాలకు నిండిపోయింది. స్థానికుల ఆశల్ని ఆవిరి చేస్తూ అంతలోనే నీటి ఉధృతికి చెరువు కట్ట తెగిపోయింది. మళ్ళీ చేతులు కలిపిన గ్రామస్తులు తెగిన కట్టను బాగుచేశారు. కుంటను ఇంకాస్త విస్తరించి చెరువుగా మార్చండంటూ అధికారులను బతిమాలారు. ఇంజనీర్లు అంచనాలు రూపొందించినా పనుల మంజూరుకు ఏడాదిన్నర జాప్యం చేశారు. విసిగిపోయిన సర్పంచు గత ఏడాది అనూహ్యంగా అందివచ్చిన ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి బిగ్ డిబేట్ అవకాశాన్ని వినియోగించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. తక్షణం స్పందించిన సీఎం కుంట విస్తరణకు నిధులిచ్చారు. ఆ నిధులతో ఏర్పడిన చిన్నపాటి చెరువులోకి తాజాగా వర్షపు నీరు చేరింది. భూగర్భ జలమట్టాన్ని పెంచింది.ఏళ్ళుగా ఎండిపోయిన బావుల్లోకి కూడా నీరు చేరుతోంది. ఇక బోరుబావుల నుంచీ నీరు పుష్కలంగా వస్తోంది.యాదమరి మండలం బోదగుట్ట పల్లె, పత్రపల్లెల్లో చోటుచేసుకున్న ఈ పరిణామాల

వివరాలు మెయిన్ లో



- చెరువును అభివృద్ధి చేయలేదంటూ సీఎంకు సర్పంచ్ ఫిర్యాదు
- తక్షణ స్పందనగా నిధులిచ్చిన ముఖ్యమంత్రి
- పనులు చేపట్టాక వర్షానికి నిండిన చెరువు
- ఏబీఎన్ ఆంధ్రజ్యోతి 'బిగ్ డిబేట్' విజయమిది


కొత్త చెరువులో జలసిరులు



ఆంధ్రజ్యోతిలో గత ఏడాది ప్రచురితమైన బిగ్‌డిబేట్ కథనాలు →



కొత్త చెరువు కింద కనువిందు చేస్తున్న పంటలు



నేడు సీఎం రాక

అమరరాజ ఆడిటోరియంలో రిసెప్షన్ వేడుకలకు హాజరు

లోపలి పేజీల్లో

25న జిల్లాస్థాయిలో

మహాసంకల్పం

రేపు జిల్లావ్యాప్తంగా గ్రామసభల నిర్వహణ

ఆరు అంశాల సాధనే లక్ష్యం

పొన్నేరి భూములపై సర్కారుదే తుది నిర్ణయం

- ముక్కంటి క్షేత్రంలో మాస్టర్ ప్లాన్ అమలు ఇకపై వేగవంతం
- అర్చకుల సమస్యలను పరిష్కరిస్తాం
- దేవాదాయ శాఖ మంత్రి మాణిక్యాలరావు

6





కుమారస్వామి

కల్యాణ వైభవం

వివరాలు 16లో

ఆఖరి దినమూ ఆలస్యమే

- పదోన్నతుల పంచాయితీ ముగిశాక 5.30 గంటలకు ప్రారంభమైన కౌన్సెలింగ్
- ముగ్గురు భాషాపండితులకు పదోన్నతి
- 384మంది భాషాపండితులకు, 56 మంది ఎస్‌ఏలకు బదిలీలు
- టీచర్ల లెఫ్టోవర్ వేకన్సీలపై కమిషనర్ వాకబు
- ఖాళీల వివరాల జాబితా తయారీలో విద్యాశాఖ

2

దూరాభారం

- తూతూమంత్రంగా 'అన్న అమృతహస్తం'
- అంగన్‌వాడీ కేంద్రాలకు హాజరవ్వని గర్భవతులు, బాలింతలు
- కొరవడిన సీడీపీవోల పర్యవేక్షణ
- ఖాతాల్లో నిధులున్నా ఖర్చు చేయని సర్పంచులు

2



తూతూమంత్రంగా 'అన్న అమృతహస్తం'

దూరాభారంతో అంగన్‌వాడీ కేంద్రాలకు రాని గర్భవతులు, బాలింతలు

కొరవడిన సీడీపీవోల పర్యవేక్షణ ● ఖాతాల్లో నిధులున్నా ఖర్చు చేయని సర్పంచులు



యాదమరి మండలం క్రిష్ణంపల్లె అంగన్X వాడీ కేంద్రంలో ఎంపీడీవో పారిజాతం తనిఖీలు

చిత్తూరు రూరల్: గర్భవతులు, బాలింతల ఆరోగ్యరక్షణే ప్రభుత్వ లక్ష్యం. ఇందులో భాగంగా 'అన్న అమృతహస్తం' పథకం అమలుతో అంగన్X వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తోంది. దీంతో పుట్టే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారనేది ఆశయం. అయితే అంగన్X వాడీ కేంద్రాల్లో మౌళిక సదుపాయాల కొరత తదితర కారణాలతో జిల్లాలో పథకం అమలు లక్ష్యానికి ఆమడదూరంలో ఉంది.

జిల్లావ్యాప్తంగా 21 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని 4768 అంగన్‌వాడీ కేంద్రాల్లో 28,076 మంది గర్భవతులు, 26,682 మంది బాలింతలున్నారు. గతనెల 1వతేదీ నుంచి అన్న అమృతహస్తం పథకం అమలవుతోంది.గర్భవతులు, బాలింతలు, కిశోర బాలికలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్నం భోజనం అందించాల్సి ఉంది. గతంలో 15 రోజులు లేదా నెలరోజులకు ఒక్కొక్కరికి 125 గ్రాముల బియ్యం, 30 గ్రాముల పప్పు, 16 గ్రాముల నూనె, 200 ఎం.ఎల్. పాలు, 30 గుడ్లను ఇచ్చేవారు. అయితే వీటి వినియోగం సక్రమంగా లేకపోవడంపై ప్రభుత్వానికి ఫిర్యాదులందాయి. కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న పథకం అమలు సజావుగా లేకపోవడంపై ప్రభుత్వం స్పందించింది. దీంతో అన్న అమృతహస్తం పథకం పేరిట గర్భవతులు, బాలింతలు విధిగా అంగన్ వాడీ కేంద్రాలకు వచ్చి పౌష్టికాహారం తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

దూరాభారంతో తప్పనిపాట్లు...

అన్న అమృతహస్తం పథకం కింద గర్భవతులు, బాలింతలు విధిగా అంగన్‌వాడీ కేంద్రాలకు రావాల్సి ఉంది. అయితే దూరాభారం తదితర కారణాలతో అధికశాతం మంది రావడం లేదు. ఉదాహరణకు.. చిత్తూరు పరిధిలోని లెనిన్‌నగర్ అంగన్X వాడీ కేంద్రం పరిధిలో 30 మంది బాలింతలు, గర్భవతులున్నారు. వీరిలో పది మంది కిలోమీటరు దూరం నుంచి రావాల్సి ఉంది. నెలలు నిండటం, దూరం నుంచి రాలేక పోవడం, కూర్చొని తినడానికి అవసరమైన ఏర్పాట్లు కేంద్రంలో లేకపోవడం సమస్యగా మారింది. చిత్తూరు రూరల్ మండలంలోని నాయనిచెరువు కేంద్రానికి వచ్చే ఓ గర్భవతి ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తున్నారు. ఆమెకిచ్చే ఆహారాన్ని తమకు ఇవ్వమని బంధువులు అడిగారు. గర్భవతులే వచ్చి తినాలన్న అంగన్X వాడీ కార్యకర్త వివరించడంపై వివాదం ఏర్పడింది. ఇలా జిల్లావ్యాప్తంగా 50 శాతం కేంద్రాల్లో గర్భవతులు, బాలింతల భర్తలు, బంధువులు వచ్చి ఆహారాన్ని తీసుకు వెళ్తున్నారు.

కష్టంగా మారుతున్న ప్రీ స్కూళ్ల నిర్వహణ..

అంగన్‌వాడీ కేంద్రాలను 15 నుంచి 30 మంది వరకు పిల్లలు ఆశ్రయిస్తున్నారు. హాజరు శాతం ఆధారంగా చిన్నారులకు మధ్యాహ్న భోజనం వండటానికి వర్కర్, ఆయాకు సమయం సరిపోతోంది. ఇప్పుడు కొత్తగా గర్భవతులు, బాలింతలకు మధ్యాహ్న భోజనం అందజేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం వర్కర్లు, ఆయాలకు మరింత భారమైంది. పిల్లలతో పాటు పెద్దలకు అన్నం, కూర, వేపుళ్ల చేయడం, కోడిగుడ్లను ఉడికించడంలో మునిగిపోతున్నారు.70 శాతం అంగన్X వాడీల్లో గ్యాస్‌స్టౌలు లేక కట్టెల పొయ్యిలపై ఆధారపడుతున్నారు. అన్నీవెరసి పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించలేని పరిస్థితి కార్యకర్తలకు లేకుండా పోతోంది.

సీడీపీవోల నిర్లక్ష్యమే కారణం...

అంగన్‌వాడీ కేంద్రాలకు కూరగాయలు, నిత్యావసరాలు తదితర సామాగ్రిని సమకూర్చే బాధ్యత సీడీపీవోలదే. నిత్యం రైతుల ద్వారా తాజా కూరగాయలను సరఫరా చేయించేలా చర్యలు తీసుకోవాలి. అయితే ఇప్పటి వరకు రైతులతో సీడీపీవోలు సమావేశాలు నిర్వహించిన జాడలేదు. అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన వంట సామాగ్రిని కొనుగోలు చేసి ఇవ్వాలంటూ ప్రభుత్వం సర్పంచ్‌ల ఖాతాలకు రూ.5వేల వంతున నిధులు జమచేసింది. వీటితో వంటపాత్రలు, గ్లాసులు, ప్లేట్లను కొనుగోలు చేసి ఇవ్వాల్సినా, ఒక్క సర్పంచ్ ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. ఇకనైనా ఉన్నతాధికారులు పథకం సజావు అమలుపై దృష్టిసారించాలి.అంగన్‌వాడీ కేంద్రాలకు దూరంగా ఉన్న బాలింతలు, గర్భవతులకు పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూడాలి. ఇందుకు అవసరమైన ప్రత్యామ్నాయ మార్గాల గురించి ఆలోచించాల్సిన అవసరం ఉంది.

చివరి రోజూ టీచర్ల కౌన్సెలింగ్‌లో ఆలస్యం

పదోన్నతుల పంచాయితీ ముగిశాక 5.30 గంటలకు ప్రారంభమైన కౌన్సెలింగ్

ముగ్గురు భాషాపండితులకు పదోన్నతి ● 384 మంది భాషాపండితులకు, 56 మంది ఎస్ఏలకు బదిలీలు

చిత్తూరు సిటీ: టీచర్ల కౌన్సెలింగ్‌లో చివరి రోజూ ఆలస్యం తప్పలేదు. భాషాపండితులకు గురువారం మధ్యాహ్నం రెండుగంటలకు పీసీఆర్ హైస్కూల్‌లో బదిలీల కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తామని విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. దీంతో 56 మంది స్కూల్ అసిస్టెంట్లు, 384 మంది భాషాపండితులు గురువారం మధ్యాహ్నమే కౌన్సెలింగ్ సెంటరుకు చేరుకున్నారు. అయితే అమరావతి నుంచి సీనియారిటీ జాబితా సాయంత్రం 5.30 గంటలకు విడుదల కావడంతో కౌన్సెలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది.స్పౌజ్‌ల విషయంలో కాస్త ఆలస్యమవడంతో నూరోనెంబర్ తరువాతే కౌన్సెలింగ్ వేగం పుంజుకుంది.

ఎట్టకేలకు తెగిన పదోన్నతుల పంచాయితీ

వారం రోజుల క్రితం జరిగిన భాషాపండితుల పదోన్నతుల్లో ఇద్దరు మహిళా టీచర్ల మధ్య నెలకొన్న పోటీ కారణంగా ముగ్గురి పదోన్నతులు ఆగిపోయాయి. అయితే అమరావతి నుంచి అందిన సూచనల ప్రకారం పదోన్నతుల ముడి వీడింది. దీంతో సి.ఆనంద్, ఎ.జ్ఞానప్రసూన; డి.కృష్ణమూర్తిలకు భాషాపండితుల నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించారు. ఆ తర్వాత పెండింగ్‌లో వుండిన 56మంది స్కూల్ అసిస్టెంట్లు, 384 మంది భాషాపండితులకు బదిలీల కౌన్సెలింగ్‌ను నిర్వహించారు. ఇన్‌చార్జి డీఈవో శామ్యూల్, డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్ పురుషోత్తం పర్యవేక్షణలో సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభించిన కౌన్సెలింగ్ అర్ధరాత్రి వరకు సాగింది. కౌన్సెలింగ్ సందర్భంగా డీఈవో కార్యాలయ అధికారులు, సిబ్బంది



కౌన్సెలింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న శామ్యూల్

దాదాపు 15 రోజుల పాటు నిద్రాహారాలను మాని శ్రమించాల్సివచ్చింది.17రోజుల పాటు యజ్ఞంలా సాగిన కౌన్సెలింగ్ ముగియడంతో డీఈవో కార్యాలయ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

టీచర్ల లెఫ్టోవర్ వేకెన్సీలపై కమిషనర్ సీరియస్

ఖాళీల వివరాల జాబితా తయారీలో మునిగిన విద్యాశాఖ అధికారులు

చిత్తూరు సిటీ: టీచర్ల లెఫ్టోవర్ వేకన్సీ కేసుల దుమారం పెద్దదయింది. ఈ విషయంలో కొందరు టీచర్లకు,యూనియన్ నాయకులకు విద్యాశాఖ అధికారులు అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ కమిషనర్ సంధ్యారాణికి ఫిర్యాదులు అందాయి. దాంతో ఆమె గురువారం ఉదయం విద్యాశాఖ అధికారులతో ఫోన్లో తాజా పరిణామాలపై వాకబు చేసినట్లు తెలిసింది. దీంతో విద్యాశాఖ అధికారులు లెఫ్టోవర్ వేకన్సీ కేసుల జాబితాను తయారుచేసే పనిలో పడ్డారు. 8 ఏళ్లపాటు ఒకే పాఠశాలలో పనిచేస్తూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం బదిలీల కౌన్సెలింగ్‌కు గైర్హాజరైన వారి పేర్లను జాబితాలో కలిపితే ఏమవుతుందో, కలపక పోతే ఏం జరుగుతుందనే భయం విద్యాశాఖ అధికారులను వెంటాడుతోంది.

బదిలీల్లో అవకతవకలు... పారదర్శకంగా జరగాల్సిన బదిలీల్లో అవకతవకలు జరిగాయనడానికి కొంతమంది టీచర్ల సంఘటనలే ఉదాహరణ. ఏర్పేడులో పనిచేసే తెలుగు భాషాపండితుడొకరికి పదోన్నతి విషయంలో అన్యాయం జరిగింది. సీనియారిటీ జాబితా విడుదలలో కలకడ మండలం మహల్‌లో పనిచేసే ఒకే పేరు రెండుసార్లుగా ఇవ్వడంతో ఆయనకు రావాల్సిన పదోన్నతి ఆగిపోయింది. అయితే విద్యాశాఖ అధికారులు గురువారం అతడికి పదోన్నతి కల్పించి న్యాయం చేశారు.తిరుపతి డివిజన్లో పనిచేసే ఇద్దరు ఫిజికల్ సైన్సు టీచర్లు, చిత్తూరు రూరల్ మండలంలో ఓ ఫిజికల్ సైన్సు టీచరు, పుత్తూరుకు చెందిన బయలాజికల్ సైన్సు టీచరు ఒకరు కౌన్సెలింగ్‌కు గైర్హాజరై లెఫ్టోవర్ వేకన్సీలో వుంటూ తాము పనిచేస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే పోస్టింగులిప్పించుకునేందుకు మార్గం సుగమం చేసుకున్నారు.అదేవిధంగా తంబళ్ళపల్లె నియోజకవర్గంలో పనిచేసే ఓ మహిళా టీచరు తప్పుడు విడాకుల పత్రంతో తిరుపతికి బదిలీ కాగలిగారన్న ఆరోపణలొచ్చాయి.

శ్రీవారి సేవలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి

తిరుమల: తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకున్నారు. తర్వాత శ్రీవేంకటేశ్వరస్వామి, వకుళమాతను దర్శించుకున్నారు. హుండీలో కానుకలు సమర్పించారు. జస్టిస్ లక్ష్మణరెడ్డికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి ప్రసాదాలు అందజేశారు.

నేడు తిరుపతికి సీఎం చంద్రబాబు

చిత్తూరు కలెక్టరేట్: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం తిరుపతికి వస్తున్నట్లు అధికార వర్గాల సమాచారం. మధ్యాహ్నం పైన హెలికాప్టర్‌లో బయలుదేరి తిరుపతికి చేరుకునే సీఎం స్థానికంగా ఉన్న అతిథి గృహంలో బస చేస్తారు. సాయంత్రం కరకంబాడిలోని అమరరాజ ఆడిటోరియంలో జరిగే మాజీ మంత్రి గల్లా అరుణకుమారి మనవడు విక్రమాదిత్య వివాహ వేడుకల రిసెప్షన్‌కు హాజరవుతారు. అధికారికంగా సమాచారం అందకపోవడంతో సీఎం తదుపరి కార్యక్రమ వివరాలు తెలియరాలేదు.

25న జిల్లాస్థాయిలో మహాసంకల్పం నిర్వహణ

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్: ఆరు అంశాల సాధన లక్ష్యంగా ఈనెల 25న జిలాస్థాయిలో 'మహాసంకల్పం' కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ పీఎస్ ప్రద్యుమ్న ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్ నుంచి మండలాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభించిన ఐదేళ్ల తర్వాతే స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. ఇదే స్ఫూర్తితో ఈ ఏడాది ప్రారంభించిన 'మహాసంకల్పం' 2022 నాటికి పూర్తి చేయాలన్నారు. పరిశుభ్రత, అందరికీ మరుగుదొడ్లు, పేదరిక నిర్మూలన, అక్షరాస్యత, నీరు-ప్రగతి, లంచంఇవ్వను-లంచం తీసుకోను అన్న ఆరు అంశాలపై సంకల్పం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా శనివారం జల్లావ్యాప్తంగా గ్రామసభలు ఏర్పాటు చేసి ఈ అంశాలపై చర్చించి, ప్రతిజ్ఞ చేయాలన్నారు. 22న మరోసారి సభలు ఏర్పాటు చేసి తీర్మాన వివరాలను డీఆర్‌డీఏ కార్యాలయానికి పంపాలన్నారు. 23న మండలస్థాయిలోను, 25న జిల్లాస్థాయిలో 'మహాసంకల్పం' నిర్వహించాలన్నారు. ఇందులో అధికారులు, ప్రజలు పాల్గొని ప్రతిజ్ఞ చేయాలని పేర్కొన్నారు. కాన్ఫరెన్స్‌లో జేసీ పీఎస్ గిరీషా, జేసీ-2చంద్రమౌళి, సీపీవో భాస్కరశర్మ, పీడీలు కూర్మనాథ్, రవిప్రకాష్‌రెడ్డి, డీపీవో ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న డాక్‌సేవక్‌ల సమ్మె

చిత్తూరు కలెక్టరేట్: అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామీణ డాక్‌సేవక్‌లు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం రెండో రోజుకు చేరింది. నగర తపాలా ప్రధాన కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో గ్రామీణ డాక్‌సేవక్‌ల సంఘ జిల్లా అధ్యక్షుడు నారాయణస్వామి, కార్యదర్శి జి.రామమూర్తి మాట్లాడుతూ ఏడవ వేతన కమిటీ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కమలేష్‌చంద్ర కమిటీ నివేదిక అమలు జాడ లేదని విమర్శించారు. కార్యక్రమంలో విశ్రాంత పోస్టల్ సూపరింటెండెంట్ ఎంఎల్ఎన్‌మూర్తి, నాయకులు మునిరత్నంరెడ్డి, మురళి, బాబు, దామోదరం, నాయుడు, గోపాలఈయ్యర్, జయశంకర్, లక్ష్మీప్రసన్న, లలిత కుమారి, ధనలక్ష్మి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీకార హత్య కేసులో ముగ్గురు అరెస్టు

● కోర్టుకు నిందితుల తరలింపు

పీలేరు:మండలంలోని జాండ్ల పంచాయతీ బసిరెడ్డిగారిపల్లెతాండాలో ఆరు రోజుల క్రితం జరిగిన మూడే రెడ్డినాయక్ (25) హత్య కేసులో పీలేరు పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. గ్రామంలోని రాజేంద్రనాయక్ భార్య రెడ్డెమ్మను హత్య చేసిన కేసు నిమిత్తం కోర్టు వాయిదాకు వచ్చి స్వగ్రామానికి వెళ్లిన రెడ్డినాయక్‌ను హతురాలి భర్త రాజేంద్రనాయక్, మరిది బాలకృష్ణనాయక్, సోదరుడు కిషోర్‌నాయక్ ఈ నెల 11న పట్టపగలు గ్రామస్తులు చూస్తుండగానే హత్య చేసిన సంగతి తెలిసిందే. తీవ్ర కలకలంరేపిన ఈ హత్యాఘటన నిందితులను పోలీసులు వారం రోజుల లోపే పట్టుకుని అరెస్టు చేయగలిగారు. పీలేరు అర్బన్ సీఐ నాగరాజు , ఎస్ఐ సుధాకర్‌రెడ్డి కథనం మేరకు... బసిరెడ్డిగారిపల్లె తాండాకు చెందిన రాజేంద్రనాయక్ భార్య రెడ్డెమ్మపై 2015 సెప్టెంబరు నెలలో అదే గ్రామానికి చెందిన రెడ్డినాయక్ అత్యాచారానికి ప్రయత్నించి తాడుతో ఉరివేసి హతమార్చాడు.రెడ్డినాయక్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేయగా జనవరి మాసంలో బెయిల్‌పై విడుదలై కలకడ మండలం ఎనుగొండపాళెం దిగువతాండాలోని అత్తగారి ఇంట చేరాడు. స్వగ్రామానికి వెళితే ప్రాణహాని ఉందనే భయంతో రెండేళ్లు అత్తగారింట ఉన్నాడు. ఎనుగొండపాళెం దిగువ తాండాలో చోరీలకు పాల్పడడంతో అక్కడ కూడా అతడికి సమస్యలు ఎదురయ్యాయి.దీంతో స్వస్థలమైన బసిరెడ్డిగారిపల్లెతాండాకు వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. ఈ నెల 10వ తేదీన పీలేరు కోర్టులో హత్య కేసు వాయిదాకు హాజరైన రెడ్డినాయక్ సాయంత్రం భార్యబిడ్డలతో కలసి బసిరెడ్డిగారిపల్లెతాండాకు వెళ్లాడు. రెడ్డినాయక్ పట్ల తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్న రాజేంద్రనాయక్, బంధువులు అతను గ్రామానికి రావడంతో కోపోద్రిక్తులయ్యారు. రాజేంద్ర నాయక్, అతని సోదరుడు బాలకృష్ణనాయక్, బావమరిది కిషోర్‌నాయక్ 11వ తేది ఉదయం 9గంటల ప్రాంతంలో రెడ్డినాయక్ ఇంటి వద్దకు వెళ్లి అతనిని రోడ్డుపైకి ఈడ్చుకు వచ్చి కర్రలు, బండరాళ్లతో చావగొట్టారు.

గ్రామస్తులు చూస్తుండ గానే రెడ్డినాయక్‌ను బట్టలు ఊడదీసి మర్మాంగాన్ని నలిపివేసి హతమార్చారు. ఈ ప్రతీకార హత్య పరిసర ప్రాంతాల్లోనూ సంచలనం సృష్టించింది. అరెస్టు చేసిన ముగ్గురు నిందితులను కోర్టుకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



హత్య కేసులో అరెస్టు చేసిన నిందితులతో పోలీసు అధికారులు

తండ్రి మందలించాడని

కుమారుడు ఆత్మహత్య



నరేంద్ర మృతదేహం

ములకలచెరువు: నీఈడు యువకులు చక్కగా చదువుకుంటున్నారు. నీవు ఎందుకు ఖాళీగా ఉంటావు.. చక్కగా చదువుకో అని ఓ తండ్రి కుమారుడిని మందలించాడు. అయితే మందలింపును సహించలేక క్షణికావేశంతో గులికల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు...మండలంలోని వేపూరికోట పంచాయతీ ఎద్దులవారిపల్లెకు చెందిన కృష్ణప్ప కుమారుడు నల్లబల్లి నరేంద్ర(19) డిప్లమో చదువుతూ ఏడాది క్రితం జరిగిన పరీక్షలలో ఒక సబ్జెట్‌లో ఫెయిల్‌అయ్యాడు. దీంతో యువకుడు ఖాళీగా ఉండడంతో తన ఈడు యువకులందరూ చదువుకుంటున్నారని, నువ్వెందుకు ఖాళీగా ఉన్నావు చదువుకోమని నరేంద్రను తండ్రి కృష్ణప్ప మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన యువకుడు క్షణికావేశంతో గ్రామం వద్ద నున్న నీటి తొట్టె వద్ద బుధవారం రాత్రి గులికల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంఘటనాస్థలాన్ని సీఐ రుషికేశవ పరిశీలించి యువకుడు మృతికి గల కారణాలపై విచారణ జరిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా కృష్ణప్ప ఒక్కగానొక కుమారుడు నరేంద్ర మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు.

గోగర్భం డ్యాంలో మృతదేహం

మృతుడు రామసముద్రం వాసి సుబ్రమణ్యం



సుబ్రహ్మణ్యం (ఫైల్ ఫొటో)

తిరుమల: గోగర్భం డ్యాంలో గురువారం ఓ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో మృతదేహం నీటిలో తేలియాడుతుందన్న సమాచారంతో విజిలెన్స్ ఏవీఎస్‌వో రామచంద్రయ్య, టూటౌన్ ఎస్ఐ వినోద్ అక్కడికి చేరుకుని హెల్త్‌విభాగం సిబ్బంది ద్వారా మృతదేహాన్ని ఒడ్డుకు తీయించారు. ఘటనా ప్రాంతంలో లభించిన ఓ పాసుపోర్టు సైజు ఫొటో, కొన్ని పేపర్లను ఎస్ఐ వినోద్ సేకరించి కొన్ని సెల్‌ఫోన్ నెంబర్లుకు కాల్ చేయటంతో పాటు మృతదేహం ఫొటోలను వాట్సాప్‌లో పంపారు. దీంతో మృతుడు రామసముద్రం మండలం, కప్పల్లి గ్రామానికి చెందిన జె.సుబ్రహ్మణ్యంగా తేలింది. సుబ్రహ్మణ్యం ఈ నెల 14న తన తల్లితో కలిసి తిరుమలకు వచ్చాడని, సుబ్రహ్మణ్యం కనిపించకపోవటంతో తల్లి తిరిగి సొంతూరుకు చేరుకున్నట్టు పోలీసు విచారణ వెల్లడైంది. సుబ్రహ్మణ్యం ప్రమాదవశాత్తు చనిపోయాడా లేదా ఆత్మహత్య చేసుకున్నాడాఅనే అన్నికోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని తిరుమలలో తిరుపతి రుయా ఆస్పత్రి కి తరలించారు.

వృద్ధుడి మృతి



తిరుపతి (విద్య): తిరుపతి ఆర్టీసీరోడ్డులోని పాత మున్సిపల్ కాంప్లెక్స్‌లో గుర్తు తెలియని వృద్ధుడు (75) మృతి చెందాడు. గురువారం స్థానికుల ఫిర్యాదుతో యూనివర్శిటీ పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. యాచకుడై ఉండొచ్చని సీఐ శ్రీనివాసులు తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

గంగాధరనెల్లూరు: విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని తూగుండ్రం ప్రాథమిక పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ శీనుమొదలి తెలిపారు. గురువారం పాఠశాల 75 మంది విద్యార్థులకు ఆయన నోటు పుస్తకాలు, బోధన సామగ్రిని వితరణగా అందజేశారు. కార్యక్రమంలో వేపంజేరి మార్కెట్ కమిటీ డైరెక్టర్ జీవరత్నం, హెచ్‌ఎం ఆంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


నోటు పుస్తకాలను పంపిణీ చేస్తున్న శీను మొదలి

మద్యం మత్తులో ట్రాక్టర్లు నడపొద్దు

డ్రైవర్లకు ట్రాఫిక్ డీఎస్పీ హెచ్చరిక

చిత్తూరు టౌన్: మద్యం మత్తులో ట్రాక్టర్లు నడిపే డ్రైవర్లపై చర్యలు తప్పవని ట్రాఫిక్ డీఎస్పీ కేశప్ప హెచ్చరించారు. గురువారం నగర బీఎస్‌కణ్ణన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ట్రాక్టర్, నీటి ట్యాంకరు డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రతిఒక్కరు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలనీ, లేదంటే వాహనాన్ని సీజ్ చేసి, డ్రైవర్లను జైలుకు పంపిస్తామన్నారు. ఈ విషయమై ట్రాక్టర్ యజమానులు పరిశీలించాలనీ, లేదంటే యజమాని, డ్రైవర్లపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని చెప్పారు. వాహనాలకు సకాలంలో ఎఫ్‌సీ, బీమా చేయించాలని సూచించారు. ట్రాఫిక్ రూల్స్‌ను పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. సమావేశంలో సీఐ వేణుగోపాల్, ఎస్‌ఐలు మనోహర్, నాగభూషణం, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలి

జిల్లా ఏరువాక కో-ఆర్డినేటర్

పెనుమూరు: రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా ఏరువాక కో-ఆర్డినేటర్ రాజశేఖర్ నాయుడు తెలిపారు. గురువారం మండలంలోని సాతంబాకం, సామిరెడ్డిపల్లె, ఉగ్రాణంపల్లెలో సాగవుతున్న వేరుశనగ పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ఈ ఏడాది 30 శాతం మాత్రమే వేరుశనగ పంట సాగయినట్లు చెప్పారు. దీంతో అధికశాతం మెట్టభూమి బీడుగా మారిందన్నారు. వర్షాలు బాగా కురుస్తున్నందున రైతులు ప్రత్యామ్నాయంగా రాగి, సజ్జ, కంది, మినుము సాగు చేపట్టాలని కోరారు. ఈ విత్తనాలను వందశాతం సబ్సిడీతో అందిస్తున్నామనీ, రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేరుశనగ పంటను ఆకుముడత ఆశించిందనీ, లీటరు నీటిలో రెండు మి.లీ. క్లోరిఫైరిఫాస్ కలిపి పంటపై పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో కిరణ్మయి, ఏఈవో జయంతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న రాజశేఖర్

భూ సమస్యల పరిష్కారానికి కృషి


ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ సుధాకరయ్య

పూతలపట్టు: భూ సమస్యల పరిష్కారం లక్ష్యంగా గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుధాకరయ్య తెలిపారు. గురువారం మండలంలోని పోలవరం, ఆకనంబట్టులో రెవిన్యూ గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభల్లో పలువురి భూ సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. పేరడంగళ్, వన్‌బీలో మార్పుచేర్పులపై అర్జీలు అందాయన్నారు. వీటిపై సిబ్బందితో విచారణ జరిపి న్యాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు, ఎంపీటీసీ కృష్ణవేణి, ఆర్‌ఐలు మహేశ్వరి, రూపాదేవి, వీఆర్వోలు హేమంత్, కోదండరెడ్డి, ఆదినారాయణ, సర్వేయర్ చంద్రశేఖర్, మండల టీడీపీ ఉపాధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లు... జనం పాట్లు

గుడిపాల/ఐరాల: కొద్దిపాటి వర్షానికే గ్రామీణ రోడ్లు అధ్వానంగా మారుతున్నాయి. ఏళ్లనాడు నిర్మించినవి కావడడంతో గుంతలమయంగా మారాయి. గుడిపాల నుంచి బత్తవాళ్లూరు వయా ముత్తువాళ్లవూరు, పాపసముద్రం నుంచి అడివి చేను, కమ్మతిమ్మాపల్లె నుంచి చలిచీమలపల్లె, పిళ్ళారికుప్పం నుంచి వెప్పాలమానుచేను, తుమ్మలవారిపల్లె నుంచి అనుపు వెళ్ళే రోడ్లు రాళ్లుతేలి దెబ్బతిన్నాఇ. అయితే వాహనదారులు, గ్రామీణులు ఇబ్బంది పడుతున్నా అధికారులు పట్టించుకోక పోవడంపై విమర్శలొస్తున్నాయి.

ఐరాల మండలకేంద్రానికి కూతవేటు దూరంలోని ఈడిగపల్లెలో పారిశుధ్య నిర్వహణ కొరవడింది. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గ్రామీణ రోడ్లలో ప్రయాణం మారింది. మురుగునీటి కాలువలు లేక ఎక్కడినీరు అక్కడే నిలిచి పోయింది. చిన్నపాటి వర్షం కురిసినా నీరు వెళ్లేదారి లేకపోతోంది. వీధుల్లో నిలిచిన మురుగు నీటిలో నడవలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. కంపు వాతావరణం నడుమ జీవనం సాగించలేమంటూ వాపోతున్నారు. సమస్యలపై అధికారులు స్పందించి పరిష్కరించాలనీ, లేదంటే ఆందోళన చేస్తామని జనం హెచ్చరిస్తున్నారు.


గుంతలమయమైన బత్తవాళ్లూరు రోడ్డు


ఈడిగపల్లె రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

విద్యార్థులకు పుస్తకాల వితరణ



దామలచెరువు: దామలచెరువు పంచాయతీ బందార్లపల్లె ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం రాత పుస్తకాల పంపిణీ జరిగింది. గ్రామానికి చెందిన దాతలు తులసీరామిరెడ్డి, కిరణ్‌కుమార్, కరుణాకర్‌రెడ్డి విద్యార్థులకు పుస్తకాలు, బోధన సామగ్రిని వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సుదర్శన్ నాయుడు మాట్లాడుతూ దాతల ఔదార్యాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్డెమ్మ, హైమావతి, హనుమంత నాయుడు, సత్యవతి, దేశమ్మ, రవీంద్రాచారి, అనిత, తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్ టీకాతో రెండు వ్యాధుల దూరం

పూతలపట్టు: ఒక్క టీకాతో రెండు ప్రాణాంతక వ్యాధులు దూరమవుతాయని పీహెచ్‌సీ వైద్యురాలు పద్మజ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని గురుకుల పాఠశాల విద్యార్థులకు ఎంఆర్ టీకా పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 9 నెలల నుంచి 15 ఏళ్లలోపున్న పిల్లలు తప్పకుండా వ్యాక్సిన్‌ వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నాగరాజు, వైద్య సిబ్బంది మునిరత్నం, మోహన్‌శెట్టి, ఏఎన్ఎంలు చిన్నమ్మ, సురేఖ, నాగభూషణం, సుజాత, వీణ, సెల్వరాజ్ పాల్గొన్నారు.

23న గుడిపాల మండల మీట్

గుడిపాల: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 23వతేది మండల పరిషత్‌ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మల్లికార్జున తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

22న నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు

రుణాల మంజూరుకు సంబంధించి ఈనెల 22న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, క్రిస్టియన్, కాపు నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మల్లికార్జున తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమానికి దరఖాస్తుదారులు కులం, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, టీసీ ఒరిజినల్స్, విద్యార్హత ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు.

ఉచిత పంపుసెట్లకు దరఖాస్తుల ఆహ్వానం

యాదమరి: మండల పరిధిలోని రైతులు ఉచిత పంపుసెట్లకు దరఖాస్తు చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ రాజా అన్నారు. గురువారం ఉదయం జోడిచింతల సబ్‌స్టేషన్ వద్ద ఆయన రైతులతో మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ 5 హెచ్‌పీ సబ్‌మెర్సిబుల్ పంపులను ఉచితంగా ఇస్తామన్నారు. ఇందుకు గాను పాతపంపులు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఈఈఎస్ఎల్ ప్రతినిధి మాట్లాడుతూ మోటారు పంపిణీతో పాటు నిర్వహణ కూడా చూస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల రైతులు పాల్గొన్నారు.

రెవిన్యూ సభల్లో అర్జీల వెల్లువ

పాలసముద్రం: రైతుల సమస్యలను పరిష్కరించడానికే రెవిన్యూశాఖ ఆధ్వర్యంలో సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సువర్ణమ్మ తెలిపారు. మండలంలోని ఎస్‌ఆర్‌ఆర్ కండిగలో గురువారం రైతుల సేవలో రెవిన్యూశాఖ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ భూ సమస్యలుంటే పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగయ్య, ఆర్‌ఐలు ప్రభు, దేవి, సర్వేయర్ సునీత, వీఆర్వో శీను, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న సువర్ణమ్మ

గుడిపాలలో: గ్రామీణుల సమస్యలను పరిష్కరించడానికే రైతుసేవలో రెవిన్యూశాఖ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బెన్నురాజ్ అన్నారు. మండలంలోని ఎ.ఎల్.పురం పంచాయతీలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ కోర్టులో ఉన్న భూ సమస్యలు తప్ప, మిగిలిన వాటిని తమ దృష్టికి వస్తే పరిష్కరిస్తామని అన్నారు. ఈ సందర్భంగా పట్టాదారు పాస్‌పుస్తకాలు, దారిసమస్య, శ్మశానానికి స్థలాల మంజూరు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై పలువురు ఫిర్యాదులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కుప్పయ్య, ఆర్‌ఐ శశికళ, మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడు రవిచంద్ర, నాయకులు లోకనాథన్‌, సర్వేయర్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

యాదమరిలో: మండలంలోని మోడిపల్లెలో తహసీల్దార్ రెడ్డెప్ప ఆధ్వర్యంలో రెవెన్యూ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలువురు రైతులకు ఈ-పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరించడమే రైతుసేవలో రెవెన్యూ శాఖ కార్యక్రమ లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం ఆయన పలువురు అర్జీలు అందజేయగా, పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ప్రవీణ, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

చిత్తూరు

రాఘవ	లై
దేవి	టాయ్‌లెట్
గురునాథ	ఫిదా
ఎంఎస్‌ఆర్	జయ జానకి నాయక
విజయలక్ష్మి	నేనేరాజు నేనే మంత్రి
చాణక్య	నక్షత్రం
వెంకటేశ్వర	పొదువాగ ఎన్‌ మనసు తంగం
ఆనంద్	రాక్షసి

ప్రమాదాల నివారణకు కృషి

ఐరాల: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరు కృషి చేయాలని ఎస్‌ఐలు శివశంకర్, నరేష్‌బాబు కోరారు. గురువారం ఉదయం స్థానిక ఆటో డ్రైవర్లతో మాట్లాడుతూ.. మద్యం మత్తులో ఆటోడ్రైవర్లు వాహనాలను నడపరాదని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు తప్పవన్నారు. ఆటో వెనుక భాగం డోరును తెరవరాదనీ, ఐరన్‌రాడ్లు వేయించుకోవాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.5వేల జరిమానా తప్పదని హెచ్చరించారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామంటూ ఆటోడ్రైవర్లతో ప్రమాణం చేయించారు.


ఆటోడ్రైవర్లతో మాట్లాడుతున్న ఐరాల ఎస్‌ఐ శివశంకర్

ఇంటి పన్ను వసూలుకు జియోట్యాగింగ్: ఈవోఆర్డీ

గంగాధరనెల్లూరు: మండలంలో ఇంటి పన్ను వసూలుకు సంబంధించి జియోట్యాగింగ్ చేపట్టినట్లు ఈవోఆర్డీ షేక్ అబ్దుల్‌గఫూర్ తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలో మొత్తం 10,145 ఇళ్లకుగాను 3306 ఇళ్ల కొలతలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఇంటినీ జియోట్యాగింగ్ కిందకు చేర్చాల్సి ఉందన్నారు. కొలతల ద్వారానే ఇకపై ఇంటి పన్ను విధించడం జరుగుతుందన్నారు. నిర్దేశిత లక్ష్యాల సాధనకు పంచాయతీ కార్యదర్శులు చొరవ చూపాలని కోరారు.

చెస్ విజేతకు సన్మానం



విజేత గుణశేఖర్‌కు షీల్డ్ అందజేత

చిత్తూరు రూరల్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన చదరంగ పోటీల్లో ఎన్‌జీవోల సంఘ అభ్యర్థి జి.గుణశేఖర్ విజయం సాధించారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక ఎన్‌జీవోల సంఘం కార్యాలయంలో విజేతను సంఘ జిల్లా అధ్యక్షుడు కృష్ణమ నాయుడు అభినందించి షీల్డ్‌ను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్, సెక్రటరీ ఆదినారాయణ, సభ్యులు శ్రీనివాసులు, చంద్రశేఖర్, సునీల్, మహేంద్ర పాల్గొన్నారు.

పడిగాపులు

జనన, మరణ ధ్రువపత్రాల మంజూరు కోసం అర్హుల పాట్లు



జనన, మరణ సర్టిఫికెట్ల కోసం వచ్చిన జనం - సదరన్ క్యాంపులో వైద్య పరీక్షల కోసం

చిత్తూరు టౌన్: బిడ్డ పుట్టిన లేదా ఎవరైనా రోగులు మృతిచెందితే కొన్ని గంటల్లోనే జనన, మరణ ధ్రువపత్రాలను జారీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. గతంలో పురపాలక సంఘాల ద్వారా వీటిని జారీ చేసేవారు. అయితే అధికారుల నిర్లక్ష్యం, డబ్బు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలపై ప్రభుత్వం స్పందించింది. దీంతో గత ఏడాది నుంచి ప్రభుత్వాస్పత్రుల ఆర్ఎంవో ద్వారానే సర్టిఫికెట్ల మంజూరుకు ఉత్తర్వులిచ్చింది. కాగా, చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో వీటిని పొందాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నెలల తరబడి జనన, మరణ ధృవీకరణ పత్రాలను జారీ చేయక పోవడంతో సమస్య వస్తోంది. గురువారం ఒక్కరోజు వంద మంది వరకు వీటి కోసం బారులు తీరడమే ఇందుకు నిదర్శనం. సర్టిఫికెట్లు జారీ చేసే సంబంధిత సెక్షన్ ఇన్‌చార్జి దీర్ఘకాలిక సెలవులో వెళ్లడమూ కారణమని చెప్ప వచ్చు. అయితే ఆయన స్థానంలో మరొకరిని నియమించడంతో ఉన్నతాధికారుల నిర్లక్ష్యం బాధితులకు పాట్లు తెస్తోంది ఆస్పత్రి మెటర్నిటీ విభాగంలో బిడ్డ పుట్టిన వెంటనే తల్లిదండ్రుల పేర్లు, చిరునామాను కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేయాలి. అదేరోజు లేదా మరుసటిరోజు జనన లేదా మరణ ధ్రువపత్రాలను జారీ చేయాల్సి ఉంది. ప్రభుత్వాస్పత్రిలో ప్రస్తుతం మెడికల్ సూపరింటెండెంట్, ఆర్ఎంవోలుగా ఇన్‌చార్జిలే ఉన్నారు. దీంతో వీటి మంజూరుపై నిర్లక్ష్యం తీసుకోవడంలో వెనుకంజ వేస్తున్నట్లు తెలిసింది.

ఇదే బాటన వైకల్య ధృవీకరణ పత్రాల జారీ

వికలాంగులు, అంధ, బధిరులకు ప్రభుత్వం పింఛను చెల్లిస్తోంది. కొత్తగా పింఛను మంజూరు కోసం దరఖాస్తు చేసుకోవాలంటే ప్రభుత్వ ఆదేశాల మేరకు సదరన్ క్యాంపులో వైద్య పరీక్షలు చేయించుకోవాల్సి ఉంది. నగర ప్రభుత్వాస్పత్రిలో ప్రతి మంగళ, గురువారం వైకల్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో 60 శాతానికి పైగా వైకల్యం ఉన్నట్లు వైద్యులు ధృవీకరిస్తే డీఆర్‌డీఏ అధికారులు పింఛను మంజూరు చేస్తారు. అయితే కొంతకాలంగా ఈ ధ్రువపత్రాల మంజూరులో త్రీ జాప్యం జరుగుతోంది. దీనికి సంబంధించి వైద్యాధికారి, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్, ఆర్ఎంవోలు సకాలంలో సంతకాలు చేయక పోవడమే ఇందుకు కారణం. దీంతో మూడునెలలవుతున్నా అర్హులకు సర్టిఫికెట్లు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా వైద్యశాఖ ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాల్సి ఉంది.

రైతుబజారులో రాయితీ ఉల్లి విక్రయాలు


బారులు తీరి ఉల్లి కొనుగోలు చేస్తున్న జనం

చిత్తూరు లీగల్: నగర రైతు బజారులో గురువారం నుంచి రాయితీ ధరకు ఉల్లి విక్రయాలు ప్రారంభమయ్యాయి. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.35 నుంచి రూ.40 వంతున విక్రయిస్తున్నారు. అధిక ధరలకు జడిసి సామాన్య జనం కొనుగోళ్లకు దూరంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా మార్కెటింగ్ శాఖ ఇన్‌చార్జి ఏడీ ఇందుమతి ఆదేశాలతో బుధవారం స్థానిక ఎస్టేట్ అధికారి విశ్వేశ్వర కర్నూలు మార్కెట్ నుంచి 11 టన్నుల ఉల్లి కొనుగోలు చేశారు. వీటిని నగర రైతు బజారులో గురువారం నుంచి కిలో రూ.23 వంతున విక్రయాలు చేపట్టారు. తక్కువ ధరకు ఉల్లి విక్రయిస్తున్న విషయం తెలుసుకున్న జనం బారులు తీరారు. మొత్తం 3800 కిలోల ఉల్లిని విక్రయించినట్లు ఎస్టేట్ అధికారి తెలిపారు.

సుబ్రహ్మణ్యుడి హుండీ ఆదాయం రూ.1.35 లక్షలు



చిత్తూరు కల్చరల్: నగర గిరింపేటలోని చెంగల్వరాయకొండపై వెలసిన సుబ్రమణ్యస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1.35 లక్షలు వచ్చినట్లు ఆలయ ఛైర్మన్ సంపత్ తెలిపారు. గురువారం జరిగిన ఆలయ హుండీ లెక్కింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకొని భక్తుల నుంచి కానుకల రూపంలో ఈ ఆదాయం వచ్చిందని చెప్పారు. దీంతోపాటు అర్చన, స్వామి దర్శనం, ఇతర సేవల ద్వారా రూ.77,810 ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సెల్వం, కెన్నడీ, మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాల్లో నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు: ఆర్డీవో కోదండరామిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కోదండరామిరెడ్డి

చిత్తూరు కల్చరల్: చవితి సందర్భంగా ఉత్సవాల పేరిట ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీవో కోదండరామిరెడ్డి హెచ్చరించారు. గురువారం స్థానిక రెవిన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆయన పలు శాఖల అధికారులు, గణపతి ఉత్సవ కమిటీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విగ్రహాలను రోడ్ల మధ్యలో ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించరాదని చెప్పారు. ప్రతిఒక్కరు మట్టి విగ్రహాలను పూజించాలని, రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలను నిషేధించినట్లు గుర్తుచేశారు. వినాయకుడి ప్రతిమలు ఏర్పాటు చేసే ప్రాంతాల్లో భారీ స్పీకర్లు ఏర్పాటు చేయడం, బాణసంచా పేల్చడం ద్వారా స్థానికులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. డీఎస్పీ సుబ్బారావు మాట్లాడుతూ చవితి సందర్భంగా విగ్రహాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు పోలీసుశాఖ నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పీవోపీ విగ్రహాల ఏర్పాటును అడ్డుకునేందుకు టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఎవరైనా విగ్రహాలను విక్రయిస్తే ఆ సమాచారం అందించాలనీ, కాగా, కట్టమంచి చెరువులో నిమజ్జనోత్సవం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీఎస్పీ కేశప్ప, డీటీ గోపాలయ్య, సీఐ చంద్రశేఖర్, వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు గాయత్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సప్తకన్నికలమ్మ హుండీ ఆదాయం రూ.88వేలు

చిత్తూరు అర్బన్: నగర పరిధిలోని 75-దొడ్డిపల్లెలో వెలసిన సప్తకన్నికలమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.88,350 వచ్చినట్లు ఛైర్మన్ నటరాజన్, 3వ డివిజన్ కార్పొరేటర్ నళినీ తిరుకుమరన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెలరోజులకుగాను భక్తుల నుంచి కానుకల రూపంలో ఈ ఆదాయం వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రామచంద్రారెడ్డి, ఇన్‌స్పెక్టర్ సుమన ప్రియ, టీడీపీ నాయకులు తిరుకుమరన్, శివకుమరన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం



మానికొండ చిత్రపటానికి పాత్రికేయుల నివాళులు

చిత్తూరు క్రైం: ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఏపీయూడబ్ల్యూజే) 60వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పాత్రికేయులు గురువారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావంలో కీలకపాత్ర పోషించిన మానికొండ చలపతిరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1957, ఆగస్టు 17న 37 మంది సభ్యులతో ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భవించిందన్నారు. రాష్ట్ర విభజన సమయానికి ఈ సంఖ్య 16 వేలకు పెరిగిందన్నారు. జర్నలిస్టుల సమస్యలపై ఏపీయూడబ్ల్యూజే అలుపెరుగని పోరాటం చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో చిత్తూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి కాళేశ్వరరెడ్డి, కోశాధికారి ప్రకాష్, ఐజేయూ మెంబర్ కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వజ్ర ఒలంపిక్స్ సంబరాలు


ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

చిత్తూరు సిటీ: నగర లిటిల్‌రోస్ పాఠశాలలో వారంరోజుల పాటు నిర్వహించిన వజ్ర ఒలంపిక్స్ సంబరాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను బృందాలుగా విభజించి పలురకాల పోటీలను నిర్వహించారు. ఇందులో అత్యధిక పాయింట్లను సాధించిన ఆక్వా బృందానికి వజ్ర ఒలంపిక్ ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా లిటిల్‌రోస్ పాఠశాల కరస్పాండెంట్ బి.గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ పిల్లల్లో క్రీడాసక్తిని పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో లిటిల్‌రోస్ డైరెక్టర్లు రాధిక, రోహిత్‌కుమార్ పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రామసభలు

యాదమరి: మండల పరిధిలోని 26 పంచాయతీల్లో శనివారం నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పారిజాతం తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే సభల నిర్వహణ లక్ష్యమని తెలిపారు. ఎంపీడీవో, తహసీల్దార్, ప్రజాప్రతినిధులు, జన్మభూమి కమిటీ మెంబర్లు, వీవో లీడర్లు సభల్లో పాల్గొంటారని చెప్పారు.



జనం పన్నులతో జల్సా

● తిరుపతి నగరపాలక సంస్థలో నిధుల దుర్వినియోగం ● ఏడాదికి అక్షరాలా రూ. 60 లక్షలు దుబారా

తిరుపతి నగరం: తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారుల విలాసాలకు ప్రజాధనం దుర్వినియోగం అవుతోంది. ప్రజలు చెల్లించిన పన్నులతో యంత్రాంగం జల్సా చేస్తోంది. హోదాతో సంబంధం లేకుండా చిన్నా చితకా అధికారులకు సైతం అదిరిపోయే ఛాంబర్లను సమకూరుస్తున్నారు. స్ప్లిట్ ఏసీలకు కొదవే లేదు. సొంత వాహనాలను పక్కనపెట్టి ఎంచక్కా అద్దె వాహనాల్లో అధికారులు చక్కర్లు కొడుతూ సంస్థపై ఆర్థిక భారం పెంచుతున్నారు. వీరి నిర్వాకంతో నగరపాలక సంస్థపై ఏడాదికి 60 లక్షల రూపాయలకు పైగా అదనపు భారం పడుతోంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ వంటి భారీ బడ్జెట్ వున్న కార్పొరేషనే పొదుపు మంత్రం జపిస్తుంటే తిరుపతి నగరపాలక సంస్థ పరిస్థితి తద్భిన్నంగా మారింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కమిషనర్ స్థాయి అధికారికి మినహా అందరి ఛాంబర్లలోనూ ఇటీవలే తెలంగాణ ప్రభుత్వం ఏసీలను తొలగించింది. అద్దె వాహనాలకు చెక్ పెట్టి ద్విచక్ర వాహనాలనే ప్రోత్సహిస్తోంది. దీంతో పొదుపునకు పొదుపు. క్షేత్రస్థాయిలో పర్యటించడం కూడా సులభం. అందరూ మెచ్చుకునేలా తెలంగాణలో పొదుపు చర్యలు చేపడుతుంటే ఇక్కడ ఏపీలో మన తిరుపతి నగరపాలక సంస్థలో లక్షలాది రూపాయల నిధులు దుర్వినియోగం అవుతుండడం విస్మయానికి గురి చేస్తుంది.

షాక్ కొడుతున్న కరెంటు బిల్లు

కార్యాలయంలో అధికారులకు ఎప్పటికప్పుడు స్పెషల్ ఛాంబర్లు వెలుస్తూనే ఉంటాయి. అద్దె వాహనాల సంఖ్య తగ్గడమే లేదు. చాలా మంది అధికారులు ఈ వాహనాలను సొంత పనులకు ఉపయోగిస్తుండడం కొసమెరుపు. కమిషనర్ ఛాంబర్‌ను మినహాయిస్తే... కార్యాలయంలో 15 మంది అధికారులకు ప్రత్యేక ఛాంబర్లు ఉన్నాయి. ప్రతి ఛాంబర్‌లో స్ప్లిట్ ఏసీలు పనిచేస్తూనే వుంటాయి. తిరుపతి నగర పాలక సంస్థ నెలనెలా 70-80 వేల రూపాయల వరకు విద్యుత్ బిల్లులకు వ్యయం చేస్తోంది.

అద్దె వాహనాల భారం

విధి నిర్వహణ కోసం సుమారు 15 మంది అద్దె వాహనాలను ఉపయోగిస్తున్నట్టు సమాచారం. సొంత వాహనాలను పక్కన బెట్టి మరీ కొందరు నగరపాలక సంస్థ సమకూర్చుతున్న అద్దె వాహనాల్లో చక్కర్లు కొడుతుంటారు. ఒక్కొక్క వాహనానికి నెలకు 24 వేల రూపాయల దాకా అద్దె చెల్లించాల్సి వస్తోంది. సగటున నెలకు 3.60 లక్షల రూపాయలు, ఏడాదికి 40 లక్షల దాకా అద్దె వాహనాల భారం పడుతోంది. పైగా అధికారులు ప్రధాన రహదారుల్లోనే వాహనాల్లో తిరుగుతున్న కారణంగా క్షేత్రస్థాయిలో పరిశీలన లోపిస్తోందన్న విమర్శలు వున్నాయి.

అప్‌డేట్ కాని టెక్నాలజీ

ప్రభుత్వ పథకాల అమలు, ఆన్‌లైన్ అనుమతులు తదితర అవసరాల కోసం మెరుగైన మార్గాలను వదిలేస్తూ...పాత విధానాలనే అనుసరిస్తున్న కారణంగా ఇటు కార్పొరేషన్ ఖజానాకు భారం అవుతుంటే, అటు సిబ్బంది జేబులకు చిల్లులు పడుతున్నాయి. మార్కెట్‌లో 4 జీ సేవలు అందుబాటులో వున్నా 2జీ, 3జీ సేవలకే సంస్థ పరిమితం కావడం విస్మయపరుస్తోంది. నాలుగేళ్ల కిందట 120 మంది సిబ్బందికి నాటి యంత్రాంగం సిమ్ కార్డులను మంజూరు చేసింది. ఉచిత కాల్స్‌తో పాటు నెట్ వినియోగానికి నెలకు సగటున 7 లక్షల రూపాయల దాకా చెల్లిస్తున్నట్టు అధికార వర్గాలే ధ్రువీకరిస్తున్నాయి. నాలుగేళ్ల కిందటి పరిస్థితులకు అయితే పర్వాలేదు కానీ, ప్రస్తుత పరిస్థితి వేరు. టౌన్ ప్లానింగ్ అనుమతులు, రెవెన్యూలో పన్నుల వసూళ్లు, పెన్షన్ల పంపిణీ తదితర అవసరాలకు నెట్ తప్పనిసరి కావడంతో పాత నెట్ వర్క్‌తో విధులను నిర్వర్తించడం సిబ్బందికి తలనొప్పిగా మారుతోంది. దీంతో పరిమితికి మించి సిబ్బంది ఫోన్ కాల్స్, నెట్‌ను వాడాల్సిన పరిస్థితి. ఈ కారణంగా ప్రతి నెలా తమకు అదనపు భారం తప్పడం లేదని సిబ్బంది వాపోతున్నారు. ఈ పరిస్థితులను చక్కదిద్దితే నగరపాలక సంస్థకు ఏటా 60 లక్షల రూపాయల దాకా భారం తగ్గుతుంది. కింది స్థాయి సిబ్బందికి ఎదురవుతున్న ఇబ్బందులూ తగ్గుముఖం పట్టే అవకాశాలున్నాయి.

ఖాళీ ఖజానాకు కన్నార్పకుండా కాపలా

బందోబస్తుకు ఏటా రూ.40 లక్షలు వృథా

చిత్తూరు కలెక్టరేట్: స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు గడిచినా ఇంకా అలనాటి బ్రిటిష్ కాలపు పోకడలనే ఇంకా అనుసరిస్తున్నాం. ఖాళీ గదులకు రక్షణ పేరిట జిల్లా ఖజానా శాఖ ఏటా రూ.40 లక్షల మేర వృథాగా ఖర్చు చేయడం చూస్తే విస్మయం కలుగుతుంది. పాత కలెక్టరేట్ నుంచి కొత్త కలెక్టరేట్‌లోకి అడుగుపెట్టినా ఈ వృథా తంతు సంవత్సరాల తరబడీ కొనసాగుతుండడం విశేషం. వందేళ్ళకు మించి చరిత్ర కల్గిన పాత కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న జిల్లా హుజూరు(ఖజానా మెయిన్) కార్యాలయంలో బ్రిటీష్ పాలనలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేశారు. అప్పట్లో ఇందులో స్టాంపులు, ప్రశ్నాపత్రాలు, ప్రభుత్వ నగదు, కోర్టుల్లోని వివాదాస్పద డాక్యుమెంట్లు, నగలు, తవ్వకల్లో దొరికే అతి విలువైన వస్తువులు, ఎన్నికల వివాదాల కాగితాలు, నల్ల మందు, తదితరాలు ఇక్కడ భద్రపరుస్తారు. ఇక్కడి సంపదకు ఐదుగురితో కూడిన పోలీసు బృందం కాపలా ఉంటుంది. గిరింపేటలోని పాత కలెక్టరేట్‌ను అప్పటి కలెక్టర్ వి.శేషాద్రి రెడ్డిగుంటలో నిర్మించిన కొత్త కలెక్టరేట్‌కు మార్చడంతో జిల్లా హుజూరు కార్యాలయం సైతం అక్కడికి మారింది. కాని ఖాకీల కాపలా ఇప్పటికీ కొనసాగుతోంది. స్టాంపు పేపర్ల స్థానే రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఈ చలానా పద్ధతి అమల్లో వచ్చింది. దీంతో స్టాంపు పేపర్ల విలువ ఖజానా స్ట్రాంగ్ రూమ్ నుంచి పదేళ్ళ క్రితమే ఆగిపోయింది. టెన్త్, ఇంటర్ ప్రశ్నాపత్రాల నిల్వ ఖజానా స్ట్రాంగ్ రూమ్ నుంచి పోలీసుస్టేషన్లకు ఎప్పుడో మారింది. గతంలో ఇక్కడ నల్ల మందు నిల్వ ఉంచి డాక్టర్ల సిఫార్సుపై వ్యాధిగ్రస్థులకు పంపిణీ జరిపేవారు. ఆ ఆ ప్రక్రియ ఆగి పలు దశాబ్దాలు అయింది. జాతీయ, రాష్ట్ర స్థాయి పరీక్షలు ప్రశ్నాపత్రాలు ఇక్కడే నిల్వ ఉంచేవారు. కానీ విద్యాకేంద్రంగా తిరుపతి రూపు దిద్దుకోవడంతో అట్టి పరీక్షలన్నీ ఇక తిరుపతిలోనే జరుగుతుండటంతో ప్రశ్నాపత్రాలు తిరుపతికే వెళుతున్నాయి. ఇక్కడ కోర్టు వివాదాలు, ఆస్తి తగాదా ముఖ్య పత్రాలు, డాక్యుమెంట్లు, పురాతన వస్తువులు మాత్రమే ప్రస్తుతం నిల్వ ఉంటున్నాయి. ఎన్నికల బ్యాలెట్ పేపర్లు, కాగితాలు ఇక్కడ పెడుతున్నా ఆ తరువాత వీటిని ఈవీఎం గోడౌన్లలో భద్రపరుస్తున్నారు. ఇటువంటి ట్రెజరీ రక్షణకై 24 గంటల పాటు పని చేసే విధంగా ఐదుగురు పోలీసులతో కూడిన బృందం, వీరికి రక్షణగా ఒక వాచ్‌మన్ విధులు నిర్వహిస్తున్నారు. వీరికి జీతభత్యాల కింద ప్రభుత్వం ఏటా రూ. 40 లక్షలకు మించి ఖర్చు చేస్తోంది. ప్రస్తుత కాలానికి ఖజానా స్ట్రాంగ్ రూమ్ ఏ మాత్రం ఉపయోగ పడకపోయినా రూ.40 లక్షలు వృధాగా ఖర్చు అవుతోంది. కోర్టు డాక్యుమెంట్లను జిల్లా కోర్టుకు, ఇతరత్రా వాటిని కలెక్టరేట్‌లోని ఈవీఎం గిడ్డంగుల్లో భద్రపరిస్తే సరిపోతుందని విశ్లేషకులు అంటున్నారు.



జిల్లా ఖజానా వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసు(ఫైల్ ఫోటో)

ముక్కంటి భక్తుల కోసం కైలాససదన్

● రూ.6.60కోట్లతో వసతిగృహ సముదాయం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తుల కోసం భరద్వాజ తీర్థం సమీపంలో రూ.6.60 కోట్ల నిధులతో నిర్మించనున్న కైలాస సదన్ వసతిగృహ సముదాయానికి గురువారం దేవాదాయశాఖ మంత్రి మాణిక్యాలరావు, ఎమ్మెల్యే బొజ్జల గోపాలకృష్ణారెడ్డి భూమిపూజ చేశారు. ఈ సముదాయంలో వంద గదులు నిర్మించాలని అధికారులు మొదట నిర్ణయించారు. అయితే ఈ గదుల సంఖ్యను 120కి పెంచాలని మాణిక్యాలరావు సూచించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పరిధిలో ప్రస్తుతం త్రినేత్ర అతిధి గృహంలో 28, జ్ఞానప్రసూనాంబ సదన్ లో 32, భక్తకన్నప్ప సదన్ లో 35, భరద్వాజ సదన్ లో 36, వరదరాజస్వామి అతిధిగృహంలో 12 గదులు అందుబాటులో ఉన్నాయి. దీంతో పాటు శివసదన్ లో భక్తుల కోసం ప్రత్యేకంగా ఆరు డార్మెటరీలున్నాయి. ముక్కంటి ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో భరద్వాజతీర్థంలో వంద గదుల వసతి సముదాయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. భూమిపూజ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ గురవయ్య నాయుడు, ఈవో భ్రమరాంబ, మాజీ చైర్మన్ కోలా ఆనంద్, ధర్మకర్తల మండలి సభ్యులు జయగోపాల్, వెంకట్రామ నాయుడు, చెత్తమనాయుడు, ప్రమీల్మ, కె.ఉమ, బాలాజీ, సిద్దులయ్య, నారాయణ యాదవ్, లోకనాధం నాయుడు, కె.రమేష్, మల్లిఖార్జున్ గౌడ్, గుర్రప్పశెట్టి తదితరులు పాల్గొన్నారు.


కైలాససదన్ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి మాణిక్యాలరావు

పొన్నేరి భూములపై సర్కారుదే తుది నిర్ణయం

● ముక్కంటి క్షేత్రంలో మాస్టర్ ప్లాన్ అమలు
● అర్చకుల సమస్యలను పరిష్కరిస్తాం
● దేవాదాయ శాఖ మంత్రి మాణిక్యాలరావు

శ్రీకాళహస్తి: తమిళనాడు రాష్ట్రం పొన్నేరి తాలుకా వల్లూరు వద్ద ఉన్న శ్రీకాళహస్తీశ్వరాలయ భూములపై తుది నిర్ణయం ప్రభుత్వానిదేనని దేవాదాయశాఖ మంత్రి మాణిక్యాలరావు స్పష్టం చేశారు.శ్రీకాళహస్తిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడు తూ... వల్లూరు వద్ద ముక్కంటి ఆలయానికి సంబంధించి 24.25 ఎకరాల భూమి ఉందన్నారు. ఈ భూమిలో రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అ నుమతించిందని చెప్పారు. అయితే ధర్మకర్తల మండలి సభ్యులు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. అయితే తుది నిర్ణయం తీసుకునే హక్కు ప్రభుత్వానిదేనని చెప్పారు. ఆలయ ఆదాయం కోసమే రాష్ట్రప్రభుత్వం ఈ నిర్ణ యం తీసుకుందని, మండలి సభ్యులు సహకరించాలని కోరారు.శ్రీకాళహస్తీశ్వరాలయ అభివృద్ధి కోసం మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించిం దని చెప్పారు. మాస్టర్ ప్లాన్ అమలు కోసం రూ.100 కోట్ల నుంచి రూ. 150 కోట్లు ఖర్చువుతుందని మంత్రి తె లియజేశారు. కలెక్టర్ సిద్ధార్థజైన్ బదిలీ కావడంతో మాస్టర్‌ప్లాన్ అమలులో కొంత జాప్యం జరిగిందన్నారు. అయితే ప్రస్తుత కలెక్టర్ ప్రద్యుమ్న మాస్టర్‌ప్లాన్ అమలుకు కసరత్తు చేస్తు న్నారని మంత్రి చెప్పారు. మూడు నెలల్లో పనులకు శ్రీకారం చుడతామని, పట్టణవాసు లు సహకరించాలని కోరారు. బాధితులకు తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో అర్చకులకు, ఈవో భ్రమరాంబకు మధ్య నెల కొన్న వివాదాన్ని ఇరువర్గాలతో చర్చించి పరిష్కరిస్తామని చెప్పారు. ఆలయ ప్రతిష్ట కాపాడేందుకు ప్రతి ఒక్కరూ సహకరిం చాలన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మ కర్తల మండలి పదవీకాలం వచ్చే నెల 14తో ముగుస్తున్న నేపథ్యంలో కొత్తబోర్డును ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నా మన్నారు. మండలి పదవీకాలం పొడిగిస్తా రని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు.ఎమ్మెల్యే బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, ధర్మకర్తల మండలి అధ్యక్షుడు గురవయ్య నాయుడు, మాజీ అధ్యక్షుడు కోలా ఆనంద్, ఈవో భ్రమరాంబ పాల్గొన్నారు.

జంబ్లింగ్ వర్డ్స్

1. BONB ▸.....................
2. YABB ▸.....................
3. TOAC ▸.....................
4. CHIR ▸.....................
5. ICNH ▸.....................

జంతర్‌మంతర్

1. ర్ణయంని ▸.....................
2. భఅయం ▸.....................
3. దులుస్తు ▸.....................
4. రోపక్షం ▸.....................
5. యికిరా ▸.....................

చెప్పగలరా?

విసుగులో ఉన్నా కానీ
ముసుగులో లేను
జేబులో ఉన్నా కానీ జాబులో లేను
గీతలో ఉన్నా కానీ గీటులో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

సూక్తి

సమస్త తప్పిదాలకూ కారణం మనసు. దాన్ని సరిగ్గా ఉంచుకుంటే ఎప్పటికీ తప్పులు చేయవు.
- గౌతమ బుద్ధుడు

'ఐక్యూ'లో ఐన్‌స్టీన్‌ను దాటేశాడు!



ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా రాహుల్ అనే కుర్రాడి ఐక్యూ (ఇంటెలిజెంట్ కోషంట్) గురించి గూగుల్‌ను ఎక్కువ శాతం అడుగుతున్నారట. బ్రిటన్‌లోని చానెల్ 4 టీవీలో 'చైల్డ్ జీనియస్' కార్యక్రమం ప్రారంభమైంది. తొలి రౌండ్‌లోనే గట్టోడు అనిపించుకున్న రాహుల్ ఓవర్‌నైట్ హీరో అయ్యాడు. ఈ బుడతడు భారత సంతతికి చెందినవాడు కావటం మరో విశేషం.

రాహుల్ కుటుంబం ఉత్తర లండన్‌లోని బార్నెట్ ప్రాంతంలో నివసిస్తోంది. రాహుల్ తండ్రి మనీష్ ఐటి కంపెనీలో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. తల్లి కోమల్ ఫార్మసిస్ట్. రాహుల్ వయసు పన్నెండేళ్లు. బ్రిటన్‌లోని 4 చానల్‌లో ఓ వారం పాటు జరిగిన 'చైల్డ్ జీనియస్' కార్యక్రమంలో రాహుల్ పాల్గొంటున్నాడు. ఈ పోటీ కోసం సదరు కార్యక్రమ నిర్వాహకులు 8-12 ఏళ్లలోపు వయసున్న 20 మందిని ఎంపిక చేశారు. వారే పోటీలో పాల్గొంటారు. తొలి రౌండ్‌లోనే రాహుల్ కత్తిలాంటి కుర్రాడనిపించుకున్నాడు. స్పెల్లింగ్ టెస్ట్‌లో పూర్తి మార్కులు పొందాడు. జ్ఞాపకశక్తి పరీక్షలో 15 ప్రశ్నలకు గానూ 14 ప్రశ్నలకు సరైన సమాధానాలిచ్చాడు. అతని ఐక్యూ లెవల్‌ను 162గా నిర్ధారించారు. ఇది ఐన్‌స్టీన్, స్టీఫెన్ హాకింగ్ ఐక్యూ లెవల్ కంటే ఎక్కువ కావటంతో రాహుల్ మోస్ట్ పాపులరయ్యాడు. ఇక తదుపరి పరీక్షల తర్వాత ఈ వీకెండ్‌లో విజేతను ప్రకటిస్తారు.


4 చానల్ 'చైల్డ్ జీనియస్' కార్యక్రమానికి హాజరైన చిన్నారులు

లాటిన్ భాషపై ప్రేమ..

"మ్యాథ్స్, జీకే అంటే ఇష్టం. నా ఫేవరేట్ భాష లాటిన్. నాకు తెలిసి నేను మేధావి అనుకుంటా. ఏ విషయాన్నైనా సులువుగా గుర్తుంచుకుంటాను. ఎప్పుడూ అందరికంటే ది బెస్ట్ ఉండాలి.. అనుకునే మెంటాలిటీ నాది" అంటూ రాహుల్ చెప్పుకొచ్చాడు. ఏదైనా రివైజ్ చేసుకోలేకపోతే రాహుల్ బాధపడిపోతాడట. ఆటలాడుకునే ఆడుకునే ఎక్స్ బాక్స్ తన దగ్గర ఉంటే తెగ హ్యాపీగా ఫీలవుతాడట ఈ బాల మేధావి.

మా వాడే విజేత

రాహుల్ జ్ఞాపకశక్తి భేష్ అంటూ సోషల్ మీడియాలో కామెంట్స్ ఎక్కువగా కనిపిస్తున్నాయి. అన్నట్లు విశేషమేంటంటే రాహుల్ శిక్షణ తీసుకుంది స్వయాన తన తండ్రి దగ్గరే. మొత్తానికి రాహుల్ తలితండ్రులు మాత్రం ఈ పోటీలో తమ కొడుకు విజేతగా నిలుస్తాడని నమ్మకంగా చెబుతున్నారు. ఈ వారాంతంలో జరిగే ఫైనల్‌లో రాహుల్ విజేత కావాలని మనమూ కోరుకుందాం!


టంగ్ ట్విస్టర్స్

1. Who ever slit the sheets is a good sheet slitter.
2. Crush grapes, grapes crush, crush grapes.
3. There was a minimum of cinnamon in the aluminum pan
5. A black bloke's back brake-block broke.


ఔనా!

ఎక్కువ ఐక్యూ (ఇంటెలిజెంట్) ఉన్న వాళ్లకు బ్రెయిన్ యాక్టివిటీ కూడా ఎక్కువే! ఆ కారణంగా వీళ్ల డిప్రెషన్‌కు గురైతే ఆ ప్రభావం మిగతా వాళ్లకంటే వీళ్లపై 3 రెట్లు ఎక్కువగా ఉంటుంది.

బొమ్మ గీయండి



రంగులు అద్దండి




నవ్వుల్ నవ్వుల్

టీచర్: రోహిత్ కళ్లు మూసుకుని రాస్తున్నావేంటి?
రోహిత్ : పరీక్షల్లో చూసి రాయకూడదని మా అమ్మ చెప్పింది టీచర్.
టీచర్: !!!


చుక్కలు కలపండి



దారి కనుక్కోండి



జత పరచండి



జవాబులు

జంబ్లింగ్ వర్డ్స్ : 1. NOBB 2. BABY 3. COAT 4. RICH 5. CHIN **జంతర్‌మంతర్ :** 1. నిర్ణయం 2. అభయం 3. దుస్తులు 4. పరోక్షం 5. కిరాయి **చెప్పగలరా? :** విజేత

మహిళ



గాజుల గలగలలు

మహిళల చేతులకు గాజులు మరింత అందాన్నిస్తాయి. అందువల్లే రకరకాల వెరైటీ గాజులను కలిపి వేసుకోవడంపై ఆసక్తి చూపుతారు. తాము ధరించే చీర, డ్రస్ ఏదైనా అందులోని రంగులకు అనుగుణంగా గాజుల సెట్ వేసుకుంటారు. పెళ్లిళ్లు, రిసెప్షన్లు, పుట్టిన రోజు వేడుకలు, చిన్నపాటి ఫంక్షన్లతోపాటు రోజూ వేసుకునే గాజుల్లోనూ మగువలు ప్రత్యేక తను చూపుతారు. సాదా గాజులు, హైదరాబాద్ కట్టింగ్ గాజులు, పూత గాజులు, డిజైన్ సెట్, మ్యాచింగ్ గాజులు, మనసుదోచే రంగుల్లో తిరుపతి నాదముని వీధిలో ఉన్న శ్రీలక్ష్మీనారాయణ బ్యాంగిల్స్ స్టోర్‌లో అందుబాటు ధరల్లో లభిస్తున్నాయి. డ్రస్‌లు చూపెడితే చాలు.. దానికి తగ్గ మ్యాచింగ్ గాజులను కనీసం రెండు మూడు వెరైటీలతో నాలుగైదు రంగులను క్షణాల్లో సెట్‌చేసి చూపుతారు నిర్వాహకులు పద్మ, రవికుమార్. ఇంకెందుకాలస్యం గాజుల గల గలలను ఆస్వాదించండి మరి.

- తిరుపతి (తిలక్‌రోడ్)







భళారే

బాహుబలి-2 డ్రస్ మెటీరియల్

బాహుబలి-2 సినిమాలో హీరోయిన్ ధరించిన మోడల్ డ్రస్ మెటీరియల్ ఇప్పుడు మార్కెట్‌లో సందడి చేస్తోంది. మహిళలు ఈ డ్రస్ మెటీరియల్‌ను పోటీపడి మరీ కొనుగోలు చేస్తున్నారు. అదీ రూ.999 నుంచి రూ.1899 మధ్య ధరల్లోనే లభిస్తున్నాయి. మీకూ కావాలంటే.. చిత్తూరు చర్చి వీధిలోని శ్రీవళ్ళి సిల్క్స్ అండ్ ఫ్యాషన్స్‌కు వెళ్లాల్సిందే.

- చిత్తూరు అర్బన్



బాహుబలి-2 డ్రస్ మెటీరియల్‌ను ఆసక్తిగా చూస్తున్న మహిళలు

ఆ కటింగ్ స్టైలే వేరయా..!



పుంగనూరులో హెయిర్ కటింగ్ చేస్తున్న బ్యూటీషియన్ కవిత

పాత కాలంలో మహిళలు పొడవాటి వాలు జడలతో తలనిండా పూలతో సింగారించుకుని మురిసిపోయేవారు. అప్పట్లో ఉమ్మడి కుటుంబాలు ఉండటంతో ఇటువంటి జడల అలంకరణలకు మరో మనిషి సాయం ఉండేది. ప్రస్తుత పరిస్థితుల్లో ఆ అవకాశం లేదు. అదీగాక నేటి మహిళలు ఉద్యోగాలవైపు మొగ్గు చూపుతున్నారు. ఈ పరిస్థితుల్లో పొడవాటి జడలంటే కొంత కష్టమే. దీన్ని దృష్టిలో ఉంచుకునే వెరైటీ కటింగ్‌లు చేసే బ్యూటీపార్లర్లు వచ్చేశాయి. మారుమూల గ్రామాల్లోని మహిళలు సైతం వీటికే ప్రాధాన్యమిస్తున్నారు. పార్లర్లలో కటింగ్ ప్రాముఖ్యం, పనిని బట్టి చార్జి వసూలు చేస్తున్నారు. పుంగనూరు లాస్య బ్యూటీ పార్లర్‌లో అయితే ఫీడర్ కటింగ్‌కు రూ.250, సీ కటింగ్‌కు రూ.150, లేయర్ కటింగ్‌కు రూ.250, స్టెప్ కటింగ్ రూ.350, లైట్ యు కటింగ్‌కు రూ.100, స్ట్రైట్ కటింగ్‌కు రూ.100 చొప్పున బ్యూటీషియన్ కవిత వసూలు చేస్తున్నారు.

- పుంగనూరు



లేయర్ కటింగ్ - స్టెప్ కటింగ్



సీ కటింగ్



స్ట్రైట్ కటింగ్

● చిట్కా

అరటి, బెండ, వంగ, బీర, పొట్ల, గుమ్మడి, చిక్కుడు, దొండ, దోస, పనసకాయల కూరల్లో పోషకాలు అలానే ఉండాలంటే వండేటప్పుడు వాటిపై మూత ఉంచకూడదు.

Who can approach Insurance Ombudsman?

BANKING KNOWLEDGE / FINANCIAL AWARENESS

BANK PO/ CLERKS EXAM SPECIAL

1. What is PMVVY? Give details.
a) Pradhan MantriVayaVandanaYojana (PMVVY)
b) The scheme is open to people aged 60 years and above
c) For monthly pension, the minimum amount to be invested is Rs.1.5 lakhs and the maximum is Rs.7.5 lakhs. LIC has been given mandate to operate the scheme
d) The scheme is exempt from GST
e) All the above

2. When currency notes of denominations of Rs. 1000 and Rs. 500 (specified bank notes or SBNs), valued at Rs. 15.4 trillion and constituting 86.9 percent of the value of total notes in circulation, were demonetized?
a) 2015 b) November 8, 2016
c) 2014 d) 2012 e) 2011

3. MSM releases will also feature salient facts, data and tables that are germane to the topic. What is MSM (in RBI)?
a) Money Street Memos
b) Mint Street Memos
c) Many Street Memos
d) Most Stressed Memos
e) None of these

4. Current Account and Saving Account (CASA) deposits are called as what?
a) High cost deposits b) Costly deposits
c) Low cost deposits d) Fixed deposits
e) None of these

5. Pradhan Mantri Jan-DhanYojana (PMJDY) accounts can be linked with which of the following?
a) Aadhar card number and mobile phone number
b) PMSBY or PMJJBY c) APY
d) All the above e) None of these

6. A significant amount of Specified Bank Notes (SBNs) viz., Rs.500 (old) & Rs. 1000 (old) flowed into which of the following special types of accounts in 2016?
a) Basic Saving Bank Deposit Account (BSBDA);
b) PMJDY Accounts; Kisan Credit Card (KCC);
c) Dormant or inoperative accounts; co-operative banks' accounts with SCBs;
d) Bullion trader/jewellers' accounts; and loan accounts.
e) All the above

7. About 85 per cent of the total collections by LIC of India in November 2016 were under which of the following?
a) The 'single premium' policies, which are paid in lump sum
b) Monthly c) Quarterly
d) Annually e) None of these

8. The Reserve Bank's Central Board, at its meeting held recently, approved the transfer of surplus to the Government of India amounting to Rs. 306.59 billion for the year ended________ .
a) June 30, 2017 b) December 2016
c) March 31, 2017 d) April 30, 2017
e) None of these

9. Which type of General Insurance Policies can be purchased online?
a) Motor (2-wheeler & Private car)
b) Health/ Personal Accident/
c) Overseas Mediclaim/ Householder/
d) Shopkeeper/ Pravasi Bhartiya Bima Yojana
e) All the above

10. When a person can renew his general insurance policy?
a) Only from 30 days before the expiry date of policy till the date of expiry
b) Within one year from the date of expiry
c) Within 2 years from the date of expiry
d) Within 5 years from the date of expiry
e) None of these

11. Who are entitled to join PRADHAN MANTRI SURAKSHA BIMA YOJANA?
a) All savings bank account holders in the age 18 to 70 years in participating banks
b) Below 5 years of age
c) Below 10 years of age
d) Below 12 years of age
e) None of these

12. What is the premium per member under PMSBY?
a) Rs.12/- per annum per member
b) Rs.100/- c) Rs.150/-
d) Rs.250/- e) None of these

13. Who is the Master Policy Holder for PMSBY?
a) LIC b) RBI
c) Participating Bank will be the Master policy holder on behalf of the participating subscribers
d) NABARD e) None of these

14. What is "Group insurance"?
a) Insurance for only one person
b) Insurance cover obtained by a group of individuals, either through an employer or otherwise, under a single contract;
c) Insurance for a married couple only
d) Insurance only for unmarried person
e) None of these

15. What is the method of Appropriation of Premium in PMSBY?
a) Insurance Premium to Insurance Company: Rs.10/- per annum per member
b) Reimbursement of Expenses to BC/ Micro/Corporate/Agent : Rs.1/- per annum per member
c) Reimbursement of Administrative expenses to participating Bank: Rs.1/- per annum per member
d) All the above e) None of these

16. Insurance Ombudsmen are appointed by the Governing Body and are empowered to entertain which type of complaints in respect of personal line insurances?
a) any partial or total repudiation of claims by an insurer
b) Any dispute in regard to premium paid or payable in terms of the policy
c) any dispute on the legal construction of the policies in so far as such disputes relate to claims
d) delay in settlement of claims; and non-issue of any insurance document to customers after receipt of premium
e) All the above

17. Who can approach Insurance Ombudsman?
a) Any aggrieved individual who has taken an insurance policy on persona lines
b) if deceased the legal heir(s) under such policy
c) Both (a) and (b) d) Supreme Court
e) None of these

18. Is there any time limit to approach the insurance ombudsman?
a) Within one year of the rejection by the insurer of the representation of the complaint or the insurer's final reply to the representation
b) Within 2 years c) Within 4 years
d) Within 5 years e) None of these

19. When the accident cover for the member shall terminateand nobenefit will be payable, under PMSBY?
a) On attaining the age of 50 years
b) On attaining age 70 years (age nearest birth day).
c) On attaining the age of 40 years
d) On attaining the age of 30 years
e) None of these

20. Aninsurance Ombudsman shall be appointed for a term of how many years? Give details?
a) 3 years
b) Shall be eligible for reappointment provided that no person shall hold office as an Ombudsman after he has attained the age of seventy years.
c) Both (a) and (b)
d) After the age of 75 years
e) None of these

21. ''Health insurance business'' means the effecting of contracts for which of the following ?
a) For sickness benefits
b) Medical, surgical or hospital expense benefits, whether in-patient or out-patient travel cover and
c) Personal accident cover
d) All the above e) None of these

22. No policy of life insurance shall be called in question on any ground whatsoever after the expiry of how many years from the date of the policy? (i.e., from the date of issuance of the policy or the date of commencement of risk)
a) three years b) 4 years c) 5 years
d) 6 years e) None of these

23. A contract of marine insurance is an agreement whereby the insurer undertakes to indemnify the assured, in the manner and to the extent thereby agreed, against which of the following?
a) Marine losses, that is to say, the losses incidental to marine adventure
b) Air cargo c) Railway transport
d) Road transport e) None of these

24. State Bank of India (SBI) has informed that it has introduced 'Work from Home Policy' for whom? Give details?
a) Permanent Officers in the Bank.
b) The facility can be availed occasionally up to 5 days a month or for a longer duration
c) It is subject to approval by the Competent Authority not less than officers in the grade of TEGS-VI i.e. Deputy General Manager/TEGSS-I i.e. Chief General Manager
d) All the above e) None of these

25. Which bank has launched a facility where by its existing customers can avail personal loansupto Rs.15 lakhs at its ATMs?
a) ICICI Bank b) Citi Bank
c) American Express d) SBI
e) None of these

26. The second life insurer in India to go public soonis?
a) SBI Life b) LIC
c) New India Insurance
d) United India Insurance
e) Oriental Insurance

Praturi Potayya Sarma

ANSWERS

1) e	4) c	7) a	12) a	17) c	22) a
2) b	5) d	8) a	13) c	18) a	23) a
3) b	6) e	9) e	14) b	19) b	24) d
		10) a	15) d	20) c	25) a
		11) a	16) e	21) d	26) a

ఉద్యోగాలు

బిఎంఆర్‌సిఎల్

బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (బిఎంఆర్‌సిఎల్)- కాంట్రాక్ట్ ప్రాతిపదికన సెక్షన్ ఇంజనీర్ పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది. **ఖాళీలు: 20**

కాంట్రాక్ట్ వ్యవధి: మూడేళ్లు

విభాగాలు - ఖాళీలు: టెలికం 2, ట్రాక్షన్ 2, ఎఎఫ్‌సి 2, సిగ్నలింగ్ 1, సివిల్ / ఆర్ఎస్ఎస్ 2, సిస్టం డిజైన్ 2, ఇ & ఎం లిఫ్ట్స్ & ఎస్కలేటర్స్ 3, టివిఎస్ & ఇసిఎస్ 2, డిపో 2

వేతనం: నెలకు రూ.35910 + ఇతర అలవెన్సులు

అర్హత: (డిప్లొమా/ బిఇ/ బిటెక్)(మెకానికల్/ ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్స్/ మెకట్రానిక్స్/ ఎలక్ట్రికల్ పవర్ సిస్టమ్స్/ ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్/ ఇన్‌స్ట్రుమెంటేషన్ / ఇండస్ట్రియల్ కంట్రోల్/ టెలి కమ్యూనికేషన్ / అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్/ కంప్యూటర్ సైన్స్/ డిజిటల్ ఎలక్ట్రానిక్స్/ కంప్యూటర్ నెట్ వర్కింగ్/ పవర్ ఎలక్ట్రానిక్స్/ సివిల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: 35 ఏళ్లు మించరాదు

ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా

అభ్యర్థులు ముందుగా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకొని దాని హార్డు కాపీని కింది చిరునామాకు పంపుకోవాలి.

దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: ఆగస్టు 26

చిరునామా: General Manager(HR), Bangalore Metro Rail Corporation Limited, III Floor, BMTC Complex, K.H.Road, Shanthinagar, Bangalore 560027

వెబ్‌సైట్: www.kannada.bmrc.co.in

అడ్మిషన్స్

ఎస్‌కెఎల్‌టిఎస్‌హెచ్ యు

హైదరాబాద్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వ విద్యాలయం (ఎస్‌కెఎల్‌టిఎస్ హెచ్ యు)- ఉద్యాన **బిఎస్సీ (ఆనర్స్)**లో ప్రవేశానికి ఉద్దేశించిన **హార్టి సెట్ 2017**కు దరఖాస్తులు కోరుతోంది.

దరఖాస్తు స్వీకరణకు ఆఖరు తేదీ: ఆగస్టు 31

దరఖాస్తు పంపాల్సిన చిరునామా: ద రిజిస్ట్రార్, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం, రాజేంద్ర నగర్, హైదరాబాద్ - 500030

వెబ్‌సైట్: www.skltshu.ac.in

ఐఐఎఎస్

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీ (ఐఐఎఎస్)- కింద పేర్కొన్న రీసెర్చ్ విభాగాల్లో **ఫెలోషిప్**లకోసం దరఖాస్తులు కోరుతోంది

రీసెర్చ్ విభాగాలు: సోషల్/ పొలిటికల్ అండ్ ఎకనామిక్ ఫిలాసఫీ/ కంపేరటివ్ ఇండియన్ లిటరేచర్ (యాన్షెంట్/ మెడ్‌లెవల్/మోడ్రన్ / ఫోక్/ ట్రైబల్)/ కంపేరటివ్ స్టడీస్(ఫిలాసఫీ/ రెలిజియన్ / హిస్టరీ-హిస్టరియోగ్రఫీ, ఫిలాసఫీ ఆఫ్ హిస్టరీ)/ ఎడ్యుకేషన్ / కల్చర్/ ఆర్ట్స్ - పర్ఫార్మింగ్ ఆర్ట్స్, క్రాఫ్ట్స్/ ఫండమెంటల్ కాన్సెప్ట్స్ అండ్ ప్రాబ్లమ్స్ ఆఫ్ లాజిక్ అండ్ మేథమెటిక్స్/ ఫండమెంటల్ కాన్సెప్ట్స్ అండ్ ప్లాబ్లమ్స్ ఆఫ్ నేచురల్ అండ్ లైఫ్ సైన్సెస్/ స్టడీస్ ఇన్ ఎన్విరాన్‌మెంట్/ ఇండియన్ సివిలైజేషన్ ఇన్ ద కాంటెక్స్ట్ ఆఫ్ ఏషియన్ నైబర్స్/ ప్రాబ్లమ్స్ ఆఫ్ కాంటెంపరరీ ఇండియా ఇన్ ద కాంటెక్స్ట్ ఆఫ్ నేషనల్ ఇంటిగ్రేషన్ అండ్ నేషన్ బిల్డింగ్


ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్ లోడ్ చేసుకొని నింపి కింది చిరునామాకు పంపుకోవాలి.

దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 30

చిరునామా: Secretary, Indian Institute of Advanced Study, Shimla- 171005

వెబ్‌సైట్: www.iias.ac.in

భారతదేశ భూగోళశాస్త్ర పితామహుడు ఎవరు?



పర్వతం నాగార్జున
సీనియర్ ఫ్యాకల్టీ

భూగోళశాస్త్రం

1. 'జాగ్రఫీ' పదాన్ని మొదట ఉపయోగించిన శాస్త్రవేత్త?
ఎ) హెకాటియస్ బి) ఫ్రెడరిక్ రాట్జెల్
సి) ఎరటోస్థనీస్ డి) అరిస్టాటిల్
2. భూగోళశాస్త్ర పితామహుడు ఎవరు?
ఎ) రాట్జెల్ బి) హెకాటియస్
సి) అరిస్టాటిల్ డి) అనాగ్జిమెండర్
3. ఆధునిక భూగోళశాస్త్ర పితామహుడు ఎవరు?
ఎ) ఎరటోస్థనీస్ బి) అల్‌ఇద్రిసి
సి) అలెగ్జాండర్ వాన్ హంబోల్ట్ డి) టాలమి
4. భారతదేశ భూగోళశాస్త్ర పితామహుడు ఎవరు?
ఎ) జెమ్స్ రన్నెల్ బి) సర్‌జాన్ ఎవరెస్ట్
సి) విలియం లాంబ్టన్ డి) ఎవరూ కాదు
5. రాజకీయ భూగోళశాస్త్ర వ్యవస్థాపకుడు ఎవరు?
ఎ) అరిస్టాటిల్ బి) ఫ్రెడరిక్ రాట్జెల్
సి) హెకాటియస్ డి) మెర్కెటర్
6. శాస్త్రీయంగా మొదటి ప్రపంచ పటం తయారు చేసింది?
ఎ) హెకాటియస్ బి) అల్‌ఇద్రిసి
సి) టాలమి డి) అనాగ్జిమెండర్
7. 'అట్లాస్' పదాన్ని తొలిసారి ఉపయోగించింది ఎవరు?
ఎ) మెర్కెటర్ బి) చైనీయులు
సి) రాట్జెల్ డి) కార్ల్ రిట్టర్
8. ప్రపంచ పటంలో దక్షిణాన్ని పైభాగంలో చూపింది ఎవరు?
ఎ) టాలమి బి) అల్‌ఇద్రిసి
సి) మెర్కెటర్ డి) హెకాటియస్
9. భూగోళశాస్త్ర బైబిల్ అని ఏ గ్రంథాన్ని పిలుస్తారు?
ఎ) ఆస్ట్రాలజి బి) కాల్గొగ్రఫి
సి) అల్మజిస్ట్ డి) ఏదీకాదు
10. సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన కోపర్నికస్ ఏ దేశస్థుడు?
ఎ) పోలెండ్ బి) గ్రీక్ సి) స్పెయిన్ డి) హాలెండ్
11. రోదసీ యాత్రికుడికి బయట ఉన్న ఆకారం ఏ రంగులో కనిపిస్తుంది?
ఎ) నీలం బి) ఎరుపు సి) తెలుపు డి) నలుపు
12. కింది వాటిలో విశ్వ ఆవిర్భావ సిద్ధాంతం కానిది ఏది?
ఎ) భూకేంద్రక సిద్ధాంతం బి) బిగ్ బ్యాంగ్ సిద్ధాంతం
సి) జోలనా సిద్ధాంతం
డి) నిరంతరసృష్టి సిద్ధాంతం
13. జోలనా సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది ఎవరు?
ఎ) జార్జ్ అబ్జెలియోటర్
బి) అలెన్ శాండెజ్
సి) హెర్మన్ బాండీ డి) థామస్ గోల్డ్
14. వాయు పరికల్పన సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది ఎవరు?
ఎ) లాప్లాస్ బి) ఇమాన్యూయెల్ కాంట్
సి) చాంబర్లీన్ & మౌల్టన్
డి) రస్సెల్
15. గ్రహాల పరికల్పన సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది ఎవరు?
ఎ) ఇమాన్యూయెల్ కాంట్ బి) లాప్లాస్
సి) జీన్స్ & జెఫ్రిన్ డి) చాంబర్లీన్ & మౌల్టన్
16. విశ్వ దీవులు అని వేటిని అంటారు?



ఎ) గెలాక్సీలను బి) నిహారికలను
సి) దుమ్ముధూళి కణాలను
డి) శూన్య ప్రదేశాన్ని
17. పాలపుంతకు సమీపంలో ఉన్న గెలాక్సీ ఏది?
ఎ) హైడ్రా బి) క్లస్టర్
సి) ఆండ్రొమెడా డి) బెటిల్‌గ్లక్స్
18. విశ్వంలో అతి పెద్ద నక్షత్రం ఏది?
ఎ) సూర్యుడు బి) సిరియాస్
సి) ప్రాక్సిమాసెంటావరి డి) బెటిల్‌గ్లక్స్
19. విశ్వంలో దూరాలను కొలవడానికి ఉపయోగించే అతి పెద్ద ప్రమాణం ఏది?
ఎ) కాంతి సంవత్సరం బి) అస్ట్రానామికల్ యూనిట్
సి) పార్‌సెక్ డి) ఏదీకాదు
20. ఒక కాంతి సంవత్సరం =
ఎ) 9.3×8^{10} km బి) 9.8×10^{12} km
సి) 9.3×10^{12} km డి) 9.4×10^{12} km
21. దక్షిణ ధృవం వద్ద నుంచి ఆకాశంలో కనిపించే నక్షత్ర సమూహాన్ని ఏమంటారు?
ఎ) ఉర్సమెజర్ బి) గ్రెట్‌బేర్
సి) సప్తర్షి మండలం డి) ఉర్సమైనర్
22. గెలాక్సీలకు, నిహారికలకు మధ్య గల ఖాళీ ప్రదేశ శాతం ఎంత?
ఎ) 97% బి) 98% సి) 99% డి) 96%
23. పాలపుంత అనే గెలాక్సీని 'స్వర్గానికి దారులు' అని ఏ దేశస్థులు పిలుస్తారు?
ఎ) చైనా బి) గ్రీక్
సి) హిబ్రూ డి) ఎస్కిమోలు

పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

24. చైనా అంతరిక్ష నావికులను ఏమని పిలుస్తారు?
ఎ) ఆస్ట్రోనాట్స్ బి) కాస్మోనాట్స్
సి) టైకోనాట్స్ డి) ఏదీకాదు
25. నక్షత్రాలకు జన్మస్థానాలు అని వేటిని అంటారు?
ఎ) గెలాక్సీలు బి) నిహారికలు
సి) పాలపుంత డి) శూన్యప్రదేశం
26. కృష్ణబిలాలను కనుగొన్న శాస్త్రవేత్త ఎవరు?
ఎ) ఐన్‌స్టీన్ బి) రాస్‌గన్
సి) స్టీఫెన్ హాకిన్స్ డి) ఆల్ఫ్‌వెన్
27. కృష్ణబిలాలపై పరిశోధన చేసిన భారతీయుడు ఎవరు?
ఎ) సుబ్రమణ్యం చంద్రశేఖర్
సి) వెంకట్రామన్ రాధాకృష్ణన్
సి) హరగోవింద్ ఖొరానా డి) ఎవరూ కాదు
28. నక్షత్రాల్లో అధిక శాతం గల వాయువు?
ఎ) హీలియం బి) నైట్రోజన్
సి) ఆక్సిజన్ డి) హైడ్రోజన్
29. నక్షత్రాల్లో ఉష్ణోగ్రతను కొలిచే పరికరం?
ఎ) క్రైమోమీటర్ బి) కాస్మోక్రొనా
సి) పైరోమీటర్ డి) ఏదీకాదు
30. గ్రహాల జాబితా నుంచి తొలగించిన ప్లూటో గ్రహానికి ఏ నంబర్ కేటాయించారు?
ఎ) 134340 బి) 144240 సి) 134240 డి) 134342
31. సూర్యుని పరిభ్రమణ కాలం ఎంత?
ఎ) 250 కాంతి సంవత్సరాలు
బి) 250 మిలియన్ సంవత్సరాలు
సి) 27 మిలియన్ సంవత్సరాలు డి) ఏదీకాదు
32. సూర్యుని కాంతి భూమిని చేరడానికి పట్టే కాలం?
ఎ) 500 సెకన్లు బి) 600 సెకన్లు
సి) 450 సెకన్లు డి) 550 సెకన్లు
33. ఉదయం, సాయంత్రం సమయాల్లో సూర్యునిలో కనిపించే భాగం ఏది?
ఎ) ఫోటోస్పియర్ బి) కరోనా
సి) క్రోమోస్పియర్ డి) ఏదీకాదు
34. ఆకాశంలో ఇంద్రధనస్సు ఏర్పడటానికి కారణం?
ఎ) కాంతి విక్షేపణం బి) కాంతి పరిక్షేపణం
సి) కాంతి అవక్షేపణం డి) కాంతి వివర్తనం
35. సూర్యునికి, భూమికి మధ్య ఉండే గరిష్ఠ దూరం?
ఎ) 147 మిలియన్ కిమీ.
బి) 149.5 మిలియన్ కిమీ.
సి) 152 మిలియన్ కిమీ.
డి) 153 మిలియన్ కిమీ.
36. సూర్యగ్రహణ సమయంలో సూర్యునిలో కనిపించే భాగం?
ఎ) ఫొటోస్పియర్ బి) క్రోమోస్పియర్
సి) కరోనా డి) ఏదీకాదు
37. సూర్యునిలో అతి చల్లని ప్రాంతం?
ఎ) క్రోమోస్పియర్ బి) సూర్యాంకాలు
సి) కరోనా డి) ఏదీకాదు
38. సూర్యుని గురుత్వాకర్షణశక్తి భూమి కంటే ఎన్ని రెట్లు ఎక్కువ?
ఎ) 28 రెట్లు బి) 27 రెట్లు సి) 13 రెట్లు డి) 29 రెట్లు
39. సూర్యునిలో అత్యంత వేడిగా ఉండే ప్రాంతం?
ఎ) ఫొటోస్పియర్ బి) క్రోమోస్పియర్
సి) కేంద్రం డి) ఏదీకాదు
40. ఉదయం, సాయంత్రం సమయాల్లో సూర్యునిలో కనిపించే రంగులు?
ఎ) ఎరుపు, నారింజ బి) ఎరుపు, ఆకుపచ్చ
సి) ఎరుపు, తెలుపు డి) ఎరుపు - పసుపు

సమాధానాలు		13) బి	20) సి	27) ఎ	34) ఎ
1) సి	7) ఎ	14) బి	21) డి	28) డి	35) సి
2) బి	8) బి	15) డి	22) ఎ	29) సి	36) సి
3) సి	9) సి	16) ఎ	23) బి	30) ఎ	37) బి
4) ఎ	10) ఎ	17) సి	24) సి	31) బి	38) ఎ
5) బి	11) డి	18) డి	25) బి	32) ఎ	39) సి
6) డి	12) ఎ	19) సి	26) సి	33) సి	40) ఎ

ఉద్యోగాలు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా - రెగ్యులర్ & కాంట్రాక్ట్ స్పెషలిస్ట్ ఆఫీసర్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 21
రెగ్యులర్ పోస్టులు: డిజిఎం(సైబర్ సెక్యూరిటి) 1, ఎజిఎం(సైబర్ సెక్యూరిటి) 1, డిఎం(ఐఎస్ ఆడిట్) 5
కాంట్రాక్ట్ పోస్టులు: వైస్ ప్రెసిడెంట్- కస్టమర్ అనలిటిక్స్(ఎసెట్ ప్రోడక్ట్) 1, సీనియర్ మేనేజర్(ప్రోడక్ట్ స్పెషలిస్ట్) 2, వైస్ ప్రెసిడెంట్ - కంప్లయింట్స్ మేనేజ్‌మెంట్ 1, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ (ఐఎస్ ఆడిట్) 5, సీనియర్ మేనేజర్ (ఐఎస్ ఆడిట్) 5
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 22
దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: ఆగస్టు 31
వెబ్‌సైట్: www.sbi.co.in

సిసిఆర్‌హెచ్

సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ హోమియోపతి (సిసిఆర్‌హెచ్)- కాంట్రాక్ట్ ప్రాతిపదికన **జూనియర్ రీసెర్చ్ ఫెలో**ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 5
క్యాంపస్‌లు: రీజనల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, గుడివాడ క్లినికల్ రీసెర్చ్ యూనిట్, తిరుపతి
వేతనం: నెలకు రూ.25,000 + హెచ్ ఆర్‌ఏ
ఎంపిక: టెస్ట్/ ఇంటర్వ్యూ ద్వారా
ఇంటర్వ్యూ: ఆగస్టు 26న
వెబ్‌సైట్: www.ccrhindia.nic.in

ఐఐఎఫ్‌పిటి

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ (ఐఐఎఫ్‌పిటి)- కింది పోస్టుల భర్తీకోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
పోస్టులు - ఖాళీలు: రీసెర్చ్ అసోసియేట్ 1, సీనియర్ రీసెర్చ్ ఫెలో 2, జూనియర్ రీసెర్చ్ ఫెలో 4, ప్రాజెక్ట్ అసిస్టెంట్ 2
దరఖాస్తు ఫీజు: 500 **ఇంటర్వ్యూ:** ఆగస్టు 22న
వేదిక: Indian institute of food processing Technology, pudukkottai road, Thanjavur-613005, Tamilnadu.
వెబ్‌సైట్: www.iifpt.edu.in

ఎన్ఐపిసిసిడి

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ కో ఆపరేషన్ & చైల్డ్ డెవలప్‌మెంట్ (ఎన్ఐపిసిసిడి)- కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 25
అర్హత: కనీసం 55 శాతం మార్కులతో పీజీ(సైన్స్/ కామర్స్/ సోషల్ సైన్స్) లేదా తత్సమాన అర్హత ఉన్నవారు అర్హులు. పిహెచ్ డీ/ ఎంఫిల్ + ప్రొఫెషనల్/ టెక్నికల్ నాలెడ్జ్ ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
వయసు: 65 ఏళ్లకు మించరాదు
వేతనం: నెలకు రూ.45,000
ఎంపిక: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 31
వెబ్‌సైట్: www.nipccd.nic.in/vac.html

సిఎస్ఐఆర్ - ఐఎంఎంటి

సిఎస్ఐఆర్ ఆధ్వర్యంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ (ఐఎంఎంటి)- **ప్రాజెక్ట్ స్టాఫ్** భర్తీకోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
ఖాళీలు: 13
అర్హత: బిఎస్సీ(మినరల్ ప్రాసెసింగ్/కెమిస్ట్రీ)/ ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ) / ఎంటెక్(ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్/ సైన్స్/ మినరల్ ప్రాసెసింగ్/ కెమికల్ ఇంజనీరింగ్/ బయో టెక్నాలజీ)/ (బిఇ/ బిటెక్)(మెటలర్జీ/ కెమికల్/ మెకానికల్/ ఎలక్ట్రానిక్స్/ ఇన్‌స్ట్రుమెంటేషన్)/ డిప్లొమా (మెటలర్జీ/ మెకానికల్/ కెమికల్) పూర్తిచేసి ఉండాలి.
ఇంటర్వ్యూలు: ఆగస్టు 29, 30
వెబ్‌సైట్: www.immt.res.in

బిఆర్ఏయు

డా. బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ - ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 5
విభాగాలు: లా 1, సోషల్ వర్క్ 1, బయో టెక్నాలజీ 1, మేథమెటిక్స్ 1, ఆర్గానిక్ కెమిస్ట్రీ 1
దరఖాస్తు ఫీజు: రూ.2000
పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: ఆగస్టు 29 **వెబ్‌సైట్:** www.brau.edu.in

ఐడబ్ల్యుఎస్‌టి

బెంగుళూరులోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఉడ్ సైన్స్ & టెక్నాలజీ (ఐడబ్ల్యుఎస్‌టి)- కింది పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 6
పోస్టులు: స్టెనోగ్రాఫర్ (గ్రేడ్ 2)1, ఎల్‌డిసి 3, ఫారెస్ట్ గార్డ్ 2. అభ్యర్థులు తమ దరఖాస్తును కింది చిరునామాకు పంపుకోవాలి
దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 15
చిరునామా: Director, Institute of Wood Science & Technology, 18 th Cross, PO Malleswaram, Bengaluru- 560003
వెబ్‌సైట్: http://iwst.icfre.gov.in

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



పలమనేరు రూరల్ : మండలంలోని పెంగరగుంట ఉన్నత పాఠశాలలో గురువారం 250 మంది విద్యార్థులకు సర్పంచు కుప్పయ్య చేతుల మీదుగా ప్రభుత్వం సరఫరా చేసిన యూనిఫామ్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుకోవడానికి ప్రభుత్వం అనే సౌకర్యాలను కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతి ఇంటికి మరుగు దొడ్డి తప్పనిసరి

పలమనేరు రూరల్ : స్వచ్ఛ భారత్‌లో భాగంగా ప్రతి ఇంటికి మరుగు దొడ్డి తప్పనిసరి అని పలమనేరు మున్సిపల్ కమిషనర్ రామచంద్రరావు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని దండుమిట్ట ఎస్సీ కాలనీలో గురువారం సాయంత్రం ఆ ప్రాంత వాసులకు స్వచ్ఛ భారత్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ కాలనీ వాసులు మొత్తం 25 మంది వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవడానికి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వీరందరికీ మరుగుదొడ్లు నిర్మించుకోవడానికి నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. ఇంటి ఆవరణలో చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని తడిచెత్త, పొడి చెత్త వేరు చేసి ఇంటి వద్దకు వచ్చే మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్ స్పెక్టర్లు సుబ్బరాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై ర్యాలీ



పెద్దపంజాణి : ట్రాఫిక్ సమస్యల పరిష్కారంపై ఎస్ఐ రాజశేఖర్ గురువారం రాయలపేట ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్రమాదాల నివారణకు వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది చంద్రరాజు, మహేంద్ర, గంగిరెడ్డి, హరినాయక్, ఉమాశంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

18, 19న వ్యవసాయ పంపుసెట్ల నిర్వహణపై

రైతులకు అవగాహన

పలమనేరు రూరల్ : నియోజకవర్గంలోని పలమనేరు, బైరెడ్డిపల్లె, గంగవరం, వి.కోట మండలాల రైతులకు వ్యవసాయ పంపుసెట్ల నిర్వహణపై ఈనెల 18, 19వ తేదీల్లో ఆయా మండలాల విద్యుత్ కార్యాలయాల వద్ద అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్ శ్రీనివాసమూర్తి తెలిపారు. విద్యుత్ పొదుపు చర్యల్లో భాగంగా వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు 5 హెచ్ పీ వ్యవసాయ మోటారు వాడుతున్న రైతులకు నూతనంగా 5 స్టార్ సబ్ మెర్సిబుల్ మోటారును అమర్చుటకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందుకుగాను 18వ తేది ఉదయం 10 గంటలకు పలమనేరు విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయం వద్ద పలమనేరు, గంగవరం మండల రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు. అలాగే ఈ నెల 19వ తేదిన బైరెడ్డిపల్లె విద్యుత్ కార్యాలయంలో, అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు వి.కోట విద్యుత్ కార్యాలయంలో సదస్సు నిర్వహిస్తామన్నారు.

విద్యా సామగ్రి వితరణ

బంగారుపాళ్యం : కీరమంద పాఠశాలలో ఎంపీటీసీ శ్రీనివాసులు, సర్పంచు లక్ష్మీదేవి గురువారం విద్యార్థులకు విద్యా సామగ్రిని వితరణ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం దాతలు అందిస్తున్న సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ ఛైర్మన్ విజయ్‌కుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

రైతులకు జిప్సం పంపిణీ

బంగారుపాళ్యం : మండలంలోని సుమారు 200 మందికిపైగా వేరుశనగ సాగు రైతులకు గురువారం ఆత్మ కార్యాలయంలో జిప్సంను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఏవో అజయ్‌కుమార్ మాట్లాడుతూ పంటలో అధిక దిగుబడి సాధించడానికి ప్రభుత్వం ఉచితంగా జిప్సం, సూక్ష్మ పోషకాలను అందిస్తున్నదని, రైతులు పంటలో సస్యరక్షణ పాటించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవోలు రమేష్, సిద్దయ్య, ఎంపీఈవో వెంకటేష్, ఆత్మ ఏటీఎంలు మధుమోహన్ , నాగమ్మ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం



వి.కోట : ఉపాధ్యాయుల సమస్యలపై పీఆర్‌టీయూ అలుపెరుగని పోరాటం చేస్తోందని మండల శాఖ అధ్యక్షుడు స్వామికణ్ణన్ అన్నారు. గురువారం బాలికోన్నత పాఠశాలలో మండల సమావేశాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్సు రూల్స్‌ను సాధించుకోవడం, రాష్ట్ర ప్రభుత్వం డీఏ ప్రకటన పట్ల ఆనందం వ్యక్తం పరిచారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, నరేంద్ర, తులసీరాం, ప్రసాద్, జయకుమార్, బాలాజీ, మునిశేఖర్ పాల్గొన్నారు.

బాధిత రైతులకు రెట్టింపు పరిహారం

జాయింట్ కలెక్టర్ గిరీషా



పలమనేరు ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న వివాదాస్పద స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పలమనేరు రూరల్ : పలమనేరు మండలంలో గంగన్న శిరస్సు ప్రాజెక్టుకు భూములు కోల్పోతున్న బాధిత రైతులకు రెట్టింపు నష్టపరిహారాన్ని చెల్లించే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని జాయింట్ కలెక్టర్ గిరిషా తెలిపారు. ప్రస్తుతం రైతులకు ఎకరాకు రూ.2 లక్షల వరకు చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండగా అందుకు రైతులు సమ్మతించక పోవడంతో రెట్టింపు నష్టపరిహారాన్ని చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రాజెక్టు పనులు, సమస్యలు, అభివృద్ధి పనులపై జాయింట్ కలెక్టర్లు, సబ్ కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్ గురువారం పలమనేరు తహసీల్దార్ కార్యాలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. బైరెడ్డిపల్లె మండలంలోని కైగల్ ప్రాజెక్టు కోసం కేటాయించిన 65 ఎకరాల భూమిని ఇరిగేషన్ శాఖకు కేటాయించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని గాంధీనగర్ ప్రాంతంలో శ్మశాన వాటిక స్థల ఆక్రమణపై కొందరు జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ ఆక్రమణలను తొలగించడానికి చర్యలు చేపట్టాలని తహసీల్దార్ శ్రీనివాసులును ఆదేశించారు. అనంతరం పలమనేరు, గంగవరం మండలాల్లోని పారిశ్రామిక వాడలను, పలమనేరు పట్టణంలోని మున్సిపల్ వివాదపు స్థలాన్ని పరిశీలించారు. కోర్టులో ఉన్న ఈ సమస్యను వెంటనే పరిష్కరిస్తామని, ఇందుకు ఆర్టీసీ, మున్సిపల్ అధికారులు సమ్మతిస్తే ఇరు విభాగాలకు సరిసగం భూమిని కేటాయిస్తామని తెలిపారు. ఆ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించడానికి తవ్వించిన పిల్లర్ల గోతులలో వర్షపు నీరు నిల్వ ఉండడంపై మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నీటి నిల్వ వల్ల దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతారని, వెంటనే తోడి వేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ - 2 చంద్రమౌళి, సబ్ కలెక్టర్ వెట్రిసెల్వి, అసిస్టెంట్ కలెక్టర్ కీర్తి, ఇరిగేషన్ , పరిశ్రమలు, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ హైవే భూముల పరిశీలన



రైతుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రద్యుమ్న

బంగారుపాళ్యం : చెన్నై-బెంగుళూరు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో మండలంలో అధికారులు ఇప్పటికే గుర్తించిన భూములను గురువారం కలెక్టర్ ప్రద్యుమ్న, జేసీ గిరీషా పరిశీలించారు. బాధిత రైతుల వివరాలను గురించి తహసీల్దార్ మురళిని అడిగి తెలుసుకున్నారు. నష్టపరిహారం ఆమోద యోగ్యంగా లేదని పలుమార్లు కలెక్టర్‌కు, మంత్రి అమరనాథరెడ్డికి, నియోజకవర్గ టీడీపీ ఇన్ చార్జి లలితకుమారికి బాధిత రైతులు వినతిపత్రాలు అందించారు. దీంతో కలెక్టర్, జేసీ క్షేత్రస్థాయిలో రైతుల భూములను పరిశీలించారు.

మొగిలీశ్వరుని సేవలో కలెక్టర్

ప్రసిద్ది చెందిన మొగిలీశ్వరున్ని గురువారం సాయంత్రం కలెక్టర్ ప్రద్యుమ్న, జేసీ గిరీషా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ వంశపారంపర్య ధర్మకర్త విజయ్‌కుమార్, అర్చకులు స్వాగతం పలికి ఆలయ చరిత్ర, స్థల పురాణం గురించి వివరించారు.

అనుమానాస్పద స్థితిలో

యువకుడి మృతి



బంగారుపాళ్యం : మండలంలోని గుర్రం కొండవాండ్లపూరుకు చెందిన వెంకటేష్ (32) ఉరికి వేలాడుతూ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఏఎస్ఐ మనోహర్ కథనం మేరకు ...గ్రామానికి చెందిన ఎరుకుల నాగరత్నం కుమారుడు వెంకటేష్ ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. అవివాహితుడైన వెంకటేష్ వివాహమై భర్తకు దూరంగా ఉన్న ఓ మహిళతో సహజీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి వెంకటేష్ మద్యం మత్తులో ఇంటికి చేరుకున్నాడు. ఆ మహిళ, వెంకటేష్ ఇద్దరు కలసి ఇంటిలో నిద్రపోయారు. గురువారం ఉదయం ఆమె లేచి చూడగా వెంకటేష్ చీరతో ఇంటిలో ఉరివేసుకొని కనిపించాడు. దీంతో ఆమె చుట్టుపక్కల వారికి తెలుపగా వారువచ్చి చూసి మృతి చెందినట్లు నిర్ధారించుకొని పోలీసులకు సమాచారం అందించారు. వెంకటేష్ సమీప బంధువు గాంధీ ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ వెంకటేష్ మృతదేహాన్ని బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాంసపు దుకాణాలను

పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామచంద్రరావు

పలమనేరు రూరల్ : మున్సిపాలిటీ పరిధిలోని మాంసపు దుకాణాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తాజా మాంసాన్ని విక్రయించాలని మున్సిపల్ కమిషనర్ రామచంద్రరావు సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం చికెన్ , మటన్ దుకాణ యజమానులతో సమావేశాన్ని నిర్వహించారు ఆయన మాట్లాడుతూ దుకాణాల వద్ద ఈగలు, దోమలు చేరకుండా మాంసాలపై దుమ్ము, ధూళి పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి గంటలకోసారి దుకాణాలను నీటితో శుభ్రం చేసుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ కవర్లను వాడరాదని తెలిపారు. సమావేశంలో శానిటరీ ఇన్ స్పెక్టర్లు సుబ్బరాయుడు, రమణ, పట్టణంలోని మాంసపు దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

పద్మశ్రీ : నేనే రాజు నేనే మంత్రి
మంజూనాథ : జయ జానకి నాయక
రంగమహల్ : లై

అవార్డు గ్రహీత దొరస్వామికి అభినందనలు



గుడుపల్లె : ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఇన్‌చార్జి లైబ్రేరియన్ డా. దొరస్వామికి విద్య, పరిశోధనాత్మక సేవలందించినందుకు గాను మద్రాసు లైబ్రరీ అసోసియేషన్ జాతీయ ఉత్తమ లైబ్రరీ ఇన్‌ఫర్మేషన్ సొసైటీ టీచర్స్ అవార్డును ఈ నెల 12న మద్రాసు ఐఐటీలో దొరస్వామి అందుకున్నారు. దొరస్వామిని వీసీ సత్యనారాయణ, రెక్టార్ బాలసుబ్రమణియన్, రిజిస్ట్రార్ తిరుపతిరావు అభినందనలు తెలిపారు.

లారీ ఢీకొని ఒరిగిన విద్యుత్ స్తంభం



కుప్పం : కుప్పం పట్టణం కొత్తపేట జయప్రకాశ్ రోడ్డులోని ఓ విద్యుత్ స్తంభం లారీ ఢీకొనడంతో ఓ ఇంటిపైకి ఒరిగిపోయింది. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ లారీ అదుపు తప్పి స్తంభాన్ని ఢీకొంది. విద్యుత్ స్తంభం ఇంటి మీదకు ఒరగడంతో విద్యుత్ తీగలు తెగిపోయి రాత్రంతా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ప్రమాదం జరిగిన సమయంలో వీధుల్లో ఎవ్వరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

శాంతిపురం : కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఎంపీడీవో సత్యనారాయణ, జడ్పీటీసీ శకుంతల, బ్యాంకు అధికారులు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. బీసీ రుణాల కోసం 1037 మంది దరఖాస్తు చేసుకున్నారు. అలాగే శుక్రవారం ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సభ్యులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

శాంతిపురం : రైతు సమస్యలను పరిష్కరించడానికే రైతు సేవలో రెవెన్యూ శాఖ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. గురువారం చౌడంపల్లెలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. సభలో భూ సమస్యలు కొంత మేరకు పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. అలాగే శ్మశాన స్థల సమస్యను పరిష్కరించామన్నారు.

కార్పొరేషన్ల రుణాలకు అభ్యర్థుల రేపు ఎంపిక

వి.కోట : వివిధ కార్పొరేషన్ల రుణాలకు సంబంధించి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసిందుకు ఈ నెల 19న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీపీ సులోచన, ఎంపీడీవో బాలాజీలు తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకులకు ఎస్సీ, ఎస్టీ, కాపు, మైనారిటీ ఇతర కార్పోరేష్ల ద్వారా మండలానికి 170 యూనిట్లు మంజూరయ్యాయన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

శాంతిపురం : ఇసుక అక్రమ రవాణా చేపడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ వెంకటశివ అన్నారు. గురువారం కర్ణాటక, ఆంధ్ర, సరిహద్దు ప్రాంతమైన జెబీ కొత్తూరు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీ చేశారు. అక్కడి సిబ్బందితో మాట్లాడుతూ ఇసుక ట్రాక్టర్లు గానీ, లారీలు గానీ దొంగ దారుల్లో వెళితే వెంబడించి పట్టుకోవాలన్నారు. చెక్‌పోస్టులో కాకుండా పల్లె ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు తనకు సమాచారం వచ్చిందన్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండి నిఘా నేత్రాలతో అక్రమాలను అరికట్టాలన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

బైరెడ్డిపల్లె : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది తమ కుటుంబాలను అభివృద్ధి బాటలో నడిపించాలని సప్తగిరి గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ మాణిక్యంశెట్టి సూచించారు. మండలంలోని తీర్థం గ్రామంలో గురువారం 20 స్వయం సహాయక సంఘాల గ్రూపు మహిళలకు రూ.కోటి రూపాయల రుణాలను మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధితో తాము ఎంచుకున్న రంగాల్లో విజయం సాధించాలన్నారు. సమావేశంలో తీర్థం గ్రామీణ బ్యాంకు మేనేజర్ రాజన్న, వెలుగు ఏపీఎం సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

రైతు హత్య కేసులో బాధితులకు న్యాయం చేస్తాం : సీఐ



సీఐని కలసి వస్తున్న బాధితులు

బంగారుపాళ్యం : టేకుమంద గ్రామంలో బుధవారం భూ తగాదాల్లో ఒక వర్గం దాడిలో హత్యకు గురైన రైతు శ్రీరాములు కుటుంబానికి, బాధితులకు న్యాయం చేసి ఆదుకుంటామని ఇన్‌చార్జి సీఐ సురేంద్రరెడ్డి, ఎస్ఐ నెట్టికంఠయ్య తెలిపారు. బాధితులు గురువారం పోలీస్‌స్టేషన్ లో సీఐ, ఎస్ఐలను కలసి దాడి ఘటన వివరాలు తెలిపి తమకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బాధితులు మొదట ఇచ్చిన ఫిర్యాదు, అనంతరం జరిగిన దాడి, హత్యా కేసును కూడా నమోదు చేశామన్నారు. పరారీలో ఉన్న నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

ఘనంగా సరస్వతి విగ్రహ ప్రతిష్ఠ, కృష్ణాష్టమి వేడుకలు





మానవహారంగా ఏర్పడి కృష్ణుని ప్రార్థనలు చేస్తున్న విద్యార్థులు, పాఠశాలలో ఉట్టికొడుతున్న విద్యార్థులు

శాంతిపురం : శాంతిపురం మండలంలోని ఆదర్శ పాఠశాలలో గురువారం సరస్వతి విగ్రహ ప్రతిష్టాపన, కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం పాఠశాల ఆవరణలో సరస్వతి విగ్రహం, వినాయకుని విగ్రహాల ప్రతిష్ఠాపన వేడుకలు జరిగాయి. తర్వాత శ్రీకృష్ణుని జన్మష్టామి వేడుకలు జరుపుకున్నారు. పాఠశాల ఆవరణలోనే ఉట్టికొట్టే ఆట ఆడారు. కార్యక్రమంలో రెస్కో వైస్ చైర్మన్ చలపతిస్వామి, ఎంపీపీ పుష్ప, ప్రిన్సిపాల్ మురళీమోహన్, మురుగేష్, ఎస్ఎంసీ చైర్మన్ చలపతి, పిల్లల తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో పట్టపగలే చోరీలు



బీరువా పగులగొట్టిన దృశ్యం

శాంతిపురం : మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో పట్టపగలే చోరీలు జరిగాయి. పోలీసులు కథనం మేరకు... కనుమలదొడ్డిలోని నల్లప్ప ఇంట్లో గురువారం దొంగలు చొరబడి బీరువా పగులగొట్టి 20 గ్రాముల బంగారు, 55 వేల నగదు తస్కరించారు. నల్లప్ప బావమరిది సుబ్రమణి కుటుంబంలో త్వరలో పెళ్ళి వేడుక జరుగనుండడంతో, అందుకు సంబంధించిన బంగారు, నగదును నల్లప్ప ఇంట్లో ఉంచాడు. గురువారం నల్లప్ప కుటుంబ సభ్యులు ఇంటికి తాళాలు వేసుకుని కుప్పం వెళ్ళారు. ఇదే అదునుగా భావించిన దుండుగలు మధ్యాహ్నం తలుపులు బద్దలు కొట్టి బీరువా తెరచి వస్తువులు చిందరవందర చేసి నగలు, నగదు అపహరించారు. అలాగే శాంతిపురం అశోక్‌రెడ్డి బిల్డింగ్‌లోని సావిత్రి అనే ఉపాధ్యాయురాలు ఇంట్లో చొరబడి రూ. 5వేలు తస్కరించినట్లు బాధితురాలు రాళ్ళబూదుగూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ వెంకటశివ ఘటనా స్థలానికి వెళ్ళి వివరాలు సేకరించారు.

సంపూర్ణ పారిశుధ్యానికి కృషి చేద్దాం

వి.కోట : గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్యానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ సులోచన అన్నారు. చెత్త నుంచి సంపద తయారీపై బైరెడ్డిపల్లి, వి.కోట మండలాలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వి.కోట గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించబడుతున్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని అందరూ ఆదర్శంగా తీసుకుని ప్రతి మండలంలోనూ నిర్వహించుకునేలా చర్యలు చేపట్టాలని వక్తలు పిలుపునిచ్చారు. చెత్తతో సేంద్రియ ఎరువులను తయారు చేసి వాటి ద్వారా రైతులకు సహకరించడంతో ఆదాయం పొందవచ్చని సర్పంచు రామకృష్ణప్ప తెలిపారు. ఎంపీపీ సులోచన, డీఆర్‌పీ శ్రీనాథరెడ్డి, ఈవో శ్రీనివాసులు, బైరెడ్డిపల్లి, వి.కోట మండలాలకు చెందిన సర్పంచులు, వార్డు సభ్యులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు కరపత్రాలు అందజేస్తున్న ఎస్ఐ సురేష్

రామకుప్పం : రోడ్డుభద్రతపై పోలీసులు గురువారం బాలుర ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ, ఎస్బీ కానిస్టేబుల్ రామూర్తిలు మాట్లాడుతూ రహదారుల్లో నడిచేటప్పుడు, సైకిళ్ళపై వెళ్ళేటప్పుడు పాటించాల్సిన రోడ్డు నిబంధనలను వివరించారు. అదే విధంగా రోడ్డు భద్రతపై విద్యార్థులకు కరపత్రాలు పంపిణీ చేసి విద్యార్థులు తమ కుటుంబ సభ్యులను కూడా రోడ్డు భద్రతపై అవహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ, బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి పాల్గొన్నారు.

19న పంపుసెట్ల వినియోగంపై అవగాహన

వి.కోట : ఈ నెల 19న ట్రాన్స్‌కో కార్యాలయంలో వ్యవసాయ పంపుసెట్ల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు ఏఈ నూర్‌అహ్మద్ తెలిపారు. విద్యుత్ వినియోగాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ప్రయోగాత్మకంగా రైతులకు పంపుసెట్లు పంపిణీ చేయనుందని, వాటిపై అవగాహన కల్పించనున్నట్లు వివరించారు.

24న రుణ ఇంటర్వ్యూలు

గుడుపల్లె : మండలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనారిటీలకు సంబంధించిన సబ్సిడీ రుణాలు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 24వ తేదీ స్త్రీశక్తి భవనంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బాబురావు ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యేవారు ఒరిజినల్ సర్టిఫికెట్‌లు, ఆధార్‌కార్డు, రేషన్ కార్డు తీసుకుని రావాలన్నారు.

20న విజయవాడలో గాండ్ల సంఘ సమావేశం

కుప్పం : ఆంధ్రప్రదేశ్ అఖిల, గాండ్ల, కేలీకుల యువజన సంఘం సమావేశం విజయవాడలో 20న నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. విజయవాడలోని గవర్నపేటలో ఉదయం 9:30 గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. గాండ్ల, కేలీకుల సమాజిక వర్గాల సమస్యలపై చర్చించి కార్యచరణ ప్రణాళికలను రూపొందిస్తామన్నారు.

15 ఏళ్లలోపు పిల్లలందరికీ ఎమ్మార్ టీకా వేయించండి

బైరెడ్డిపల్లె : 15 ఏళ్ల వయస్సులోపు ఉన్న పిల్లలందరికీ ఎమ్మార్ టీకా తప్పక వేయించాలని తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ పల్లవి సూచించారు. నాచుకుప్పం గ్రామంలోని పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం ఎమ్మార్ టీకాలు వేశారు. తట్టు, రూబెల్లా వ్యాధుల భారిన పడకుండా పిల్లలకు తల్లిదండ్రులు టీకా వేయించాలన్నారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 3, 8

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): వేడుకలు, శుభకార్యాల్లో పాల్గొంటారు. విద్యా సంస్థల్లో ప్రవేశానికి అనుకూలం. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి శుభప్రదం. కుటుంబసభ్యుల వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): కాంట్రాక్టులు, అగ్రిమెంట్లు, రిజిస్ట్రేషన్లకు అనుకూలం. సోదరీసోదరుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. ఇంటికి అవసరమైన వస్తువులు సమకూర్చుకుంటారు. చర్చలు, ప్రయాణాలు లాభిస్తాయి.

మిథునరాశి: (మే21-జూన్21): బిల్లులు, చెక్కులు అందుకుంటారు. సన్నిహితుల సహకారంతో ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. విద్య, ప్రయాణాలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): ఆర్థిక విషయాల్లో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఈ విషయాల్లో కొత్త ఆలోచనలు అమలు చేసేందుకు తగిన సమయం. వ్యక్తిగత సౌకర్యాల కోసం ఖర్చు చేస్తారు. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): సినీ, రాజకీయ రంగాల వారు లక్ష్యాలు సాధిస్తారు. దీర్ఘకాలంగా వాయిదాపడుతున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు. అలజడి తగ్గి మనశ్శాంతి లభిస్తుంది. ఆధ్యాత్మిక దృక్పథం పెరుగుతుంది.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): వేడుకలు, శుభకార్యాల్లో పాల్గొంటారు. సమావేశాలు, ప్రదర్శనలకు ఏర్పాట్లు చేస్తారు. ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. దీర్ఘకాలిక పెట్టుబడులకు అనుకూలం.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): వృత్తి, వ్యాపారాల్లో ఆర్థికంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది. సమావేశాల్లో ప్రముఖులను కలుసుకుంటారు. పెద్దల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. న్యాయ, బోధన, రక్షణ రంగాల వారు గౌరవ పదవులు అందుకుంటారు.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): రాజకీయ, బోధన, న్యాయ, రక్షణ రంగాల వారు ఉన్నత పదవులు అందుకుంటారు. పెద్దల సహకారం లభిస్తుంది. విద్యాసంస్థల్లో ప్రవేశం అందుకుంటారు. సంకల్పం నెరవేరుతుంది.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): రుణ ప్రయత్నాలు ఫలిస్తాయి. బీమా, గ్రాట్యుటీ, పింఛన్, మ్యూచువల్ ఫండ్ వ్యవహారాలకు అనుకూలం. షాపింగ్ ఉల్లాసం కలిగిస్తుంది. ఆర్థిక వ్యవహారాల్లో ప్రణాళికబద్ధంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): స్పెక్యులేషన్లు, పెట్టుబడులపై మంచి ఫలితాలు అందుకుంటారు. జీవితభాగస్వామి, శ్రీమతి సహకారంతో ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. ప్రియతములకు కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): వృత్తిపరమైన సమావేశాలు ఫలిస్తాయి. వృత్తి, వ్యాపారాల్లో భాగస్వామి సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. విందులు, వేడుకలు ఉల్లాసం కలిగిస్తాయి. సన్నిహితుల ఆరోగ్యం మెరుగుపడుతుంది.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): సృజనాత్మకంగా వ్యవహరించి వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. ప్రేమానుబంధాలు బలపడతాయి. వైద్య, ఇంజనీరింగ్ విద్యార్థులకు శుభప్రదం. చిన్నారులు, ప్రియతముల ఆరోగ్యం మెరుగుపడుతుంది.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

వరసిద్ధుడికి 25న ప్రభుత్వం పట్టువస్త్రాల సమర్పణ

(ఆంధ్రజ్యోతి - చిత్తూరు)

కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 25వతేదీ నుంచి ప్రారంభం కానున్న విషయం విదితమే. చవితి నాడు మొదలై 21 రోజులు జరిగే ఉత్సవాలకు ప్రభుత్వం స్వామికి పట్టువస్త్రాలు సమర్పించనుంది. ఈ మేరకు ప్రభుత్వం తరఫున రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి మాణిక్యాలరావు వరసిద్ధుడికి వీటిని అందజేయనున్నారు. ఇందులో భాగంగా పట్టువస్త్రాలు కొనుగోలు కోసం ప్రభుత్వ గురువారం రూ.10 వేలు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

డీపీవోలో కాంట్రాక్టు సిబ్బంది నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో కాంట్రాక్టు ప్రాతిపదికన పారిశుధ్య(స్వీపర్లు, స్కావెంజర్లు) కార్మికుల నియామకానికి ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్పీ రాజశేఖర బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గుర్తింపు పొందిన ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల నుంచి సీల్డు కొటేషన్లు లేదా టెండర్లు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా పోలీసు కార్యాలయ పరిపాలనాధికారి ప్రసాద్ లేదా సెల్ ఫోన్ నెం. 9440900745ను సంప్రదించాలని సూచించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ. 3.42కోట్లు

ఆంధ్రజ్యోతి, తిరుమల: శ్రీవారికి హుండీ ద్వారా రూ.3.42 కోట్లు ఆదాయం లభించింది. బుధవారం వచ్చిన కానుకలను గురువారం లెక్కించామని అధికారులు ప్రకటించారు. కాగా టీటీడీ అమలు చేస్తున్న వివిధ పథకాలకు పలువురు దాతలు గురువారం రూ.4 లక్షలు విరాళం అందజేశారు. నిత్యాన్నప్రసాదానికి రూ.3లక్షలు, విద్యా దానానికి రూ.లక్ష అందజేశారు.

మార్కెట్ ధరలు

తిరుపతి బులియన్

24 క్యారెట్ల అపరంజి	**బంగారు**
10గ్రాముల ధర	రూ.30,090
22 క్యారెట్ల ఆర్నమెంటు	**బంగారు**
గ్రాము ధర	రూ.2,776
రిటైల్ వెండి గ్రాము ధర	రూ.41.10

మదనపల్లెలో

పట్టుగూళ్ల ధరలు

కనిష్ఠం	360.10
గరిష్ఠం	374.00
సగటు	337.40

టమోటా ధరలు

మొదటి రకం

కనిష్ఠం	40.00
గరిష్ఠం	48.00

రెండో రకం

కనిష్ఠం	26.00
గరిష్ఠం	38.00



కోడిగుడ్లు (నెక్)

రైతు గేటు ధర-చిత్తూరు (వందగుడ్లు)	390.00
చెన్నై	: 397.00

21న టీటీడీసీలో జాబ్‌మేళా

చిత్తూరు కలెక్టరేట్: చెన్నై, పెరంబుదూరు, తిరుపతిలోని పలు కంపెనీల్లో ఖాళీల భర్తీ కోసం ఈనెల 21న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ రవిప్రకాష్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు రెడ్డిగుంటలోని టీటీడీసీ సెంటర్‌లో జరిగే మేళాలో చెన్నై, పెరంబుదూర్‌లోని రైజింగ్‌స్టార్ మొబైల్ కంపెనీలో వంద అసెంబ్లర్స్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఈ పోస్టులకు 18-26 ఏళ్లుండి టెన్త్, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.9 వేల వేతనం, ఉచిత వసతి, భోజన సదుపాయం ఉంటుందన్నారు. ఇదే పట్టణంలో ఫాక్స్‌కాన్ టెక్నాలజీస్ ఇండియా తరఫున ఆపరేటర్లుగా పనిచేసేందుకు టెన్త్, ఇంటర్, ఐటీఐ పాస్ లేదా ఫెయిలయిన అభ్యర్థులు అవసరం అన్నారు. మొత్తం 50 పోస్టులకు 19-26 మధ్య వయసున్న యువకులు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.8 వేల జీతం, ఉచిత భోజన వసతి కల్పిస్తామన్నారు. తిరుపతి ఫ్లిప్‌కార్ట్ శాఖలో డెలివరీ బాయ్స్‌గా పనిచేసేందుకు టెన్త్, ఆపై విద్యార్హత కలిగి 19-35 ఏళ్లున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని వివరించారు. ఎంపికైన వారికి నెలకు రూ.9వేల జీతం, పెట్రోల్ అలవెన్స్ ఇస్తారన్నారు. కాగా, అభ్యర్థులకు ద్విచక్రవాహనం, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరన్నారు. చెన్నైలోని శ్రీరామ కంపెనీలో ఆడిటర్లుగా పనిచేసేందుకు బీకాం చదివి 19-30 ఏళ్లున్న 30 మంది అవసరమన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.9 వేల జీతం, ఔట్ ఆఫ్ స్టేషన్ అలవెన్స్ ఉంటుందని వివరించారు. ఇతర వివరాలకు నెం.08572-242425, 90000 17644, 9963476019లను సంప్రదించాలని పీడీ కోరారు.

48 మండలాల్లో వర్షాలు

చిత్తూరు కలెక్టరేట్: గడచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా 48 మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా నగరి మండలంలో 59.8 మి.మీ., అత్యల్పంగా ఎస్.ఆర్.పురం మండలంలో ఒక మి.మీ వర్షపాతం నమోదైంది. పెద్దమండ్యంలో 21.4 మి.మీ., తంబళ్లపల్లెలో 12, ములకలచెరువులో 6, పీటీఎంలో 5, బి.కొత్తకోటలో 2.4,గుర్రంకొండలో 2.8, కలకడలో 15.4, కేవీపల్లెలో 25.2, ఎర్రావారిపాళెంలో 5.2, తిరుపతి అర్బన్‌లో 3.8, రేణిగుంటలో 16.2, ఏర్పేడులో 32.2, శ్రీకాళహస్తిలో 1, బి.ఎన్.కండ్రిగలో 22.6, వరదయ్యపాళెంలో 20.4, నాగలాపురంలో 6.4, విజయపురంలో 5.4, కేవీబీపురంలో 5, నారాయణవనంలో 2.8, వడమాలపేటలో 10.4, తిరుపతి రూరల్‌లో 3.2, రామచంద్రాపురంలో 4.2, చిన్నగొట్టిగల్లులో 14.6, రొంపిచెర్లలో 23.6, పీలేరులో 10.6, వాల్మీకిపురంలో 5.8, నిమ్మనపల్లెలో 1.2, మదనపల్లెలో 7.4, రామసముద్రంలో 1.8, చౌడేపల్లెలో 6.2, పులిచెర్లలో 9.4, పుత్తూరులో 59.8, శ్రీరంగరాజపురంలో 1,పాలసముద్రంలో 20.4, గంగాధర నెల్లూరులో 7.4, తవణంపల్లెలో 21.4, చిత్తూరులో 49.2, గుడిపాలలో 21.8, యాదమరిలో 20.8, బంగారుపాళ్యంలో 40.2,పలమనేరులో 3.4, గంగవరంలో 4.4, పెద్దపంజాణిలో 4.2,బైరెడ్డిపల్లెలో 43.2, వి.కోటలో 4.2, రామకుప్పంలో 4.8, శాంతిపురంలో 7.2, కుప్పంలో 4.2 మి.మీ. వర్షపాతం నమోదైంది.

31న గుంటూరులో దేవిశ్రీప్రసాద్ లింబో స్కేటింగ్



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుగుణ. చిత్రంలో దేవిశ్రీప్రసాద్ ఉన్నారు.

తిరుపతి (తిలక్‌రోడ్): తిరుపతికి చెందిన తొమ్మిదేళ్ల స్కేటింగ్ చిచ్చరపిడుగు దేవిశ్రీ ప్రసాద్ ఈనెల 31న గుంటూరులో లింబోస్కేటింగ్ ప్రదర్శన ఇవ్వనున్నాడని ఎమ్మెల్యే సుగుణ తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. దేవిశ్రీప్రసాద్ గత రెండు సంవత్సరాలుగా లింబోస్కేటింగ్‌లో ప్రపంచ రికార్డు సాధించడానికి కృషి చేస్తున్నాడని ఈ ప్రయత్నంలో భాగంగా ఈనెల 31వ తేదీన ఉదయం 6:30 గంటల నుంచి 9 మధ్య గుంటూరులో రామకృష్ణ హౌసింగ్‌వారు నిర్మించిన రోడ్డు మార్గంలో లింబోస్కేటింగ్ ప్రదర్శన ఇస్తున్నాడని తెలిపారు. లింబోస్కేటింగ్‌లో ప్రపంచ రికార్డు సాధించేలా దేవీశ్రీప్రసాద్‌ను ఆశీర్వదించాలని అతడి తల్లి పద్మ కోరారు. సమావేశంలో తుడా ఛైర్మన్ నరసింహయాదవ్, డాక్టర్ సుధారాణి, భాస్కర్, మునుజనాథ్, లోకనాథం పాల్గొన్నారు.

తిరుచానూరు ఆలయంలో 4 నుంచి పవిత్రోత్సవాలు

తిరుచానూరు: తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో ఈనెల 29న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తున్నట్లు ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈవో మునిరత్నంరెడ్డి గురువారం తెలిపారు. సెప్టెంబరు 4 నుండి 6 వరకు అమ్మవారి ఆలయంలో జరగనున్న వార్షిక పవిత్రోత్సవాలను పురస్కరించుకుని 29న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నట్లు తెలిపారు. 4న పవిత్ర ప్రతిష్ఠ, 5న పవిత్ర సమర్పణ, 6న పూర్ణాహుతి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. రూ. 750 చెల్లించి భక్తులు ఈ పవిత్రోత్సవాలలో పాల్గొనవచ్చునని తెలిపారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం పురస్కరించుకుని ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పవిత్రోత్సవాలు పురస్కరించుకుని పై మూడు రోజులు ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది.

ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లకు రేపు ఉద్యోగ మేళా

తిరుపతి (టీటీడీ): ఇంజనీరింగ్ పట్టభద్రులకు శనివారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి మేనేజర్ ఆర్.లోకనాథం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఈ, బీటెక్, బీసీఏ, ఎంసీఏ చదివిన నిరుద్యోగ ఇంజనీరింగ్ పట్టభద్రులు, రెడ్ పాన్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇంటర్న్‌షిప్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచితంగా టెక్నికల్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తామని ఇతర వివరాలకై ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి లేదా సెల్‌ఫోన్ నెం. 9966843255, 79970 08877లను సంప్రదించాలని సూచించారు.

హెచ్‌ఆర్‌డీఏ తిరుపతి ప్రాంతీయ కేంద్రానికి 6 పోస్టులు మంజూరు

(ఆంధ్రజ్యోతి - చిత్తూరు)

తిరుపతిలోని మానవ వనరుల సంస్థ ప్రాంతీయ కేంద్రానికి ఆరు పోస్టులు మంజూరయ్యాయి. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి సంస్థకు అనుబంధంగా ప్రభుత్వం తిరుపతిలో ప్రాంతీయకేంద్రాన్ని ఏర్పాటు చేసింది. పేరుకు తిరుపతి అయినా ప్రస్తుతం ఈ కేంద్రం శ్రీకాళహస్తిలోని ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ సెంటర్(ఈటీసీ) ఆవరణలో నడుస్తోంది. ఈ కేంద్ర నిర్వహణ కోసం ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రభుత్వం 25 గదులను కేటాయించింది. ఇందుకు అవసరమైన పోస్టులను మంజూరు చేసింది. హెచ్‌ఆర్‌డీఏ డైరెక్టర్‌గా మానవ వనరుల అభివృద్ధి సంస్థలో డిప్యూటీ డైరెక్టర్ హోదా కలిగిన లేదా డిప్యూటీ కలెక్టర్ హోదా కలిగిన పోస్టు, కేంద్ర మేనేజర్‌గా డిప్యూటీ తహసీల్దారు స్థాయి కలిగిన పోస్టు, అకౌంట్స్ అధికారిగా సబ్‌ట్రెజరీ స్థాయి అధికారి పోస్టు చొప్పున మూడు రెగ్యులర్ పోస్టులను మంజూరు చేసింది. జూనియర్ అసిస్టెంట్ స్థాయి కలిగిన ట్రైనీ అసోసియేట్ పోస్టులు రెండు, ఆఫీసు సబార్డినేట్ పోస్టు ఒకటి వంతున ఔట్‌సోర్సింగ్ లేదా కాంట్రాక్టు ప్రాతిపదికన నియామకానికి మొత్తం మూడు పోస్టులను మంజూరు చేసింది. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

టీటీడీ ఉద్యోగుల సమస్యలపై ఈవో సింఘాల్ సానుకూల స్పందన

తిరుపతి (టీటీడీ): టీటీడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి దేవస్థానం ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ సానుకూలంగా స్పందించారు. గురువారం సాయంత్రం దేవస్థానం స్టాఫ్ అండ్ వర్కర్స్ యునైటెడ్ ఫ్రంట్ సభ్యులతో నిర్వహించిన చర్చల్లో పాల్గొన్నారు. సింఘాల్ ఉద్యోగ సంఘం నాయకులతో మాట్లాడుతూ దేవస్థానంలో పనిచేసే సిబ్బందికి నగదు రహిత వైద్యం నిమిత్తం సంయుక్త కార్యనిర్వహణాధికారి పోలా భాస్కర్‌తో ఒక కమిటీ, దేవస్థానం ఉద్యోగుల ఇళ్ల స్థలాల కేటాయింపు సమస్య పరిష్కారానికి సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసు పరిష్కారానికై కృషి, దీంతోపాటు దేవస్థానం ఉద్యోగుల ఇళ్ల స్థలాలకై రాష్ట్రప్రభుత్వంతో సమన్వయం చేస్తామన్నారు. దేవస్థానం ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికిగాను టీటీడీ సంయుక్త కార్యనిర్వహణాధికారి జె.శ్రీనివాసరాజుచే కమిటీ, దీంతోపాటు ఒప్పంద కార్మికులకు జాతీయ సెలవుల మంజూరు, దశలవారీగా దేవస్థానం ఉద్యోగుల బదిలీల ప్రక్రియ నిర్వహణ, జీవో నెంబరు 1060 సవరణకై 2నెలల సమయం కేటాయింపు చేపడతామన్నారు. తిరుమలలో విధులు నిర్వహించే సిబ్బందికి హిల్ అలవెన్స్ పెంపు, రిస్క్ అలవెన్స్ రూ.500 నుంచి రూ.750కి పెంపు, నాల్గవ తరగతి ఉద్యోగులకు పాదరక్షల బిల్లు పెంపుతో పాటు దేవస్థానం ఉద్యోగుల నివాసప్రాంతాలలో ఆర్ఓఆర్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు, వినాయకనగర్ నివాస సముదాయాలకు ప్రహరీ నిర్మాణం, కమ్యూనిటీహాలు నిర్మాణం, శిథిలావస్థలో ఉన్న దేవస్థానం సిబ్బంది నివాసగృహాల మరమ్మతు, దేవస్థానం ట్రస్టుబోర్డు ఆమోదించిన ప్రతిపాదనల అమలుకై తిరుపతి జేఈవో పోలా భాస్కర్‌చే విధివిధాన కమిటీలను ఏర్పాటుచేసి దేవస్థానం సిబ్బంది సమస్యలను పరిష్కరింపచేస్తానని హామీ ఇచ్చారు. దేవస్థానంలో ఉద్యోగ ఎన్నికల నిర్వహణపై బోర్డు ఉన్నతాధికారులతో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని, దేవస్థానంలో ఖాళీగా ఉన్న 6 వేల ఉద్యోగాల భర్తీకి, దేవస్థానం పరిపాలనా భవనం సెంట్రలైజ్డ్ ఏసీ చేయాలనే ప్రతిపాదనలను పరిశీలించనున్నట్లు తెలిపారని టీటీడీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యునైటెడ్ ప్రతినిధులు జి.వెంకటేశం తెలిపారు. ఈ చర్చల సమావేశంలో ఎన్.నాగార్జున, రత్నప్రభాకర్, గుణశేఖర్, రామన్, హనుమంతరెడ్డి, వెంకట్రమణారెడ్డి, హరినాథ్, ఏ.శేఖర్, 4వ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సురేంద్రకుమార్, దేవస్థానం ఇన్ సర్వీస్ డిప్యూటీ ఈవో మునిరత్నంరెడ్డి, ఎస్టేట్ అధికారిణి గౌతమి, సంక్షేమ అధికారి శ్రీధర్, ముఖ్య వైద్యాధికారి నాగేశ్వరరావు,సీఏవో రవిప్రసాద్ పాల్గొన్నారు.

జీవో 64 రద్దయ్యేనా?



వ్యవసాయ కళాశాల వద్ద ధర్నాలో పాల్గొన్న విద్యార్థులు

తిరుపతి రూరల్: ప్రభుత్వం విడుదల చేసిన జీవో 64ను రద్దు చేయాలని కోరుతూ ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ పరిధిలో కళాశాలల్లోని విద్యార్థులు ధర్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. తిరుపతిలోని ఎస్వీ వ్యవసాయ కళాశాలలోనూ కొన్ని రోజులుగా నిరసనలు తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం వర్సిటీ డీన్ డాక్టర్ రమేష్ రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. అలాగే ఎంఆర్‌పల్లె ఎస్ఐ ఇమ్రాన్‌ఖాన్ సిబ్బందితో వచ్చి శాంతియుతంగా ఆందోళన చేపట్టాలని, పరిపాలనా భవనం తాళాలు వేయవద్దని సూచించారు. దీంతో పరిపాలనాభవనం, వివిధ విభాగాల తలుపులు తెరుచుకున్నాయి. సిబ్బంది విధులకు హాజరయ్యారు. అలాగే శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు గుంటూరులోని ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విద్యార్థులతో వీసీ డాక్టర్ దామోదరనాయుడు సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో రాష్ట్రంలోని అన్ని కళాశాలల నుంచి విద్యార్థి నాయకులు హాజరు కావాలని కోరారు. దీంతో భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) గుర్తింపులేని విద్యాసంస్థలో చదివిన వారిని ప్రోత్సహించేలా విడుదల చేసిన జీవో నెంబరు 64ను రద్దు చేస్తారని విద్యార్థులు భావిస్తున్నారు. ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందే.

గుంటూరులో వ్యవసాయ వర్సిటీ వీసీతో నేడు విద్యార్థుల సమావేశం

డీన్, పోలీసుల చొరవతో తిరుపతిలో విధులకు హాజరైన సిబ్బంది

ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అంశంపై 1న వర్క్‌షాప్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు): సెప్టెంబర్ 1న ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) అనే అంశంపై ఎస్వీయూలో ఒక్క రోజు వర్క్‌షాప్ జరగనుంది. ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజిటల్ టెక్నాలజీ(ఐఐడీటీ)తో కలిసి ఎస్వీ యూనివర్సిటీ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. 1న ఉదయం 9 గంటలకు సెనేట్ హాల్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఇందులో పలువురు సాంకేతిక నిపుణులు పాల్గొని విద్యార్థులకు ఐఓటీ గురించి అవగాహన కల్పించనున్నారని ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ దామోదరం తెలిపారు.

శ్రీవారి సేవలో మంత్రి మాణిక్యాలరావు



ఆంధ్రజ్యోతి, తిరుమల: దేవాదాయ శాఖ మంత్రి మాణిక్యాలరావు గురువారం శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం ప్రారంభ సమయంలో మొదటి వైకుంఠం క్యూకాంప్లెక్స్ మీదుగా ఆలయం చేరుకున్న ఆయన సన్నిధికి చేరుకుని మూలవర్లను దర్శించుకున్నారు. హుండీలో కానుకలు సమర్పించారు. ఆ తరువాత ధ్వజస్తంభం, బలిపీఠాన్ని మొక్కుతూ రంగనాయకుల మండపం చేరుకున్నారు. వేదపండితులు ఆశీర్వాదం పలుకగా ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. రిసెప్షన్ అధికారులు హరీంద్రనాథ్, లక్ష్మీనారాయణయాదవ్ వసతి, దర్శన ఏర్పాట్లు చేశారు.

● మూడుముళ్ల బంధం

చంద్రగిరి అబ్బాయి.. చికాగో అమ్మాయి



అరుంధతి నక్షత్రాన్ని చూస్తున్న వధూవరులు

తిరుపతి (సాంస్కృతికం): చంద్రగిరి మండలం సి మల్లవరానికి చెందిన మేడసాని గురుధర్మతేజ, అమెరికాలోని చికాగోకు చెందిన కింబర్లీ హోమ్‌లు గురువారం మూడుముళ్లతో ఒక్కటయ్యారు. స్థానిక ఇస్కాన్ సెల్లార్ మందిరంలో హిందూ సంప్రదాయ రీతిలో ఇండియా అబ్బాయిని అమెరికా అమ్మాయి మనువాడింది. వరుడు ధర్మతేజ పురుషోత్తమ నాయుడు అన్నపూర్ణల కుమారుడు కాగా వధువు చికాగోకు చెందిన బాబ్ హోమ్, బరక్‌హోమ్‌ల కుమార్తె. చికాగోలో సాఫ్ట్ వేర్ ఇంజనీరుగా ఉన్న ధర్మతేజ, మెడికల్ నర్సింగ్ చేస్తున్న కింబర్లీ ఒకరినొకకు ఇష్టపడి వివాహం చేసుకున్నారు. ఈ వివాహానికి అమెరికా నుండి వధువు బంధువులు తరలివచ్చారు.

గ్రూప్-1 పరీక్షలు ప్రశాంతం

831 మంది అభ్యర్థులకు 555 మంది మాత్రమే



పరీక్ష రాయడానికి వెళుతున్న అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

తిరుపతి(జీవకోన): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గురువారం నిర్వహించిన గ్రూప్-1 మెయిన్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. అభ్యర్థులకు జనరల్ ఇంగ్లీష్ పరీక్షను నిర్వహించారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ భద్రతను ఏర్పాటు చేశారు. తిరుపతి నగరంలోని పద్మావతి డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో నిర్వహించిన పరీక్షలకు 831 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా డిగ్రీ కళాశాలలో 400 మందికి గాను 282 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అదేవిధంగా జూనియర్ కళాశాలల్లో 431 మందికి గాను 273 మంది అభ్యర్థులు హాజరైనట్లు పరీక్షల లైజన్ ఆఫీసర్ శేషగిరిరావు తెలిపారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. 19న పేపర్-1 పరీక్షలు జరగనున్నాయి.

వర్సిటీ సర్టిఫికెట్లు ఇక ఆన్‌లైన్‌లో..

ఎన్ఎస్‌డీఎల్‌తో ఎస్వీయూ ఒప్పందం



ఒప్పంద పత్రాలను స్వీకరిస్తున్న ఎస్వీయూ వీసీ దామోదరం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు): కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నేషనల్ అకడమిక్ డిపాజిటరీ (ఎన్ఏడీ) కార్యక్రమంలో భాగంగా యూనివర్సిటీ విద్యార్థుల సర్టిఫికెట్లను డిజిటలైజేషన్ చేయనున్నారు. ఈ సర్టిఫికెట్లను ప్రపంచంలోని ఏమూల నుంచి అయినా విద్యార్థులు, వారు ఉద్యోగాల పొందిన సంస్థలవారు ఏ సమయంలో అయినా చూసుకునే విధంగా ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించనున్నారు. ఇందుకోసం నేషనల్ సెక్యూరిటీ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్)తో ఎస్వీ యూనివర్సిటీ గురువారం అవగాహనా ఒప్పందం (ఎంఓయూ) చేసుకుంది. ఈ మేరకు ఒప్పంద పత్రాలపై ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ దామోదరం, ఎన్ఎస్‌డీఎల్ ప్రతినిధి శ్రీనివాస సంతకాలు చేశారు. అనంతరం ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. అందులో భాగంగా ఈ ఏడాది నవంబర్‌లోపు వర్సిటీకి సంబంధించిన డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ తదితర అన్ని కోర్సుల ప్రొవిజినల్ కమ్ మార్క్స్ లిస్టులు, ఇతర సర్టిఫికెట్లు డిజటలైజేషన్ చేయనున్నారు. ఈ విధానం ద్వారా విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ దామోదరం పేర్కొన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచే ఈ విధానం అమల్లోకి వస్తుందని ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ భాస్కర్, రిజిస్ట్రార్ దేవరాజులు, తదితరులు పాల్గొన్నారు.

స్కావెంజర్స్ కాలనీని బలవంతంగా ఖాళీ చేయించొద్దు

తిరుపతి కార్పొరేషన్ కమిషనర్‌కు కోర్టు నోటీసు ● సుమోటోగా కేసు స్వీకరించిన న్యాయమూర్తి

తిరుపతి (న్యాయవిభాగం): తిరుపతి స్కావెంజర్స్‌కాలనీవాసులను బలవంతంగా ఖాళీ చేయించరాదంటూ నాల్గవ జిల్లా కోర్టు న్యాయమూర్తి రాంగోపాల్ తిరుపతి కార్పొరేషన్ కమిషనర్‌కు నోటీసు జారీ చేశారు. తిరుపతి నాల్గవ జిల్లా కోర్టుకు ఓ కేసులో సాక్ష్యం చెప్పడానికి కార్పొరేషన్‌లో పనిచేసే మేస్త్రీ మురళి వచ్చారు. ఆ సమయంలో స్కావెంజర్స్‌కాలనీ ప్రజలను బలవంతంగా ఖాళీ చేయిస్తున్నారంటూ న్యాయమూర్తి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన స్కావెంజర్స్‌కాలనీలో ఎంతమంది ఉన్నారో కులాలవారీగా వివరాలు కావాలంటూ కార్పొరేషన్ అధికారులకు నోటీసులిచ్చారు. మరోవైపు స్కావెంజర్స్‌కాలనీలో ప్రజలను బలవంతంగా ఖాళీ చేయిస్తున్నారంటూ మీడియాలో కథనాలు వచ్చాయి. దీంతో న్యాయమూర్తి స్కావెంజర్స్‌కాలనీ విషయాన్ని సుమోటోగా స్వీకరించి కమిషనర్‌తోపాటు ఎస్సీ,ఎస్టీ కేసులకు సంబంధించినడీఎస్పీకి నోటీసులు జారీ చేశారు.



కుప్పంలో వర్షాతిరేకం





కుప్పం మండలం మల్లానూరు సమీపంలో మడక పట్టిన రైతు - నిండుతున్న డీకేపల్లె చెరువు - అడవిములకపల్లె వద్ద జవజవలాడుతున్న వేరుశనగ పంట

కుప్పం పల్లెలు జీవంతో తొణికిసలాడుతున్నాయి. వాన ఆశలు దాదాపు ఆవిరవుతున్న వేళ... ఆడినెలలో వానలు కురిసి చెరువులు నిండుతున్నాయి.కుప్పం పల్లెల్లో పదేళ్లయింది ఇటువంటి వానలు చూసి. రాగి నాట్లు వేస్తూ.. వరి పంటలో కలుపు మొక్కలు పీకుతూ.. గెనివార తీస్తూ.. అడుసు చేస్తూ.. ఎటు చూసినా మట్టి మనిషి విశ్వరూపియై కనిపిస్తున్నాడు. తహసిల్దారు కార్యాలయాల ఎదుట వేపచెట్లు బోసిపోతున్నాయి. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలు బావురుమంటున్నాయి.వానలు పుష్కలంగా కురిసి, చేతినిండా వ్యవసాయప్పనులుంటే పల్లె జనానికి అక్కడేం పని. ఒక్క మాటతో చెప్పాలంటే కుప్పం పల్లెలిప్పుడు వర్షాతిరేకంతో పొంగిపోతున్నాయి.

-కుప్పం

వైభవంగా కుమారస్వామి కల్యాణం

శ్రీకాళహస్తి: శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామి కల్యాణం గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. శ్రీకాళహస్తి పట్టణంలోని విజ్ఞానగిరిపై ఉన్న కుమారస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఏడవ రోజున కుమారస్వామికి, శ్రీవల్లీ దేవసేనకు కల్యాణం వైభవంగా జరిపారు. మొదట స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించారు. ఆలయం వద్ద వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను గజ వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. ఈ వేడుకలను తిలకించడానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు గురవయ్య నాయుడు, ఈవో భ్రమరాంబ, ఆలయ పర్యవేక్షకుడు లోకేష్‌రెడ్డి, తనిఖీదారులు నాగభూషణ్ యాదవ్, సుదర్శX , ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు. కాగా, శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామి ఉత్సవ మూర్తులను ఉదయం చిలుక వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. స్వామి అమ్మవార్లకు భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఈవో భ్రమరాంబ తదితరులు







చిలుక వాహనంపై ఊరేగుతున్న కుమారస్వామి - కల్యాణోత్సవ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు - గజవాహనంపై వస్తున్న అమ్మవార్లతో స్వామివారి ఊరేగింపు

కాణిపాకంలో వైభవంగా శాంతి కల్యాణోత్సవం





శాంతి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితుడు - దాతలను సన్మానిస్తున్న ఈవో పూర్ణచంద్రరావు

ఐరాల(కాణిపాకం) : కాణిపాకంలో నిర్వహిస్తున్న స్వర్ణ శిఖర ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయంలో శాంతికల్యాణోత్సవం, మహా సంప్రోక్షణ, కుంభాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం అర్చకులు యాగశాల ఆరాధన, హోమం, మహాపూర్ణాహుతి, కుభయాత్రాదానం, కుంభాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామికి అభిషేకం జరిపి, ఆలయ తూర్పు రాజగోపురంపై ఏడు, పశ్చిమ రాజగోపురంపై ఐదు, ప్రధాన ఆలయ విమాన గోపురంపై ఒకటి, ఆంజనేయ ఆలయ విమాన గోపురంపై ఒక స్వర్ణ కలశాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం సిద్ధిబుద్ధి సమేత వినాయకస్వామికి శాస్త్రోక్తంగా శాంతి కల్యాణం నిర్వహించారు. నెల్లూరుకు చెందిన దాతలు, వీటీఆర్ కన్‌స్ట్రక్షX్స అధినేత వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి,ప్రశాంతిరెడ్డిని ఆలయాధికారులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పూర్ణచంద్రరావు, ఈఈ మురళీ బాలకృష్ణ, ఏసీ వెంకటేష్, ఏఈవోలు కేశవరావు, రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు స్వాములు, ప్రసాద్, ఇన్‌స్పెక్టర్లు రమేశ్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



భోజనం రుచిగా లేకుంటే చర్యలు

వెదురుకుప్పం: మధ్యాహ్న భోజనంలో రుచి లేకుంటే చర్యలు తప్పవని ఇన్‌ఛార్జి ఎంఈవో మేరి ప్రేమలత హెచ్చరించారు. గురువారం మండలంలోని చవనపల్లె మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు సక్రమంగా భోజనం అందించాలని ఆదేశించారు. తరువాత విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. సీఆర్పీ షణ్ముగం, హెచ్ఎం మోహనరెడ్డి ఆమె వెంట ఉన్నారు.

అటకెక్కిన ఫాగింగ్ మెషీన్

పుత్తూరు: రెండు రోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో దోమలు వృద్ధి చెందాయి. అయితే మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది చెత్తాచెదారం, మురుగునీటి కాలువల్లో పూడిక తీయకపోడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. పట్టణంలోని స్టేట్‌బ్యాంకుకాలనీ, ఆరేటమ్మ కాలనీ, రామనాథంశెట్టి కాలనీ, జెండామాను వీధి సహా శివారు ప్రాంతాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలు పేరుకున్నాయి. పారిశుధ్య సిబ్బంది వాటిని తరలించకపోగా దోమల నివారణకు ఫాగింగ్ చేయకపోవడంతో సమస్య తీవ్రంగా ఉంది. నాలుగు రోజులుగా దోమలు బెడద తీవ్రమైన్నట్టు స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా మున్సిపల్ సిబ్బంది పారిశుధ్య చర్యలు చేపట్టాల్సి ఉంది.





బీరువాపై చేరిన ఫాగింగ్ మెషీన్ - స్టేట్‌బ్యాంకు కాలనీలో దుస్థితికి చేరిన కాలువ

నగదు రహిత లావాదేవీలపై అవగాహన తప్పనిసరి

వెదురుకుప్పం: నగదు రహిత లావాదేవీలపై బ్యాంకు ఖాతాదారులు అవగాహన పెంచుకోవాలని డీసీసీబీ డైరెక్టర్, టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్.నాగరాజారెడ్డి చెప్పారు. గురువారం వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లంలో చవటగుంట పీఏసీఎస్ ఆధ్వర్యంలో నగదు రహిత లావాదేవీలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజారెడ్డి మాట్లాడుతూ.. నగదు లేకుండా నిత్యావసర సరుకుల కొనుగోలు, ఇతర లావాదేవీలు నిర్వహించవచ్చునన్నారు. బ్యాంకుల్లో డెబిట్, క్రెడిట్, రూపే కార్డులు ఇస్తారని, వాటిని సద్వినియోగపరచుకోవాలన్నారు. పీఏసీఎస్ సీఈవో రమేష్, సురేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.



డెబిట్ కార్డును చూపుతున్న నాగరాజారెడ్డి

ముగిసిన స్కంధుడి తెప్పోత్సవం



కార్వేటినగరంలో వళ్లీదేవసేన సమేతంగా ఊరేగుతున్న కుమారస్వామి





స్కంధుడికి సారె తీసుకొస్తున్న గ్రామస్తులు - తెప్పలపై విహరిస్తున్న స్వామివారు

కార్వేటినగరం: ఆడికృత్తిక వార్షిక ఉత్సవాల్లో భాగంగా కార్వేటినగరం స్కంధపుష్కరిణిలో జరుగుతున్న తెప్పోత్సవాలు వైభవంగా ముగిశాయి. అంతకుముందు గురువారం ఉదయం కుమారిగిరి సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. సాయంత్రం వళ్లీదేవసేన సమేత కుమారస్వామి ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి ప్రత్యేక వాహనంపై అధిష్టింపజేసి కార్వేటినగరం వీధుల్లో ఊరేగించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను స్కంధపుష్కరిణి వద్దకు వేంచేపుగా తీసుకొచ్చారు. అనంతరం తెప్పలపై అధిష్టింపజేసి పుష్కరిణిలో ఏడు పర్యాయాలు ప్రదక్షిణ చేశారు. కార్వేటినగరం సీఐ మోహన్, ఎస్ఐ శ్రీనివాసరావు బందోబస్తు ఏర్పాటు చేశారు. తెప్పోత్సవం సదర్భంగా జడ్పీటీసీ సభ్యులు గీతాయాదవ్ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. ఈవో మునికృష్ణ, ఆలయ అధ్యక్షుడు రవియాదవ్, కమిటీ సభ్యులు మురళీకృష్ణారెడ్డి, చంద్రమౌళిరెడ్డి, జగన్నాథం, సరోజ, విజయ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సమస్యల పరిష్కారంలో ఎన్ ఎంయూ ముందంజ



ఆవిర్భావ దినోత్సవంలో కార్మికులు

పుత్తూరు: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మిక సమస్యలు పరిష్కరించడంతో నేషనల్ మజ్దూరు యూనియన్ ముందంజలో ఉందని యూనియన్ జిల్లా అధ్యక్షుడు పెరుమాళ్ తెలిపారు. గురువారం పుత్తూరు డిపో కార్యాలయంలో ఎన్ ఎంయూ 50 ఆవిర్భావ దినాన్ని ఘనంగా నిర్వహించారు. తమ యూనియన్ పోరాటంతోనే ప్రభుత్వ ఉద్యోగుల ఇస్తున్న 43 శాతం ఫిట్‌మెంట్, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్, ఉద్యోగ భద్రత తదితరాలు కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో కార్యక్రమంలో రీజనల్ కార్యదర్శి ఎన్ .ఆర్.నాయుడు, పుత్తూరు డిపో అధ్యక్షుడు ఆర్.హెచ్ .రెడ్డి, కార్యదర్శి సుందరం, గౌరవాధ్యక్షుడు వాసుదేవరాజులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి: మరొకరికి గాయాలు



ధనపాల్ మృతదేహం

కార్వేటినగరం: రోడ్డు ప్రమాదంలో ఓ స్కూటరిస్టు మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం సాయంత్రం సురేంద్రనగరం కనుమ వద్ద జరిగింది. ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు. కార్వేటినగరానికి చెందిన ధనపాల్, సుబ్రహ్మణ్యం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో పుత్తూరుకు వెళుతూ సురేంద్రనగరం మలుపు వద్ద అదుపు తప్పి కల్వర్టును ఢీకొన్నారు. ఈ ఘటనలో ధనపాల్(46) అక్కడికక్కడే మృతి చెందగా, వెనుక కూర్చోని ఉన్న సుబ్రహ్మణ్యం కాళ్ళకు తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స ద్వారా క్షతగాత్రుడిని పుత్తూరు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి తిరుపతి రుయాకు తరలించినట్టు తెలిపారు.

కాళీయమర్ధన అలంకరణలో శ్రీకృష్ణుడు



వడమాలపేట: జన్మాష్టమి ఉత్సవాల్లో భాగంగా రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు కాళీయమర్ధన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో జన్మాష్టమి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహాలను కాళీయమర్ధిని రూపంలో పూలమాలలు, ఆభరణాలతో అలంకరింపచేశారు. మహా మంగళ హారతులిచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అంద జేశారు. ఈ కార్యక్రమం ఉభయదారుడు జయకుమార్ ఆధ్వర్యంలో జరిగింది.

శ్రీకృష్ణుడి పుర విహారం

నారాయణవనం: గోకులాష్టమి వేడుకలను పురస్కరించుకుని గురువారం రాత్రి సముదాయం గ్రామంలో శ్రీకృష్ణుడు ఊరేగారు. ఉదయం శ్రీకృష్ణుడి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. సాయంత్రం ఉట్లోత్సవం నిర్వహించగా యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రాత్రి పది గంటలకు ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు కృష్ణమందడి, పొన్నుస్వామి, గిరిబాబు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల వితరణ

వడమాలపేట: మండలంలోని వడమాల ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు స్థానిక రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్ మునిమోహన్ జ్ఞాపకార్థం ఆయన భార్య శమంతకమని నోటు పుస్తకాలు అందజేశారు. గురువారం జరిగిన కార్యక్రమంలో జీవన్ దాత సేవా సంఘం ఆధ్వర్యంలో సుమారు 35 మందికి విద్యా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఉమాపతి, హరిబాబు పాల్గొన్నారు.

మజ్దూరు మోర్చా జిల్లా కార్యదర్శిగా ఉమాకాంతనాయుడు

శ్రీరంగరాజపురం: భారతీయ జనతా పార్టీ మజ్దూరు మోర్చా జిల్లా కార్యదర్శిగా ఎస్ఆర్‌పురం మండలం సింధురాజపురానికి చెందిన పి.ఉమాకాంతనాయుడును నియమించినట్టు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాలాచారి, పార్టీ మండల అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు పేర్కొన్నారు. జిల్లా మజ్దూరు మోర్చా అధ్యక్షుడు అట్లూరు శ్రీనివాసులు నుంచి నియామక పత్రం అందినట్టు తెలిపారు. మజ్దూరు మోర్చా కార్యవర్గ సభ్యుడిగా పద్మాపురం గ్రామానికి చెందిన బాలాజీని నియమితులయ్యారు.

ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ



భూమిపూజలో యుగంధర్ తదితరులు

పుత్తూరు: దివంగత సీఎం ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు గురువారం పుత్తూరు పొలిమేరలో భూమిపూజ నిర్వహించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పున్నమి హోటల్ వద్ద ట్రాఫిక్ ఐలాండ్‌లో విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ యుగంధర్, వైస్‌ఛైర్మన్ భాస్కర్, కౌన్సిలర్లు రాజశేఖర్‌వర్మ, వెంకటేష్, ప్రసాద్ నాయుడు, ఆనంద్, గోవర్ధన్ , గోపి ఆ చారి, హరి, ఖాజాపీర్, నాయకులు జీవరత్నంనాయుడు, మాధవనాయుడు, కరుణ, గణేష్, షణ్ముగరెడ్డి, ఏళుమలైరెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించండి

పుత్తూరు: ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, తాగునీరు వంటి వసతులు కల్పించాలని ఫిక్కి స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ఉమ కోరారు. గురువారం ఢిల్లీకి చెందిన ప్లాన్ ఇండియా టీంతో కలసి ఆమె పుత్తూరు మున్సిపాలిటీ పిళ్లారిపట్టు ఉన్నత పాఠశాలలో మౌలిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బర్త్ ప్లాన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ప్రభుత్వ పాఠశాలలో తమ సంస్థ మరుగుదొడ్లు, తాగునీటి వసతి కల్పిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో 283 పాఠశాలల్లో తమ సంస్థ మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నౌమానిత, ఫిక్కి కోఆర్డినేటర్ మూర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు

శ్రీరంగరాజపురం: మద్యం సేవించి వాహనాలను నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ వాసంతి చెప్పారు. గురువారం ఎస్ఆర్‌పురం మండలం కేంద్రం సమీపంలోని పుల్లూరు క్రాస్‌ల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అతి వేగంగా వాహనాలను నడపరాదని, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు గోపి, జనార్ధన్ , రాజశేఖర్ పాల్గొన్నారు.

గడ్డపారల పంపిణీ

కార్వేటినగరం: మండలంలోని ఉపాధి కూలీలకు గురువారం ఉపాధి కార్యాలయం వద్ద ఎంపీపీ జనార్ధన రాజు గడ్డపారలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఉపాధి పనుల్లో పంట సంజీవిని గుంతలు త్వరితగతిన చేపట్టాలని సూచించారు. కూలీలు 150 పనిదినాలు చేసుకోవాలన్నారు. ఉపాధి కూలీలందరూ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీవో దేవరి, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎంఆర్ టీకా తప్పనిసరిగా వేయించాలి

వాల్మీకిపురం: 9నెలల నుంచి 15ఏళ్లలోపు పిల్లలకు మీజిల్స్, రుబెల్లా టీకాను తప్పనిసరిగా వేయించాలని విశ్రాంత హెచ్ఎం లు అమీర్‌హుస్సేన్, జవాద్‌హుస్సేన్ లు సూచించారు. గురువారం వాల్మీకిపురం నాయక్‌వీధిలోని ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహ్మద్ రఫీ, హెల్త్ సూపర్‌వైజర్ సుధాకర్, విశ్రాంత ఎంపీడీవో బషీరుల్లాఖాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న విశ్రాంత హెచ్ఎం అమీర్‌హుస్సేన్

ఇంటిపట్టాల కోసం సీపీఐ ధర్నా



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ములకలచెరువు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం సీపీఐ నాయకులు ధర్నా చేపట్టారు. నిరుపేదలకు ఇంటి పట్టాలు మంజూరుచేసి పక్కా గృహాల నిర్మాణానికి ప్రభుత్వం రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనకు దిగారు. ఈసందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి వెంకటరమణనాయుడు, ప్రధాన కార్యదర్శి అంజనప్పలు మాట్లాడుతూ మండలంలోని వేలాది మంది నిరుపేదలు పక్కా గృహాల మంజూరు కొరకు దరఖాస్తు చేసుకున్నా ప్రయోజనం లేదన్నారు. జన్మభూమి కమిటీలను రద్దు చేసి అర్హులకు మంజూరు చేసిన పక్కా గృహాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు రెడ్డెప్ప, విజయ్‌కుమార్, శివన్న, మల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యలోపంపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు

వాల్మీకిపురం: పట్టణంలోని జలీల్‌సాహెబ్ మిషన్ వెనుక ప్రాంతంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని పలువురు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని కలిసి గురువారం వినతి పత్రం సమర్పించారు. దాదాపు 30కుటుంబాలు 15ఏళ్లుగా ఈ ప్రాంతంలో నివసిస్తున్నా మురికినీటి కాలువలను నిర్మించలేదని సీసీ రోడ్డు కూడా వేయలేదని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వర్షం పడితే ఇళ్లలో నుంచి రావాలంటేనే భయం వేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మురికినీరంతా ఇళ్ల ముందరే ప్రవహిస్తుండడంతో దోమలు వ్యాప్తి చెంది చిన్నపిల్లలు రోగాల బారిన పడుతున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. ఈకార్యక్రమంలో ఆబిద్‌హుస్సేన్, చినా మస్తాన్, రహంతుల్లా, బాబు తదితరులు పాల్గొన్నారు.

వంక స్థల ఆక్రమణను అడ్డుకున్న అధికారులు

మదనపల్లె రూరల్: ఓ రైతు తన పొలాన్ని చదునుచేసుకుంటూ పక్కనే వున్న వంకలో బండరాళ్లను తోస్తుండటంతో రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. బసినికొండ పంచాయతీలో బట్టీగుట్ట వద్ద ఓ రైతుకు ప్రభుత్వం డీకేటీ పట్టా ఇచ్చింది. గురువారం ఆ రైతు తన పొలాన్ని ఎక్స్‌వేటర్‌తో చదును చేస్తూ పెద్దబండరాళ్లను పక్కనే వున్న వంక పోరంబోకులో తోస్తున్నాడు. ఈ విషయమై సమాచారం అందుకున్న ఆర్ఐ విజయ్‌కుమార్ ఆదేశాలతో బసినికొండ వీఆర్‌వో రాజేంద్ర అక్కడికి వెళ్లి పరిశీలించారు. వంక పోరంబోగు స్థలంలో బండారాళ్లను వేయరాదని అడ్డుకోవడంతో పాటు, వంకలోని రాళ్లను తొలగించాలని రైతును ఆదేశించారు. రెండు రోజుల్లో వంకలోని రాళ్లను తొలగించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులకు నగదు బహుమతి అందజేత



విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న టీడీపీనాయకులు

ములకలచెరువు: ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. స్థానిక కళాశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పూజారి రెడ్డెప్ప జ్ఞాపకార్థం ఆయన బంధువైన టీడీపీ నాయకులు నాగరాజయాదవ్ నగదు బహుమతిని పంపిణీ చేశారు. సైన్స్, ఆర్ట్స్ గ్రూపుల్లో చదువుల్లో రాణిస్తున్న విద్యార్థులు చక్రపాణి, నాగరాజులకు రూ.5116లు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రెడ్డిశివశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరుబయట చదువులు ఇంకెన్నాళ్ళు..!

తంబళ్లపల్లె: మండలంలోని కన్నెమడుగు పంచాయతీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఆరుబయట విద్యను అభ్యసిస్తున్నారు. సుమారు 38మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో ఒకే తరగతి గది ఉండడంతో 20 మంది పిల్లలకు బయటే చదువు చెప్పాల్సి వస్తోందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు ఉన్న పాఠశాలలో ఒకే తరగతి గది ఉండడం 16 ఫిబ్రవరి 2016న వర్షాలకు ఉరుస్తున్న భవనాన్ని కూల్చివేయడంతో నేడు విద్యార్థులు చెట్ల కింద చదువు కోవాల్సి వస్తోంది. ప్రభుత్వం నిరుపేద విద్యార్థుల చదువుకోసం అధిక నిధులు ఖర్చు పెడుతున్నా నేటికి కన్నెమడుగు పాఠశాల మాత్ర నూతన భవనానికి నోచుకోలేదు. గతంలో చెట్ల కింద విద్యను అభ్యసించిన కాలంలో కూడా ఇలాంటి సమస్యలు లేవని గ్రామస్తులు వాపోతున్నారు. ఎంఈవో త్యాగరాజును వివరణ కోరగా



కన్నెమడుగు ప్రాథమిక పాఠశాలలో ఆరుబయట విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయురాలు

ఎగువబోయపల్లె, తంబళ్లపల్లె, కోసువారిపల్లె, కన్నెమడుగు, ప్రాథమిక పాఠశాలలు శిథిలావస్థకు చేరిన కారణంగా కూల్చివేశామన్నారు. వాటి స్థానంలో త్వరలోనే నూతన భవనాల నిర్మాణం చేపడతామన్నారు. అయితే వర్షాకాలంలో సైతం ఆరుబయట పిల్లలను నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామస్తులు ప్రభుత్వ పాఠశాలలకు తమ పిల్లలను పంపడానికి ఆసక్తి చూపడం లేదు.

భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ గ్రామసభలు



ఫిర్యాదును పరిశీలిస్తున్న తహసీల్దార్ హనుమంతు

బి.కొత్తకోట/తంబళ్ళపల్లె: భూసమస్యలు పరిష్కారమే రెవెన్యూ గ్రామసభల ధ్యేయమని ఇన్ చార్జి తహసీల్దార్ హనుమంతు పేర్కొన్నారు. గురువారం కోటావూరు పంచాయతీ అమరనారాయణస్వామి దేవాలయంలో గ్రామసభ నిర్వహించారు. పలు సమస్యలపై రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఎమ్మార్వో మాట్లాడుతూ శుక్రవారం కోటావూరు పంచాయతీలో గ్రామసభ జరుగుతుందన్నారు. రెవెన్యూ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ జయచంద్రారెడ్డి, సర్వేయర్ గోపినాథ్, వీఆర్వోలు శివశంకర, వెంకటరమణ, రవికుమార్, గంగాధర్, చంద్రశేఖర్, వీఆర్ఏలు గౌస్‌మోదీన్, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

❖ రైతుల సమస్యలు తీర్చేందుకే రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తంబళ్లపల్లె డిప్యూటీ తహసీల్దార్ సుధాకర్‌నాయుడు పేర్కొన్నారు. మండలంలోని ఎర్రసానివారిపల్లె పంచాయతీలో గురువారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కడా లేని విధంగా పంచాలమర్రి, ఎర్రాసానిపల్లె పంచాయతీల్లో టీఎన్ వంశీయుల భూమి వివాదాలు గ్రామసభల్లో బయటకొస్తున్నాయన్నారు. రైతులు తమ సమస్యలను పట్టాదార్, భూరికార్డ్‌స్టేషన్ పత్రాల ద్వారా తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదిస్తే న్యాయం చేస్తామన్నారు. రైతులందరూ తమ పట్టాదారు పాసుపుస్తకాల నకలతో తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి, చెరువు సంఘం అధ్యక్షులు మోహన్ రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీకి యత్నించిన దొంగలను పట్టుకున్న గ్రామస్తులు

వాల్మీకిపురం: ఆలయంలో చోరీకి యత్నించిన దొంగలను గ్రామస్తులు పోలీసులకు పట్టించిన సంఘటన వాల్మీకిపురం మండలంలో జరిగింది. మండలంలోని చింతపర్తి బాహుదా నది తీరాన వెలసిన గుంటిగంగమ్మ ఆలయంలో బుధవారం రాత్రి పాతకోటపల్లెకు చెందిన వెంకటేష్, శ్రీనివాసులుతో పాటు కర్ణాటక రాష్ట్రం శ్రీనివాసపురానికి చెందిన బావాజాన్ లు చోరీకి యత్నిస్తుండగా అటువైపు వెళ్తున్న స్థానికులు గమనించారు. ఓ వ్యక్తి అర్ధరాత్రి ఆలయం ముందు అనుమానాస్పదంగా తిరుగుతుండగా బహిర్భూమికి వచ్చిన పాతకోటపల్లెకు చెందిన వ్యక్తి గమనించి స్థానికులకు సమాచారం అందించాడు. గ్రామస్తులు ఆలయం వద్దకు చేరుకుని వ్యక్తితో పాటు ఆలయం లోపల ఉన్న ఇద్దరిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గతంలో ఇదే ఆలయంలో దొంగలు హుండీ పగులగొట్టి చోరీకి పాల్పడడంతో పోలీసులు విభిన్న కోణాల్లో విచారిస్తున్నట్లు సమాచారం.

కొనసాగిన పోస్టల్ ఉద్యోగుల సమ్మె

వాల్మీకిపురం: ఆల్ ఇండియా గ్రామీణ డాక్‌సేవక్ యూనియన్ పిలుపు మేరకు జీడీఎస్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె గురువారం కూడా కొనసాగింది. వాల్మీకిపురం పోస్టాఫీసు వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా యూనియన్ నాయకులు కమలనాథ్, చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ గ్రామీణ డాక్ సేవకు 8గంటలకు పని కల్పించి సివిల్‌సర్వెంట్ హోదా కల్పించాలని, 7వ వేతన సంఘ సిఫారసులను వెంటనే అమలు చేయాలని డిమాండ్‌చేశారు.

భూసమస్యలను పరిష్కరిస్తాం

గుర్రంకొండ: గ్రామాల్లో రైతు భూసమస్యల పరిష్కారానికి రైతు సేవలో రెవెన్యూ శాఖ పని చేస్తోందని తహసీల్దార్ రవిచంద్రన్ అన్నారు. మండలంలోని కండ్రిగ గ్రామంలో గురువారం ఈకార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా రైతుల నుంచి వచ్చిన భూసమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు రెవెన్యూ సేవలు సులభతరంగా మారాయని కావున సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఆర్ఐలు ప్రవీణ్, ఉదయ్‌కుమార్‌రెడ్డి, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

కోడిపిల్లల పంపిణీ

ములకలచెరువు: మనకోడి పథకం కింద లబ్ధిదారులకు 7267 కోడిపిల్లలను పంపిణీ చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో గురువారం లబ్ధిదారులకు ప్రజాప్రతినిధులు, అధికారులు కోడిపిల్లలను అందజేశారు. ప్రభుత్వం 75శాతం సబ్సిడీతో మండలానికి 169 మనకోడి యూనిట్లను పంపిణీ మంజూరు చేసింది.

నేడు ఎమ్మెల్యే రాక

బి.కొత్తకోట: పట్టణ శివారులోని శ్రీలక్ష్మీ సాయి గార్డెన్స్‌లో ఆర్యవైశ్య కమ్యూనిటీ భవన నిర్మాణ భూమి పూజకు తంబళ్లపల్లె ఎమ్మెల్యే శంకర్ శుక్రవారం ఉదయం 11గంటలకు హాజరవుతున్నట్లు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గోరంట్ల రమేష్ తెలిపారు. రూ.60లక్షల వ్యయంతో ఆర్యవైశ్య కమ్యూనిటీ భవనాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు.

రేపు పట్టాభిరాముడి కళ్యాణోత్సవం

వాల్మీకిపురం: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని పట్టాభిరాముని కళ్యాణోత్సవం శనివారం ఉదయం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇన్ స్పెక్టర్ సాయికృష్ణ, ఆలయ పరంపర అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. కళ్యాణోత్సవంలో పాల్గొనే దంపతులు రూ.300 చెల్లించి ఆర్జిత సేవ టిక్కెట్లు పొందాలని కోరారు. ఆర్జిత సేవలో పాల్గొనే దంపతులకు టీటీడీ ప్రసాదం, పట్టు వస్త్రాలు పంపిణీ చేస్తుందన్నారు.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

నిమ్మనపల్లె: మండలంలోని నిరుద్యోగులు వివిధ కార్పొరేషన్ల ద్వారా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గంగయ్య తెలిపారు.మదనపల్లె సప్తగిరి గ్రామీణ బ్యాంకు పరిధిలోని వారికి ఈనెల 22న, నిమ్మనపల్లె ఇండియన్ బ్యాంకు పరిధిలో దరఖాస్తు చేసుకున్న స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. నిరుద్యోగులకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక కమిటీ, బ్యాంకు అధికారులు ప్రకటించనున్నట్లు తెలిపారు.

మదనపల్లె మండలంలో...

మదనపల్లె రూరల్: మదనపల్లె మండలానికి మంజూరైన వివిధ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి ఈనెల 22వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీపీ సుజన, ఎంపీడీవో లక్ష్మీపతిలు తెలిపారు. కాపు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కులాలకు చెంది, ఇది వరకే ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకున్న వారందరూ ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. అభ్యర్థులు రెండు సెట్ల దరఖాస్తు జిరాక్స్‌లను, ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకురావాలని, గతంలో రుణాలు అందని వారు కూడా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

బైకుపై నుంచి పడి తీవ్ర గాయాలు

వాల్మీకిపురం: నిమ్మనపల్లె మండలం ముస్తూరు గ్రామానికి చెందిన కృష్ణప్ప కుమారుడు సుధాకర్ ద్విచక్రవాహనంలో వాల్మీకిపురానికి వస్తుండగా పత్తేపురం వద్ద ఎదురుగా వస్తున్న బైకును తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడ్డాడు. ప్రమాదంలో సుధాకర్ తలకు బలమైన గాయాలయ్యాయి. అతడిని మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా గోపాలుడి కల్యాణోత్సవం

తొట్టంబేడు: మండలంలోని నెల్లిమానుకండ్రిగ గ్రామంలో బుధవారం రాత్రి గోపాలుడి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. గ్రామంలోని శ్రీకృష్ణాలయంలో మూడు రోజులుగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నారు.ఇందులో భాగంగా స్వామి కల్యాణోత్సవం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా నిర్వహించారు. భక్తులకు సర్పంచ్ విమలమ్మ ఆధ్వర్యంలో ప్రసాదాలను పంపిణీ చేశారు.


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కర్నానదికి కన్నాలు పెడుతున్నారు

యథేచ్ఛగా సాగుతున్న ఇసుక అక్రమ రవాణా

వరదయ్యపాళెం:మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న కర్నానది నుంచి అక్రమార్కులు ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. రోజూ నది నుంచి పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తుండడంతో గుంతలమయంగా మారింది. ఇటీవల ప్రభుత్వం ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకోవడంతో ఇసుకకు అమాంతంగా డిమాండ్ పెరిగింది. దీంతో ఇసుకాసురులు స్థానికంగా వున్న ఏర్లు, కాలువలు, నదుల నుంచి ఇసుకను తరలించేందుకు అక్రమమార్గాలను ఎంచుకుంటున్నారు. శ్రీసిటీ పరిధిలోని వివిధ పరిశ్రమల నిర్మాణాలకు ఇసుక అవసరాలు అధికంగా ఉండడంతో కాలువలు, ఏర్ల నుంచి తవ్వితీసే ఇసుకనే ఇసుకాసురులు అధిక రేట్లతో అమ్ముతున్నారు. మరికొందరు ఇసుకను కాలువల నుంచి ట్రాక్టర్ల ద్వారా తరలించి, రహస్య ప్రదేశాల్లో నిల్వచేస్తున్నారు. అనంతరం దానిని అధిక రేట్లకు పక్క రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో కర్నానది నుంచి అక్రమార్కులు రోజూ ఇసుకను తరలిస్తున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.


కర్నానది నుంచి ఇసుకను తవ్వి తరలిస్తున్న కూలీలు

సర్వేతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రస్తుతం జరుగుతున్న భూముల సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ జయచంద్ర తెలిపారు. మండలంలోని తలారివెట్టు గ్రామంలో గురువారం రైతుల ముగింటకు రెవెన్యూ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... గ్రామంలోని 1వ సర్వే నెంబరు నుంచి చివరి నెంబరు వరకు సర్వేయర్, ఆర్ఐ, వీర్వోలు సర్వే చేస్తారన్నారు. ఈ సర్వేతో పట్టాదారుతో పాటుగా అనుభవంలో ఉన్న రైతులను కూడా గుర్తించడం జరుగుతుందన్నారు. అలాగే ప్రభుత్వ భూములతో పాటు మిగులు భూములను గుర్తిస్తామన్నారు. దీంతో భూ సమస్యలు వెలుగులోకి వస్తాయని, వాటిని వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ సుబ్రహ్మణ్యం రెడ్డి, ఆర్ఐ అశోక్, వీర్వోలు వెంకటేశ్వర్లు, రంగయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


తలారివెట్టులో భూ సర్వే చేస్తున్న సిబ్బంది

గ్రామస్థాయి కమిటీ సమావేశాలు జరపాలి

టీడీపీ నేత సుధాకరనాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ: గ్రామస్థాయి కమిటీ సమావేశాలు విధిగా జరపాలని మండల టీడీపీ అధ్యక్షుడు సుధాకరనాయుడు తెలిపారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల పార్టీ కార్యకర్తల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో కమిటీ సమావేశాలు సక్రమంగా జరిగితే పార్టీ పటిష్ఠంగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల కోసం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలని తెలిపారు. గ్రామస్థాయిలో చేపట్టవలసిన పనులను గ్రామ కమిటీ సమావేశంలో చర్చించి పంపితే, జిల్లా, రాష్ట్రస్థాయికి పంపి పనులు మంజూరు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సుందరయ్య, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ కన్నయ్యనాయుడు, సింగిల్ విండో ఛైర్మన్ సుబ్రహ్మణ్యంరెడ్డి, నాయకులు రమేష్‌బాబు, సురేష్ నాయుడు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర నాయుడు

పర్యావరణానికి హాని కల్పించవద్దు

• స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని వినతి

తొట్టంబేడు: మండలంలోని రౌతుసూరమాలలో గ్రీన్ ప్లై ఇండస్ట్రీస్ లిమిటెడ్ వద్ద గురువారం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అలాగే స్థానికులకు కర్మాగారంలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంతంలో కర్మాగారాలు ఏర్పాటు చేస్తే స్థానికంగా ఉపాధి పొందవచ్చునని ఊహించామని, అయితే ప్రస్తుతం ఎక్కువ శాతం మంది కార్మికులు బయటప్రాంతాల వారే ఇక్కడ ఉపాధి పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, ప్రజాభిప్రాయ సేకరణ గ్రామంలో నిర్వహించకుండా, కర్మాగారం వద్ద నిర్వహించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ కార్యక్రమంలో డీఆర్వో రజియా బేగం, పర్యావరణ పరిరక్షణాధికారి నరేంద్రబాబు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



సభలో పాల్గొన్న అధికారులు

ఆక్రమిత స్థలాన్ని పరిశీలించాలని వినతి

ఏర్పేడు: మండలంలోని మేర్లపాకలో గ్రామ దేవత ఎల్లమ్మ దేవాలయం వెనుక ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించుకున్నారని గ్రామస్థుడు మహేంద్ర తహసీల్దారు శేషగిరిరావుకు ఫిర్యాదు చేశారు. ఈ స్థలం ఆక్రమణకు గురికాకుండా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన తహసీల్దారును కోరారు. దీనిపై స్పందించిన తహసీల్దారు స్థలాన్ని సర్వే చేయించి, ఆక్రమణకు గురికాకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ మృతి : ముగ్గురికి గాయాలు

వరదయ్యపాళెం: మండలంలోని రాచకండ్రిగ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రాచర్లకు చెందిన శివ (30) మృతి చెందగా మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు... వరదయ్యపాళెం నుంచి తడవైపు వెళుతున్న ట్రాక్టర్‌ను అధికమించబోయే క్రమంలో బత్తలావల్లంకు చెందిన సురేష్ ద్విచక్రవాహనంపై వెళుతూ ఎదురుగా వస్తున్న స్కూటర్‌ను ఢీకొట్టాడు. దీంతో డ్రైవర్ శివ భయంతో ట్రాక్టర్ నుంచి దూకేయడంతో రోడ్డుపైనే పడ్డాడు. అదేసమయంలో ట్రాక్టర్ శివ మీదుగా వెళ్లడంతో అతను అక్కడే మృతి చెందాడు.ఈ ప్రమాదంలో స్కూటర్‌పై ఎదురుగా వస్తున్న కడూరుకు చెందిన పార్వతి(22), నీలాద్రి(19)తో పాటు సురేష్ (25) తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు పార్వతి, నీలాద్రిని తిరుపతికి, సురేష్‌ను సూళ్లూరుపేట ఆస్పత్రికి తరలించారు.మృతదేహాన్ని సత్యవేడు ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ షేక్ షావల్లి తెలిపారు.


డ్రైవర్ శివ మృతదేహం

విద్యతో పేదరికం దూరం

బుచ్చినాయుడుకండ్రిగ: విద్యతో పేదరికం దూరమవుతుందని అమ్మా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఛైర్మన్ రమణయ్య నాయుడు తెలిపారు. బీఎన్ కండ్రిగలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువులో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఐదుగురు విద్యార్థులకు గురువారం ట్రస్ట్ తరఫున వెండి పతకాలను బహూకరించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ పేద విద్యార్థులను చదువులో ప్రోత్సహించేందుకే ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. అనంతరం తల్లి దండ్రులు లేని 30 మంది విద్యార్థులకు ఒక్కో జత యూనిఫాంను పంపిణీ చేశారు.కార్యక్రమంలో హెచ్ఎం విజయకుమారి. ట్రస్ట్ సభ్యులు మాధవరావు, విజయబాబు, నందగోపాల్, మమత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పతకం అందజేస్తున్న ట్రస్ట్ సభ్యుడు

ఆటోల్లో పరిమితికి మించి

ప్రయాణీకులను ఎక్కించరాదు

కేవీబీపురం: పరిమితికి మించి ప్రయాణీకులను ఆటోలలో ఎక్కించరాదని ఎస్ఐ పరశురాముడు సూచించారు. గురువారం ఆయన కేవీబీపురంలోని ఆటోడ్రైవర్లతో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఆటో వెనుక భాగం,డ్రైవర్ పక్కన ప్రయాణీకులను కూర్చోబెట్ట రాదన్నారు. అనంతరం పలు ఆటోలకు వెనుకవైపు డోర్ రాకుండా వెల్డింగ్ చేయించారు. వెనుక కేవలం లగేజీ మాత్రమే వేసుకోవాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణను డ్రైవర్లు బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు.


ఆటో వెనుక డోర్లకు వెల్డింగ్ చేయిస్తున్న పోలీసులు

నేడు 'వెలుగు' మండల సమావేశం

కేవీబీపురం : స్థానిక స్త్రీనిధి వెలుగు కార్యాలయంలో శుక్రవారం మండల సమాఖ్య సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు ఏపీఎం సీతారామయ్య తెలిపారు. సమావేశానికి సంబంధిత అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామీణ లీడర్లు తప్పక హాజరు కావాలని సూచించారు.

కారణిమిట్టలో ఉచిత వైద్య శిబిరం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కారణిమిట్టలోని ప్రాథమిక పాఠశాలలో అమ్మా భగవాన్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 90 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ట్రస్ట్ సభ్యుడు వెంకటశ్రీనివాస్ దాసాజీ, హ్యూమానిటీ కేర్ యువత సభ్యులు ప్రతాప్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


బహుమతులను అందజేస్తున్న ప్రముఖులు

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో గత వారం ధర్మరాజ స్వామి ఆలయంలో నిర్వహించిన తిరునాళ్లకు సంబంధించి జరిగిన మహాభారతం కథపై స్థానిక చేనేత సంఘం ఆధ్వర్యంలో గురువారం వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. పోటీలలో కె.జనార్ధన్ రెడ్డి ప్రథమస్థానంలో, మాధవి ద్వితీయస్థానంలో, జ్యోతి జ్యూవెలరీమార్టు వార్డు తృతీయస్థానంలో నిలిచారు. వీరికి చేనేత సంఘం సభ్యులు మహాభారత అవార్డులను అందజేశారు. సర్పంచ్ గోవిందస్వామి మొదలియార్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సిబ్బంది సమ్మెతో స్తంభించిన లావాదేవీలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పోస్టల్ సిబ్బంది సమ్మెతో గురువారం పోస్టల్ కార్యక్రమాలు స్తంభించిపోయాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పోస్టల్ సిబ్బంది జీతాలు పెంచాలని రెండు రోజులు నుంచి సమ్మె చేస్తున్నారు. ఈ క్రమంలో బుచ్చినాయుడుకండ్రిగ సబ్ పోస్టాఫీసు పరిధిలోని పల్లమాల, కారకొల్లు, పెద్దపాలేడు, గాజులపెళ్యూరు, కుక్కంబాకం, కాటూరు, ఆలత్తూరు, సంతవేలూరు తదితర బ్రాంచ్‌ల సిబ్బంది సమ్మెలో పాల్గొన్నారు. దీంతో పోస్టల్ బట్వాడాలు నిలిచిపోయాయి.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

మదనపల్లె అర్బన్: వినాయక చవితి పండుగకు గ్రామాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల నుంచి అనుమతి తీసుకోవాలంటూ రూరల్ సీఐ మురళీ తెలిపారు. ఈసందర్భంగా గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..పోలీసుల నుంచి అనుమతి తీసుకోకుండా విగ్రహాలు ఏర్పాటు చేస్తే నిర్వాహకులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో ఉత్సవకమిటీ ఏర్పాటు చేసుకుని దాని ప్రకారం పండుగ జరుపుకోవాలన్నారు. తాగిన వ్యక్తులు అల్లర్లు చేస్తూ గొడవలకు పాల్పడితే అరెస్ట్ చేస్తామన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ సునీల్‌కుమార్, ముదివేడు ఎస్ఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

హాజరుకాని

మోసగత్తెను పట్టుకోండి

పోలీసులకు కోర్టు ఉత్తర్వులు

ఆమె హాజరుకాకపోతే 30 రోజుల్లో ఆస్తుల జప్తు: టూటౌన్ సీఐ

మదనపల్లె అర్బన్: కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకుని తిరుగుతున్న ఓ నేరస్థురాలిని పట్టుకుని హాజరుపరచాలని న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేసినట్లు వన్ టౌన్ సీఐ నిరంజన్ కుమార్ తెలిపారు. కాగా సీఐ తెలిపిన వివరాల మేరకు..చౌడేపల్లె మండలం బజారువీధికి చెందిన కైవారం సురేంద్ర భార్య కె.వసంత(36)గతంలో మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెలో నివాసముండేది. ఈనేపథ్యంలో ఈమె 2011లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ..అదే ప్రాంతానికి చెందిన నలుగురిని నమ్మించి వారినుంచి రూ.2లక్షలు నగదు వసూలు చేసింది. అయితే ఎన్నాళ్లయినా ఉద్యోగాలు రాకపోవడంతో చివరికి మోసపోయామని తెలుసుకున్న బాధితులు వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2011జూలైలో వసంతపై చీటింగ్ కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. అనంతరం బెయిల్‌పై బయటకు వచ్చిన ఈమె కోర్టు వాయిదాలకు సక్రమంగా హాజరు కాలేదు. స్థానిక న్యాయస్థానం 2015ఏప్రిల్ 21వతేదీన నిందితురాలిపై అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. అయినా నిందితురాలు పోలీసుల కళ్లుగప్పి తప్పించుకుని తిరుగుతోంది. ఇదిలావుండగా న్యాయస్థానం ఈనెల 2న నిందితురాలిని ప్రకటించబడిన నేరస్థురాలిగా పరిగణిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా నిందితురాలు ఎక్కడ ఉన్నా..ప్రకటన జారీ చేసిన 30రోజుల్లోపు కోర్టుకు హాజరు కావాలని, అలాకాని పిమ్మట వసంతకు సంబంధించిన ఆస్తులను న్యాయస్థానం జప్తు చేయనున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఇన్‌పుట్ సబ్సిడీ కోసం రైతుల ధర్నా

మదనపల్లెటౌన్: రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇన్‌పుట్ సబ్సిడీ మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమచేయాలని రైతులు స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ధర్నా చేపట్టారు. మదనపల్లె మండలం బొమ్మనచెరువు, అంకిశెట్టిపల్లె, వేంపల్లె, పెంచుపాడు గ్రామాలకు చెందిన రైతులు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నాలుగు పంచాయతీలకు చెందిన సుమారు 920 మంది రైతులు ఆంధ్రా బ్యాంకులో ఖాతాలు ఉన్నట్లు చెప్పారు. అయితే 2015-16 సంవత్సరానికి గాను రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇన్‌పుట్ సబ్సిడీ నెలలు గడుస్తున్నా ఇంత వరకు రైతుల ఖాతాల్లో జమకాలేదన్నారు. ఈవిషయమై బ్యాంకు, వ్యవసాయ అధికారులను సంప్రదించగా ఒకరిపై ఒకరు నిందలు మోపుకుంటూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. మరికొంత మంది బ్యాంకు ఖాత నంబర్లు తప్పుగా నమోదు చేశారన్నారు. క్రాప్ ఇన్సూరెన్స్ కింద ప్రతి సంవత్సరం రైతు సాగు చేసే పంటల ఆధారంగా రూ.1100 నుంచి రూ.2 వేలు ఇన్సూరెన్స్ కింద కడుతున్నా ఇప్పటి వరకు ఒక్కసారి ఇన్సూరెన్స్ మంజూరు కాలేదన్నారు. అధికారులు స్పందించి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతున్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయ ఇన్‌చార్జి ఏవో క్రిష్ణమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు రాజన్న, పార్థసారధి, మునుస్వామినాయుడు, నాగయ్య, అప్పల్లా, సుధాకర్, నరసమ్మ, రామలక్ష్మ తదితరులు పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ధర్నా చేస్తున్న రైతులు

ఆగమేఘాలపై బోరుబావుల మూత

మదనపల్లె రూరల్: వినుకొండ బోరుబావిలో బాలుడు పడి..ప్రాణాలతో బయటపడిన సంఘటనతో జిల్లా అధికారులు స్పందించారు. కలెక్టర్ ప్రద్యుమ్న ఆదేశాలతో ఎంపీడీవో లక్ష్మీపతి, ఈవోఆర్డీ లీలామాధవిలు గురువారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గతంలో తాగునీటి కోసం పంచాయతీ అధికారులు, సాగునీరు కోసం రైతులు వేసిన బోర్లను గుర్తించారు. వాటిలో నీరు ఇంకిపోయిన వాటిని, వినియోగంలో లేని బోరుబావులకు మూతలు బిగించారు. కేసింగ్ పైపులు తీసివేసి వున్న బోరుబావులకు రాళ్లను అడ్డం వేసి పూడ్చివేశారు. ఒక్క కొండామరి పల్లె పంచాయతీలోనే ఏడు బోర్లను గుర్తించి వాటికి మూతలు బిగించారు. మిగిలిన గ్రామ పంచాయతీల్లో కూడా వినియోగంలోని లేని బోర్లను గుర్తించి, వాటిని మూసివేసే కార్యక్రమం వేగవంతం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్ లు పాల్గొన్నారు.



మదనపల్లె మండలం కొండామరిపల్లె గ్రామంలో బోరుబావులను పూడ్చివేయిస్తున్న అధికారులు

మాదక ద్రవ్యాలతో

భవిష్యత్ నాశనం చేసుకోవద్దు



ర్యాలీ నిర్వహిస్తున్న బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు

మదనపల్లె రూరల్: విద్యార్థుల ఆరోగ్యాన్ని, జీవితాన్ని నాశనం చేసే మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బషీర్‌అహ్మద్ పేర్కొన్నారు. గురువారం స్థానిక జీజేసీ కళాశాల ఎన్ ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దేశానికి యువతే భవిత అని, అలాంటి యువత దురలవాట్లు, మాదకద్రవ్యాల బానిసలు కావడం వలన వారి భవిష్యత్ నాశనమవుతోందన్నారు. పోలీసు కేసులతో వారి కెరీయర్ దెబ్బతింటోందని, యువత పెడదోవ పట్టకుండా వారి తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలన్నారు. ఫేస్‌బుక్, వాట్సప్ వంటి సోషల్ మీడియాతో సమయాన్ని వృధా చేయకుండా, విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం సంతబజారు, బెంగళూరు బస్టాండు, మల్లికార్జున సర్కిల్ మీదుగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రమణకుమార్, ఎన్ ఎస్ఎస్ కోఆర్డినేటర్ మోహనవల్లి, అధ్యాపకులు రెడ్డెప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టూవీలర్ బోల్తా..వ్యాపారికి తీవ్రగాయాలు

మదనపల్లె అర్బన్: టూవీలర్ అదుపుతప్పి బోల్తాపడటంతో ఓ వ్యాపారి తీవ్రంగా గాయపడ్డాడు. మదనపల్లె పట్టణం ప్రశాంత్ నగర్‌కు చెందిన పి.రెడ్డికుమార్(45)అగ్రికల్చర్ వ్యాపారం చేస్తుండేవాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఈయన టూవీలర్‌లో కురబలకోట మండలం అంగళ్లు నుంచి మదనపల్లెకు బయలుదేరాడు. కాగా మార్గమధ్యలో అంగళ్లు సమీపంలోని గొర్రెల సంత ఎదుట ఏర్పాటు చేసిన వేగనిరోధకం వద్ద వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో రెడ్డికుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుని చికిత్స నిమిత్తం 108లో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇక్కడి వైద్యులు రెడ్డికుమార్‌కు మెరుగైన చికిత్స అందించి వార్డుకు తరలించారు.

రెండో రోజుకు తపాలా ఉద్యోగుల సమ్మె



సమ్మెలో పాల్గొన్న తపాలా ఉద్యోగులు

మదనపల్లెటౌన్: డిమాండ్లను పరిష్కరించాలని ఆల్ ఇండియా గ్రామీణ తపాలా ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం రెండోరోజుకు చేరుకుంది. సమ్మెకు సీపీఐ నాయకులు కృష్ణప్ప, సాంబశివలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీడీఎస్ ఉద్యోగులకు ఎనిమిది గంటల పని కల్పించి సివిల్ సర్వెంట్ హోదా కల్పించాలని, ఢిల్లీ క్యాట్ ప్రిన్సిపల్ బెంచ్, మద్రాసు క్యాట్ బెంచ్ తీర్పు ప్రకారం జీడీఎస్ ఉద్యోగులకు పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తపాలా శాఖ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ స్కీములు, పనిని వర్క్‌లోడ్ పరిధిలోకి తీసుకురావాలని, పేమెంట్, కోర్‌బ్యాకింగ్, సోలుష్యన్స్ మొదలైన టెక్నాలజీని దృష్టిలో పెట్టుకుని రానున్న రోజుల్లో ప్రవేశపెట్టే స్కీముల పనిభారాన్ని దృష్టిలో పెట్టుకుని డిపార్ట్‌మెంట్ ఉద్యోగులకు ఎంత శాతం ఇంక్రిమెంట్ మంజూరు చేస్తుందో అంతే శాతాన్ని జీడీఎస్ ఉద్యోగులకు అంతే శాతం ఇంక్రిమెంట్ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెకు సీపీఐ పార్టీ మద్దతుగా ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో రామచంద్రారెడ్డి, క్రిష్ణప్ప, నక్కా రమణ, అమరనాథ్, ఎస్.వి.రమణ, నాగభూషణం, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సౌత్ ఇండియా చారిటీ ట్రస్టు

జిల్లా కమిటీ ఎన్నిక

మదనపల్లెటౌన్: సౌత్ ఇండియా ప్రభుత్వేతర (నాన్ గవర్నమెంట్) చారిటీ ట్రస్ట్ జిల్లా కమిటీని సోమవారం మదనపల్లెలో ఎన్నుకున్నారు. సౌత్ ఇండియా ప్రభుత్వేతర చారిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుభద్ర ఆధ్వర్యంలో స్థానిక మిషన్‌కాంపౌండులోని బాయ్స్ హాస్టల్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సుభద్ర ప్రకటించారు. జిల్లా అధ్యక్షునిగా రిడో సంస్థకు చెందిన విల్లా ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శిగా పలమనేరు జీవీఎస్ సంస్థకు చెందిన ప్రమీలా, కోశాధికారిగా మార్పు సంస్థకు చెందిన ఎర్రయ్య, ఉపకోశాధికారిగా లక్ష్మిదేవి, ఉపాధ్యక్షులుగా ఆనంద్, కుళ్లాయమ్మ, గుర్రప్ప, రామారావు, సహాయ కార్యదర్శులుగా ఆశారాణి, రుద్రశేఖర్, లక్ష్మిదేవి, శ్యామల, గౌరవ సలహాదారులుగా మోర్ ప్రసాద్, వి.ఎస్.రెడ్డి, లలితమ్మ, దేవదానం, పసల చంద్రశేఖర్, సభ్యులుగా నరసయ్య, చలపతి, సుధాకర్, .జాకబ్, రామాంజులు, చంద్రశేఖర్, యుగంధర్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ జాతీయ అధ్యక్షరాలు యామిని ఆదేశాల మేరకు అన్ని జిల్లాల్లో కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో సేవా కార్యక్రమాలు మరింతంగా నిర్వహించనున్నట్లు చెప్పారు.

సినిమా గైడ్

మదనపల్లె

ఏఎస్ఆర్	:	లై
ఎంఎస్ఆర్	:	జయ జానకి నాయక
సిద్దార్థ	:	నక్షత్రం
మినీసిద్ధార్థ	:	నేనే రాజు నేనే మంత్రి
శ్రీకృష్ణ	:	నిన్ను కోరి
సాయిచిత్ర	:	నేనే రాజు నేనే మంత్రి
రవి	:	జయ జానకి నాయక
సునిల్	:	ఫిదా

ఇసుక అక్రమంగా తరలిస్తే

వ్యాపారులపై కఠిన చర్యలు

మదనపల్లె రూరల్: ఇసుకను అక్రమంగా వ్యాపారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌వోల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గృహ అవసరాలకు, అభివృద్ధి పనులకు తప్ప అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనాలను సీజ్ చేయాలని వీఆర్‌వోలకు సూచించారు. ప్రతి ట్రాక్టర్‌కు అనుమతి తప్పని సరిగా తీసుకోవాలని, ట్రాక్టర్ యజమానులకు సూచించారు. వినియోగంలో లేని బోరుబావులను గుర్తించి, వాటిని మూసివేయాలని వీఆర్‌వోలకు సూచించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. సమావేశంలో ఆర్ఐ విజయ్‌కుమార్‌రెడ్డి, సర్వేయర్ కృష్ణమూర్తి, వెంకటరమణారెడ్డి, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించిన మాలమహానాడు

మదనపల్లె రూరల్: ఎస్సీ వర్గీకరణ చెల్లదని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని మాలమహానాడు స్వాగతిస్తోందని మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు గుండా మనోహర్ పేర్కొన్నారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద గురువారం మాలమహానాడు నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శీతాకాల సమావేశాల్లో రాజ్యసభ సభ్యుడు కె.వి.పి. రామచంద్రరావు ప్రశ్నకు కేంద్ర సామాజిక శాఖమంత్రి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధ్యం కాదని తేల్చి చెప్పారన్నారు. దీనిపై మాలమహానాడు నాయకులు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో చోరీలకు అడ్డుకట్ట



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

శ్రీకాళహస్తి అర్బన్:లాక్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ అనే సాంకేతిక మొబైల్ పరిజ్ఞానంతో ఇళ్లలో చోరీలకు అడ్డుకట్ట వేయొచ్చని శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ చిన్నగోవిందు తెలిపారు.గురువారం ఆయన పట్టణంలోని వంశీ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలీసుశాఖ నూతనంగా తెచ్చిన మొబైల్ యాప్‌తో ఊరికి వెళ్లిన సమయంలో ఇళ్లలోకి దొంగలు ప్రవేశించకుండా ఆస్తులు, నగదు పూర్తిగా రక్షించుకోవచ్చన్నారు. అనంతరం యాప్‌ను విద్యార్థుల సెల్‌ఫోన్లలో డౌన్ లోడ్ చేయించారు. విద్యార్థులు ఈ యాప్‌పై తమ తల్లిదండ్రులకు, ఇరుగుపొరుగు వారికి అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రూరల్ అదనపు ఎస్ఐగా తాలిబ్ అలీ

శ్రీకాళహస్తి రూరల్: శ్రీకాళహస్తి రూరల్ అదనపు ఎస్ఐగా తాలిబ్ అలీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కడప నుంచి బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా తాలిబ్ అలీ మాట్లాడుతూ ఉత్తమ సేవలు అందించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు.

భూసమస్యల పరిష్కారమే ధ్యేయం

సబ్‌కలెక్టర్ నిశాంత్ కుమార్

శ్రీకాళహస్తి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'రైతు సేవలో రెవెన్యూ శాఖ' కార్యక్రమం ద్వారా భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని సబ్‌కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. మండలంలోని పాతగుంట పంచాయతీ అమ్మచెరువు గ్రామంలో గురువారం నిర్వహించిన రైతు సేవలో రెవెన్యూ శాఖ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పట్టాదారు పాసుపుస్తకాలను వారసుల పేరు మీదకు మార్చడం, సర్వే నెంబర్లలోని తప్పొప్పులను సరిదిద్దడం,రేషన్ కార్డులలో కొత్తగా పేర్లు నమోదు చేయడం వంటివి అప్పటికప్పుడే చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం స్థానిక సమస్యలపై గ్రామస్థులతో మాట్లాడారు. పంట పొలాల్లోకి వెళ్లే దారి ఆక్రమణకు గురైందని స్థానికులు సబ్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీంతో సబ్‌కలెక్టర్ మండల సర్వేయర్, సిబ్బందిని పంపి పొలాలకు వెళ్లే దారి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దారు సుబ్రహ్మణ్యం, ఆర్ఐలు సుబ్రహ్మణ్యం, సంతోష్, సర్వేయర్ హరి, వీఆర్వో నారాయణ, పాల్గొన్నారు.



భూరికార్డులు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

ముక్కంటి సేవలో మంత్రి మాణిక్యాలరావు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరుడిని గురువారం రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి మాణిక్యాలరావు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల గోపాలకృష్ణా రెడ్డి దర్శించుకున్నారు. వారికి ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు గురవయ్య నాయుడు, ఈవో భ్రమరాంబ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ కోలా ఆనంద్, పురపాలక సంఘ వైస్‌చైర్మన్ పార్థసారధి, మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్య నాయుడు, బీజేపీ జిల్లా కార్యదర్శి సుబ్రహ్మణ్యం రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు వెంకట్రామ నాయుడు,జయగోపాల్, నారాయణయాదవ్, ప్రమీలమ్మ, బాలాజీ, చెత్తమ నాయుడు, కె.రమేష్, గుర్రప్ప శెట్టి, తదితరులు పాల్గొన్నారు.



ముక్కంటి దర్శనానికి విచ్చేసిన మంత్రి మాణిక్యాలరావు, ఎమ్మెల్యే బొజ్జల

ముక్కంటి ఆలయంలో సిబ్బందిని నియమించాలని వినతి

ముక్కంటి ఆలయంలో తగినంత సిబ్బందిని నియమించాలని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు అమరనాథ్ విజ్ఞప్తి చేశాడు. ఈ మేరకు గురువారం ఆయన శ్రీకాళహస్తికి విచ్చేసిన మంత్రి మాణిక్యాలరావుకు వినతి పత్రం సమర్పించారు. ఆలయంలో తగినంత సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అదే విధంగా ముక్కంటి భక్తులకు మెరుగైన వసతి కల్పించడానికి ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు.

అయ్యా... ఇదేమి చోద్యం...?

శిలాఫలకంపై మాజీ ఎమ్మెల్సీ పేరు



నరేష్‌కుమార్‌రెడ్డి ఎమ్మెల్సీ అంటూ రాసిన శిలాఫలకం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలోని భరద్వాజతీర్థంలో భక్తుల కోసం వంద గదుల వసతిగృహ సముదాయ నిర్మాణానికి మంత్రి మాణిక్యాలరావు, ఎమ్మెల్యే బొజ్జల గోపాలకృష్ణారెడ్డి గురువారం భూమి పూజ చేశారు. భూమిపూజ కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకంలో మాజీ శాసనమండలి సభ్యుడు నరేష్‌కుమార్‌రెడ్డి పేరు కూడా పొందుపరిచారు. అయితే నరేష్‌కుమార్ ఎమ్మెల్సీ పదవీకాలం ముగిసి నెల రోజులు దాటిపోయింది.అయినా శిలాఫలకంపై నరేష్ కుమార్‌రెడ్డిని ఎమ్మెల్సీగా రాయడం చర్చనీయాంశంగా మారింది.

ముక్కంటి సేవలో డీఆర్వో

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరుడిని గురువారం జిల్లా రెవెన్యూ అధికారిణి రజియా బేగం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు స్వాగతం పలికి,దర్శన ఏర్పాట్లు చేశారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి తహసీల్దారు సుబ్రహ్మణ్యం, ఆర్ఐ సంతోష్ కుమార్, వీఆర్వో హరిబాబు యాదవ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం

కొనసాగుతున్న తపాలా ఉద్యోగుల సమ్మె



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న తపాలాశాఖ ఉద్యోగులు

శ్రీకాళహస్తి: సమస్యల పరిష్కారం కోసం తపాలా ఉద్యోగులు చేస్తున్న సమ్మెను రెండవ రోజు గురువారం కూడా కొనసాగించారు. కేంద్ర కమిటీ పిలుపు మేరకు తపాలా ఉద్యోగులు చేపట్టిన ఈ సమ్మెలో భాగంగా ఉద్యోగులు శ్రీకాళహస్తి తపాలా కార్యాలయం ఎదుట మోకాళ్లపై నిలబడి నిరసన తెలియజేశారు. తమ సమస్యలను పరిష్కరించడంతో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులను వేధింపులకు గురి చేయొద్దని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు సత్యనారాయణ, మణి, వాసుదేవ, లక్ష్మీపతిరాజు, ధర్మయ్య, ప్రభాకర రెడ్డి, చిరంజీవులు, మణి, సుబ్బరామయ్య, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వైద్యం కన్నా నివారణ మిన్న



ఎంఆర్ వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

శ్రీకాళహస్తి అర్బన్: వ్యాధులు సోకిన తరువాత వైద్యం పొందడం కన్నా, ముందే నివారణ చర్యలు పాటిస్తే మంచిదని ఎంజీఎం విద్యాసంస్థల డైరెక్టర్ మయూర్ తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా మయూర్ మాట్లాడుతూ ఎంఆర్ వ్యాక్సిన్ ఆవశ్యకతను వివరించారు.హెచ్ఎం మునిరత్నంనాయుడు, వైద్య సిబ్బంది విజయలక్ష్మి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో సినిమాలు...

సాయిరాం	:	లై
బలరాం	:	గౌతమ్‌నందా
శ్రీనివాస	:	ఫిదా
విజయలక్ష్మి	:	నేనే రాజు నేనే మంత్రి
ఆర్.ఆర్	:	ధర్టీగేమ్
రామచంద్ర	:	జయ జానకీ నాయక

స్కిట్ విద్యార్థుల సేవలు అభినందనీయం

తొట్టంబేడు: శ్రీకాళహస్తిలోని స్కిట్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు హౌసింగ్ జియోట్యాగింగ్‌కు అందించిన సేవలు అభినందనీయమని ఎంపీపీ పోలమ్మ అన్నారు. మండలంలోని 27 పంచాయతీల్లోని ఇళ్ల జియోట్యాగింగ్ ప్రక్రియను స్కిట్ విద్యార్థులు చేపట్టారు. వారికి ఎంపీపీ పోలమ్మ గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రశంసాపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు సేకరించి తక్కువ సమయంలోనే సర్వేను పూర్తి చేయడం అభినందనీయమన్నారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో అలీ, మండల టీడీపీ అధ్యక్షుడు మురళీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



ప్రసంశాపత్రాలు అందిస్తున్న ఎంపీపీ

చెత్త సేకరణలో మెలకువలు పాటించండి

తొట్టంబేడు: చెత్త సేకరణలో స్వచ్ఛ దూత్‌లు మెలకువలు పాటించాలని డీఆర్పీ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి సూచించారు.మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఘనవ్యర్థాల నిర్వహణ, సంపద సృష్టి కేంద్రంలో గురువారం ప్రజాప్రతినిధులు, మండల, గ్రామస్థాయి అధికారులకు చెత్తసేకరణపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డీఆర్పీ మాట్లాడుతూ సేకరణ సమయంలోనే తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించాలన్నారు.వాటితో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో వర్మీకంపోస్టు ఎరువులను తయారు చేసే ప్రక్రియలను వివరించారు. కార్యక్రమంలో రేణిగుంట, ఏర్పేడు, శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఏవోలు, ఏపీవోలు, ఎంఈవోలు, ఏపీఎంలు, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

నేడు పద్మావతి అమ్మవారికి శాకంబరి అలంకారం

పీలేరు: స్థానిక కోటపల్లెలోని జీవీ చంద్రశేఖర్‌రెడ్డినగర్‌లో వెలసిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం పద్మావతి అమ్మవారికి శాకంబరి అలంకారం నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్ట్ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథరెడ్డి తెలిపారు. శ్రావణమాసంలోని చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి వివిధ కూరగాయలతో ఈ అలంకారాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. శుక్రవారం సాయంత్రం 6.30గంటలకు అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని వివరించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వారపుసంత ఆవరణలో పంచాయతీ భవన నిర్మాణానికి అనుమతించండి



ఎంపీడీవో ధనలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచు రంగిన్‌సాహెబ్

కలకడ: స్థానిక వారపుసంత ఆవరణలో ఉన్న షెడ్ల ఎదుట కలకడ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి అనుమతించాలని సర్పంచు రంగిన్‌సాహెబ్ గురువారం ఎంపీడీవో ధనలక్ష్మికి పంచాయతీ తీర్మాన ప్రతిని, వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వం భవన నిర్మాణానికి రూ.15లక్షలు మంజూరు చేసిందని, అయితే కొందరు వ్యక్తులు దురుద్దేశంతో పంచాయతీ తీర్మానించిన ప్రదేశంలో నిర్మాణం జరగకుండా ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. అధికారులు స్పందించి వారపుసంత ఆవరణలోనే భవన నిర్మాణం చేపట్టేలా అనుమతించాలని సర్పంచు వినతిపత్రంలో కోరారు. కార్యక్రంలో ఎంపీటీసీ సభ్యుడు ఇర్ఫానిబాషా, కో-ఆప్షన్ సభ్యుడు నజీర్‌అహ్మద్, వార్డు సభ్యులు ఉన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ



విద్యాసామగ్రిని పంపిణీ చేస్తున్న ఎంఈవో

ఎర్రావారిపాళెం: ఇషా పౌండేషన్ అందజేసిన విద్యాసామగ్రిని మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంఈవో వెంకటబాలసుబ్రహ్మణ్యం గురువారం పంపిణీ చేశారు. ఇషా పౌండేషన్ ఆధ్వర్యంలో వేసవిలో ఉపాధ్యాయులకు పది రోజుల వృత్యంతర శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా తరగతుల్లో అభ్యసన సామర్థ్యం వెనుకబడిన విద్యార్థులకు ఉపయుక్తమయ్యే సామగ్రిని ఇషా పౌండేషన్ వారు సరఫరా చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రతి పాఠశాలలోనూ తెలుగు, గణితం, ఆంగ్లలో సరళ బోధన, అభ్యసన రీతుల్లో మెటీరియల్ ఉందని, దీన్ని ఉపాధ్యాయులు పిల్లలకు రోజువారీ బోధించాల్సి ఉంటుందన్నారు. అనంతరం 12వేల కోడి గుడ్లను మధ్యాహ్న భోజనంలో భాగంగా వివిధ పాఠశాలలకు ఎంఈవో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గొర్రె మృతి

కేవీపల్లె: పిడుగుపాటుతో గొర్రె మృతిచెందిన సంఘటన మండలంలోని తువ్వపల్లె పంచాయతీ రెడ్డివారిపల్లె హరిజనవాడ సమీపంలో గురువారం మధ్యాహ్నం జరిగింది. బాధితుల కథనం మేరకు... గ్రామానికి చెందిన గుండ్లూరి వెంకట్రమణ గొర్రెలు మేపుతుండగా మధ్యాహ్నం ఉరుములతో కూడిన గాలివాన రావడం, ఈ క్రమంలో భారీ శబ్దంతో పడిన పిడుగుపాటుకు గొర్రె మృతిచెందింది. దీని విలువ సుమారు రూ.9 వేలు వుంటుందని అధికారులు సహాయం చేయాలని బాధితుడు కోరాడు.

ఎనిమిది మంది జూదరుల అరెస్టు

కలకడ: స్థానిక టమోటా మార్కెట్‌లో గురువారం వేకువజామున జూదం ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ చాంద్‌బాషా తెలిపారు. బాటవారిపల్లెకు చెందిన రెడ్డప్ప, అన్నయ్య, చంద్రశేఖర్, ప్రసాద్, శ్రీకాంత్, నారాయణ, కలకడకు చెందిన మహమ్మద్‌అలీ, హుస్సేన్‌ను అరెస్టు చేసి వారి నుంచి రూ.15,450 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఐకమత్యంతో టీడీపీని బలోపేతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న రామనాథం నాయుడు

కల్లూరు: ఐకమత్యంతో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేద్దామని ఆ పార్టీ నేత రామనాథం నాయుడు అన్నారు. గురువారం పులిచెర్ల మండలం కొత్తపేటలో కృష్ణమూర్తినాయుడు అధ్యక్షతన మండల పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామనాథం నాయుడు మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా పార్టీని ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామాల్లో విస్తృతంగా ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు అన్నారు. ప్రధాన కార్యదర్శి లోకేశ్ మాట్లాడుతూ గ్రామాలలో ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేసే విధంగా అందరం ముందుండాలని అన్నారు. మైనారిటీ నాయకుడు నజీర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించే విధంగా నాయకులు, కార్యకర్తలు కైజాలా యాప్‌ను సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. సమావేశానికి ముందు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమావేశంలో సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, ఆలయ కమిటీ ఛైర్మన్ నారాయణస్వామి నాయుడు, నాయకులు సుబ్రహ్మణ్యం, గోపినాయుడు, సుబ్రహ్మణ్యంనాయుడు, శ్రీనివాసులునాయుడు, నాగరాజనాయుడు, భాస్కరరెడ్డి, అన్నాస్వామి, వెంకటమునినాయుడు, వెంకటరెడ్డప్ప, రమణ, గురుప్రసాద్, అన్వర్‌బాషా, పురుషోత్తంచౌదరి, రామకృష్ణనాయుడు, అబ్బాస్, ఖాదర్‌వల్లీ, భాస్కర, సుందరరాజులు, సర్పంచు వెంకటాద్రినాయుడు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ నాగరాజు

పీలేరు: పట్టణంలో వినాయక చవితి సందర్భంగా విగ్రహాల ఏర్పాటుకు నిర్వాహకులు విధిగా పోలీసుల అనుమతి పొందాలని పీలేరు అర్బన్ సీఐ నాగరాజు అన్నారు. గురువారం సాయంత్రం పీలేరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో పట్టణ మహాగణేష్ ఉత్సవ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అనుమతి పొందిన కేంద్రాలలో మాత్రమే విగ్రహాలను ప్రతిష్టించాలన్నారు. అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో పండుగ నిర్వహణకు సహకరించాలన్నారు. ముఖ్యంగా మహిళలు ఇబ్బంది పడకుండా పూజాది కార్యక్రమాలు చేపట్టాలని, నిమజ్జనోత్సవ ఊరేగింపులో బాణసంచా పేలుళ్ల, కోడిగుడ్లు, రంగులు విసురుకోవడం చేయరాదన్నారు. నిర్ణీత సమయానికి నిమజ్జనోత్సవ ఊరేగింపు పూర్తి చేయాలని సూచించారు. ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కాకులారం భాస్కర్‌రెడ్డి, వారణాశి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ దశాబ్దాలుగా పీలేరులో వినాయకచవితి పండుగను అన్ని వర్గాల వారు ఎంతో భక్తిశ్రద్ధలు, ఉత్సాహంతో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని అన్నారు. ఈ సందర్భంగా గణేష్ లడ్డూ వేలం పాట నిర్వహించగా మార్కెట్‌యార్డు కేంద్రం నిర్వాహకుడు భాస్కరరెడ్డి రూ.20,516కు దక్కించుకున్నారు. ఈ నెల 25న పండుగ రోజు 20కిలోల గణేష్ లడ్డూను ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులు జ్ఞానంగారి శ్రీధర్, సుధాకర్, రవి, బీజేపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, నటరాజ, రమణ తదితరులు పాల్గొన్నారు.

'వయ్యారిభామ' నివారణపై అవగాహన

కలికిరి: వయ్యారిభామ కలుపు మొక్కల నివారణపై వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులకు కేవీకే శాస్త్రవేత్త గణేష్‌కుమార్ గురువారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. శాస్త్రవేత్త ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ పంటచేలల్లో గట్లపై ఉన్న వయ్యారిభామ మొక్కలను వేళ్లతో సహా పెకిలించి గుంతల్లో పూడ్చి కంపోస్టు ఎరువుగా మార్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త ప్రసన్నలక్ష్మి

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



ఎంపీపీకి వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

కల్లూరు: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎంపీపీ మురళీధర్ అన్నారు. గురువారం పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో పలువురు తమ సమస్యలపై ఎంపీపీకి వినతిపత్రాలు అందజేశారు. కల్లూరుకు చెందిన మహిళలు పంచాయతీ పరిధిలో మరుగుదొడ్ల నిర్మాణాలకు అనుమతులు, నిర్మించిన వాటికి బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరగా ఎంపీపీ స్పందిస్తూ ఈ సమస్యను వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం అధికారులతో మండలంలో అభివృద్ధి పనులపై సమీక్షించారు.

రెండో రోజుకు చేరుకున్న తపాలా ఉద్యోగుల సమ్మె

పీలేరు: అపరిష్కృత డిమాండ్ల సాధన కోసం అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం రెండో రోజుకు చేరుకుంది. స్థానిక తపాలా బ్రాంచి కార్యాలయం ఎదుట జరిగిన సమ్మెలో పీలేరు సబ్ డివిజన్ పరిధిలోని గ్రామీణ తపాలా ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని నినాదాలు చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదని, న్యాయమైన తమ కోర్కెలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమ్మెతో గ్రామీణ ప్రాంతాల్లో తపాలా సేవలు స్తంభించాయి. ఈ కార్యక్రమంలో యూనియన్ పీలేరు బ్రాంచి అధ్యక్ష, కార్యదర్శులు రామిరెడ్డి, ఖాదర్‌బాషా, కోశాధికారి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమ్మె చేస్తున్న ఉద్యోగులు

భూ సమస్యలు పరిష్కరిస్తాం



ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న తహసీల్దార్

పీలేరు/భాకరాపేట: భూ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని పీలేరు తహసీల్దార్ మునిప్రకాశం అన్నారు. గురువారం మండలంలోని ఎంసీపాళెంలో తహసీల్దార్ ఆధ్వర్యంలో రైతు సేవలో రెవెన్యూశాఖ కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ఈ సంధర్భంగా ఎనిమిది మంది రైతులు తమ భూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామసభలో సర్పంచు గీతాంజలి, ఆర్‌ఐ వెంకటరెడ్డి, సర్వేయర్ మహబూబ్‌బాషా, వీఆర్వోలు, నాయకులు అశోక్ నాయుడు, గిరి, రమేష్ పాల్గొన్నారు. ● చిన్నగొట్టిగల్లు మండలం కోటబైలులో తహసీల్దార్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో రైతుసేవలో రెవెన్యూశాఖ గ్రామసభ నిర్వహించారు. పలువురు రైతులు తమ భూ వివరాలను ఆన్‌లైన్ చేయాలని, ఈ-పాస్ పుస్తకాలను వెంటనే ఇవ్వాలని కోరగా తహసీల్దార్ స్పందించి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీనివాసులురెడ్డి, సర్వేయర్ మురళి, వీఆర్వోలు శ్రీనివాసరావు, నరసింహులు, శ్రీరాములు, శ్రీనివాసులు, సిద్దయ్య పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా వుండాలి



జిల్లేళ్లమంద హైస్కూల్లో ఎంఆర్ వ్యాక్సిన్లు వేస్తున్న దృశ్యం

కేవీపల్లె: సీజనల్ వ్యాధుల పట్ల గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లేళ్లమంద పీహెచ్‌సీ వైద్యాధికారి హరినాథ్ అన్నారు. గురువారం ఆయన పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో పర్యటించి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం చీనేపల్లె జడ్పీహైస్కూల్, అంగన్‌వాడీ కేంద్రం, రాగులవారిపల్లె ప్రాథమిక పాఠశాలల్లో ఎమ్మార్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై పోరాటాలకు సిద్ధంకండి

కలికిరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వాడా గంగరాజు, ఉపాధ్యక్షుడు నారాయణబాబు పిలుపునిచ్చారు. గురువారం కలికిరిలో పీలేరు డివిజన్ సీఐటీయూ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం పీలేరు డివిజన్ సీఐటీయూ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీలేరు డివిజన్ అధ్యక్షుడిగా వెంకట్రామయ్య, కార్యదర్శిగా డేవిడ్‌కుమార్ యాదవ్, ఉపాధ్యక్షులుగా షాబాద్, నాగరాజు, చంద్రావతి, ఖాదర్‌వల్లీ, సహాయ కార్యదర్శులుగా శ్రీనివాసులు, రాజమ్మ, అల్లాబక్షు, మల్లికార్జున, ప్రసాద్ ఎన్నికయ్యారు.

సినిమా గైడ్

షుకూర్	లై
ఎస్వీ మహల్	నక్షత్రం
ఎస్వీ డీలక్స్	నేనే రాజు నేనే మంత్రి
అజంతా	జయ జానకి నాయక

మద్యం షాపు వద్దంటూ ఎస్ఐకి వినతి



పిచ్చాటూరు: తమ ప్రాంతంలో మద్యం దుకాణం వద్దంటూ మండలంలోని ఎస్ఎస్‌బీ పేటకు చెందిన కొందరు యువకులు గురువారం ఎస్ఐ మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎస్ఎస్‌బీపేట మద్యం షాపును శ్రీరామపురానికి తరలిస్తున్నామని చెప్పారు. అది తమ పంచాయతీ పరిధి అని అక్కడ కూడా మద్యం షాపు వద్దన్నారు. జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామనడంతో యువకులు వెనుదిరిగారు.

రైతు సమస్యలు పరిష్కరిస్తాం



వినతులను పరిశీలిస్తున్న తహసీల్దార్

నింద్ర: గ్రామాల్లోని రైతుల సమస్యలు పరిష్కరించేందుకే ప్రజల ముంగిట రెవెన్యూ శాఖ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బాబు అన్నారు. గురువారం చవరంబాకంలో జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు గురు, శుక్రవారాలు రెండు రోజుల పాటు గ్రామాల్లో బస చేసి రైతుల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పాసుపుస్తకాలు, భూములకు సంబంధించి డివిజన్లు చేయడం వంటి బీ, ఎఫ్ఎంబీ, అడంగళ్ బేరీజు వేసుకుని సరైన వివరాలు నమోదు చేస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గ్రామానికో ఆదర్శ రైతును తయారు చేయండి

నీటి సంరక్షణ, యాజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సులో జడ్పీ వైస్‌చైర్మన్ సుందర రామిరెడ్డి

సత్యవేడు: సమావేశాలు పెట్టడం, అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం వల్ల రైతుల్లో మార్పు రావడం లేదని, పాత పద్ధతుల్లోనే వ్యవసాయం చేస్తున్నారని జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు సుందరరామిరెడ్డి అన్నారు. నీటి సంరక్షణ, యాజమాన్య పద్ధతులపై ఆత్మ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన అవగాహన సదస్సులో జడ్పీ వైస్‌చైర్మన్ సుందర రామిరెడ్డి మాట్లాడారు. అదేవిధంగా రైతులు పండించిన పంటలు నిల్వ చేసుకునేందుకు స్టోరేజ్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లైతే గిట్టుబాటు ధర వచ్చే వరకు నిల్వచేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. చెరువులు, నీటి గుంటలు అభివృద్ధి చేసి రైతులు నీటి నిల్వ శాతాన్ని పెంచుతుంటే పరిశ్రమలు ఆ నీటిని తోడేస్తున్నాయని ఎంపీపీ మస్తాన్ చెప్పారు. గ్రామాలకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తుంటే పాలగుంటలోని సుచి బేవరేజస్ సంస్థ రోజుకు సమారు 3లక్షల లీటర్ల నీటిని తోడేస్తోందని చెప్పారు. ఈ సమస్యపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఉన్నతస్థాయి కమిటీని పరిశీలనకు పంపారని చెప్పారు. పరిశ్రమలో ఉన్నప్పుడు ఒకలా మాట్లాడిన అధికారులు బయటికొచ్చిన వెంటనే మాటా మార్చారన్నారు. దీంతో పరిశ్రమ చుట్టుపక్కల ఉన్న ఐదుగ్రామాల ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. అనంతరం తక్కువ నీరు ఉపయోగించి ఎక్కువ పంటలు పండించే విధంగా ఆత్మ అధికారులు రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మల్లికార్జునయ్య ఆధ్వర్యంలో ఆత్మ అధికారులు శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఆత్మ కోఆర్డినేటర్ ఎర్రరెడ్డి మాట్లాడుతూ ప్రతి రైతు నీటి సంరక్షణ, యాజమాన్య పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పొరంపొండ్లను తవ్వుకోవడం వల్ల నీటి నిల్వ శాతం పెరుగుతుందన్నారు. తూర్పు మండాలల్లో వరి సాగు చేస్తుంటారని అతి తక్కువ నీటిని ఉపయోగించి సాగు చేయాలన్నారు. అయితే అందరు ఒకే పంటలకు అలవాటుపడకుండా వ్యవసాయ, ఉద్యానవన, సెరికల్చర్ వంటి వాటిపై దృష్టి సారించాలన్నారు. వ్యవసాయశాఖ సూచనలతో నూతన సాంకేతిక పద్ధతులను అవలంబించాల్సిన అవసరం ఉంద న్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన ఇన్‌చార్జి అధికారి హరికృష్ణారెడ్డి, ఎంపీడీవో జ్ఞానేశ్వర్, ఏవో గౌరి, ఎంపీఈవోలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుందరరామిరెడ్డి

వేగవంతమైన రూబెల్లా టీకా

విజయపురం: మండలంలో రూబెల్లా, మీజిల్స్ టీకా వేయించడం వేగవంతమైనదని వైద్యాధికారి గుణశేఖర్ తెలిపారు. గురువారం మండలంలోని ఎం.అగరం, కేవీపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రూబెల్లా టీకా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీకా వేయు సందర్భంలో గ్రామంలో లేని వారు సమాచారాన్ని ఆశా కార్యకర్తకు, ఏఎన్‌యంలకు తెలియజేయాలని సూచించారు. సమీప ప్రాంతంలో టీకా వేయు ప్రదేశంలో లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో దేవకృపావరం, పీహెచ్ఎన్ భాగ్యలక్ష్మి, సూపర్‌వైజర్ చింతమణి, వెంకటేసులు, బాబురావ్, ఏఎన్‌యంలు తదితరులు పాల్గొన్నారు.

వ్యాన్ బోల్తా

ఒకరికి తీవ్రగాయాలు

నాగలాపురం: మండల కేంద్రం నాగలాపురంలో వ్యా బోల్తా పడిన ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. చెన్నైలోని మనలికి చెందిన శివ(27) తమ స్నేహితులతో కలిసి వ్యాన్ లో తిరుమలకు బయలుదేరారు. మార్గమధ్యంలో నాగలాపురం బైపాస్‌రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడ్డారు. దీంతో శివ తలకి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ మునిస్వామి సంఘటనా స్థలానికి చేరుకుని 108 వాహనం ద్వారా క్షత గాత్రుడ్ని నాగలాపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన చికిత్స నిమిత్తం నగరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

స్కేటింగ్‌లో అంగన్ వాడీ విద్యార్థుల ప్రతిభ



పుత్తూరు: పుత్తూరు పట్టణం కామరాజ నగర్‌కు చెందిన అంగన్ వాడీ విద్యార్థులు గోవాలో జరిగిన స్కేటింగ్‌లో జాతీయస్థాయి ఛాంపియన్ షిప్ సాధించినట్లు పుత్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి పద్మజ తెలిపారు. ఇందులో కావ్య, తరుణ్‌రెడ్డి పుత్తూరులో శిక్షణ పొందారని చెప్పారు. వీరిని అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు పీవో పద్మజ తెలిపారు.

రోడ్డు భద్రత చట్టంపై అవగాహన







నింద్ర, నగరి, నాగలాపురంల్లో జరిగిన రోడ్డు భద్రత అవగాహన సదస్సులు

నింద్ర: రోడ్డు భద్రత చట్టంపై విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్నట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు. గురువారం మండలంలోని నింద్ర, ఆరూరు, చవరంబాకంలోని ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదే విధంగా ఎమ్మార్సీలో మండలంలోని ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. పాఠాలతో పాటు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విజయపురం: అజాగ్రత్తగా వాహనాలు నడుతుండడంతోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఎస్ఐ ప్రసాద్‌రావు చెప్పారు. గురువారం విజయపురం మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాహన చోదకులు ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్, బీమా సదుపాయం ఉండాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు.

నాగలాపురం: మైనర్లు వాహనాలు నడపరాదని ఎస్ఐ మునిస్వామి పేర్కొన్నారు. గురువారం స్థానిక వర్తక సంఘం కల్యాణ మండపంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎస్ఐ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన సమావేశం నిర్వహించారు. లైసెన్స్ లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు.

నగరి: రోడ్డు ప్రమాదాలకు సంబంధించి డ్రైవర్లే కాక వాహన యజమానులు బాధ్యత వహించాల్సి ఉంటుందని నగరి సీఐ మల్లికార్జున గుప్త తెలిపారు. గురువారం నగరిలోని గణపతిరంగ కల్యాణ మండపంలో పట్టణంలోని లారీలు, లగేజీ ఆటోలు, జేసీబీ యజమానులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలకు సంబంధించిన యజమానులు తమ డ్రైవర్లకు పూర్తి బాధ్యతలు తెలియజేయాలని, ప్రధానంగా లైసెన్సులు, ఓవర్‌స్పీడ్‌గా పోవడం, సెల్‌ఫోన్ లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, తదితర వాటి గురించి డ్రైవర్లను అప్రమత్తం చేయా లని ఆయన కోరారు. సమావేశంలో ఎస్ఐ విక్రం తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన జీడీఎస్‌ల సమ్మె



సత్యవేడు పోస్టాఫీసులో ఉత్తరాల మూటలు

పుత్తూరు/కార్వేటినగరం/నగరి/సత్యవేడు: సమస్యల పరిష్కారానికి గ్రామీణ తపాలా ఉద్యోగులు చేపట్టిన సమ్మె రెండో రోజు కొనసాగింది. గ్రామీణ డాక్ సేవక్ జాతీయ కమిటీ పిలుపు మేరకు గురువారం పుత్తూరు డివిజన్ కార్యాలయం వద్ద ధర్నా కొనసాగింది. అలాగే కార్వేటినగరంలో యూనియన్ నాయకుడు మణి ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. నగరి తపాలా కార్యాలయం వద్ద జీడీఎస్ సంఘ స్థానిక అధ్యక్షుడు హరిరెడ్డి ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ సబ్‌డివిజన్ ఉపాధ్యక్షుడు మురళి ఆధ్వర్యంలో 17మంది బీపీఎం సత్యవేడు పోస్టాఫీసు వద్ద ధర్నా చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు విధుల్లో పాల్గొనేదిలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రెటరీ సురేష్, బీపీవోలు రూప్‌కుమార్, రాజవేల్, మహేష్‌రెడ్డి, రామచంద్రరాజు, తదితరులు పాల్గొన్నారు. జీడీఎస్‌ల ధర్నాతో ఆయా పోస్టాఫీసుల్లో ఉత్తర బట్వాడా ఆగిపోయింది.

నంద్యాలలో టీడీపీ అభ్యర్థి గెలుపునకు ప్రచారం



వెదురుకుప్పం: నంద్యాలలో టీడీపీ అభ్యర్థి గెలుపు కోసం వెదురుకుప్పం మండలానికి చెందిన టీడీపీ నాయకుడు, ఎంపీటీసీల సంఘం జిల్లా కార్యదర్శి పి.మోహనమురళి గురువారం ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో భాగంగా టీడీపీ ఎమ్మెల్యే అనిత వెంట ఆయన వెళ్లి ఓట్లను అభ్యర్థించారు.

బెల్టులు, టైలు పంపిణీ

సత్యవేడు: మండల పరిధిలోని పుదుకుప్పం తమిళ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఎంఈవో రవి తన సొంత నిధులతో టైలు, బెల్టులు, బ్యాడ్జీలు పంపిణీ చేశారు. ప్రైవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల పిల్లలు యూనిఫాంను ధరించి పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

నారాయణవనం: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 19, 22 తేదీల్లో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గంగాభవాని ఓ ప్రకటనలో తెలిపారు. నారాయణవనం సప్తగిరి గ్రామీణ బ్యాంకు, పాలమంగళం సప్తగిరి గ్రామీణ బ్యాంకులకు సంబంధించి 19 తేదీ, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు సంబంధించి 22వ తేదీ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థు లు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని ఆమె కోరారు.

సేవాభావాన్ని పెంపొందించుకోండి

వెదురుకుప్పం: విద్యార్థులు చదువుతో పాటు సేవాభావాన్ని పెంపొందించుకోవాలని చవటగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో తులసీరాంరెడ్డి చెప్పారు. గురువారం ఇనాంకొత్తూరులో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇనాంకొత్తూరు పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో పారిశుద్య కార్యక్రమాల్ని నిర్వహించామని చెప్పారు. పశువైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో 300 మొక్కలను నాటామన్నారు. సీజనల్ వ్యాధులు, దోమల వల్ల కలిగే జ్వరాలపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. సర్పంచ్ బాబు, ఎంపీటీసీ సభ్యురాలు చంద్రమ్మ, కళాశాల సిబ్బంది కొండారెడ్డి, డిల్లీ, రవి తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

కార్వేటినగరం: కార్వేటినగరం ప్రభుత్వ ఐటీఐలో గురువారం ఉదయం నుంచి దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించి ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో సీట్లు కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి పేజీలో తిరుపతిలో వివిధ కోర్సులకు సీట్లు కేటాయించడం జరిగిందని, రెండో పేజీలో ఖాళీగా ఉన్న కంప్యూటర్లు, డ్రెస్ మేకింగ్, ఎలక్ట్రానిక్ మెకానిక్ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసినట్లు తెలిపారు.

అభాగ్యులకు సీఎం సహాయనిధి తోడ్పాటు

రామసముద్రం: ముఖ్యమంత్రి సహాయనిధి అభాగ్యులకు తోడ్పాటునిస్తూ ఆదుకుంటోందని టీడీపీ రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి బొమ్మనచెరువు శ్రీరాములు పేర్కొన్నారు. గురువారం రామసముద్రం మండలంలోని ఆర్.నడింపల్లె పంచాయతీ ఎగువనల్లప్పగారిపల్లెకు చెందిన మేకల వెంకటమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆమె కుటుంబసభ్యులకు రూ.2లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చలపతినాయుడు, తెలుగు రైతు అధ్యక్షుడు గోపాలరెడ్డి, టీడీపీ నాయకులు ఇలియాజ్, శివారెడ్డి, డాక్టర్ శివ, హరినాథరెడ్డి, చంద్రప్ప, రఘు, మంజునాథ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు అనుమతి కావాలంటే

మొక్కలు నాటాల్సిందే



కొత్తఇండ్లలో మొక్కలు నాటుతున్న కమిషనర్ వర్మ, వైస్ చైర్మన్ ఆవుల అమరేంద్ర తదితరులు

పుంగనూరు: పట్టణంలో ఇళ్ల నిర్మాణానికి అనుమతి పొందాలంటే ముందుగా మొక్కలు నాటాల్సిందేనని మున్సిపల్ కమిషనర్ కెవిఎల్.వర్మ పేర్కొన్నారు. గురువారం స్థానిక కొత్తయిండ్లు, దండుపాళ్యం రోడ్డుకి ఇరువైపులా మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి ముందు మొక్కలు నాటడం వల్ల ఆ కుటుంబం అన్ని విధాల అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందన్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆవుల అమరేంద్ర మాట్లాడుతూ వాతావరణ కాలుష్యాన్ని నివారించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కమిషనర్ వర్మ బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి పట్టణం అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోందని కొనియాడారు. కార్యక్రమంలో బార్ అసోషియన్ అధ్యక్షుడు రెడ్డెప్ప, కౌన్సిలర్ మనోహర్, మున్సిపల్ టీపీవో కృష్ణారావు, రమణారెడ్డి, శివ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే జరిమానా



వాహనదారులకు జరిమానా విధిస్తున్న ఎస్ఐ హరిప్రసాద్

పుంగనూరు రూరల్: లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే జరిమానా కట్టకతప్పదని ఎస్ఐ హరిప్రసాద్ హెచ్చరించారు. గురువారం స్థానిక చౌడేపల్లె, మదనపల్లె రోడ్డు మార్గాల్లో తిరుగుతున్న ద్విచక్రవాహనాలను తనిఖీ చేశారు. రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారికి, మద్యం తాగిన, హెల్మెట్ ధరించని వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించడానికి అనేక పర్యాయాలు వాహనదారులకు అవగాహన కల్పించామన్నారు. అయినా స్పందన లేకపోవడంతో జరిమానా విధిస్తున్నట్లు తెలిపారు.

రోడ్డుప్రమాదాల నివారణకు చర్యలు

సోమల: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. గురువారం సోమల పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు రహదారుల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించడం, అధిక వేగంతో వెళ్లడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈనేపథ్యంలో ఆటోల వెనుక డోర్లు వెల్డింగ్‌తో లాక్ చేయించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ ఆనంద్, మనోహర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

వెంకటేశ్వర	పిదా
తాజ్‌మహల్	జయ జానకి నాయక
గోకుల్	నేనే రాజు నేనే మంత్రి
ఎంఎస్ఆర్	లై

పుంగనూరు మున్సిపల్ బడ్జెట్ రూ.22.16 కోట్లు

రెండేళ్లలో రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు: కమిషనర్ వర్మ



పుంగనూరు: మున్సిపాలిటీలో ప్రజల మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులు చేపట్టడానికి ఏడాది బడ్జెట్ రూ.22.16 కోట్లుకు పెరిగిందని కమిషనర్ కెవిఎల్.వర్మ అన్నారు. గురువారం నాటికి కమిషనర్ బాధ్యతలు చేపట్టి రెండేళ్లయిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుంగనూరు పట్టణ అభివృద్ధికి మంత్రి నారాయణ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎస్.షమీం, కౌన్సిల్, ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి వెంకటరమణ రాజు, అన్ని పార్టీల నాయకులు, ప్రజలు సహకరించారన్నారు. రాష్ట్రస్థాయిలో మున్సిపాలిటీ పనితీరుకు ప్రభుత్వం ఉత్తమ అవార్డు, స్వచ్ఛ పుంగనూరుగా కేంద్ర ప్రభుత్వం అవార్డులు ఇచ్చాయన్నారు. సాధారణ నిధులు కాకుండా ప్రతిపాదనలు పంపిన పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. 13, 14వ ఆర్థిక సంఘ నిధులు రూ.4,68,28,000, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు రూ.5.99 కోట్లు, నాన్‌గ్రాంట్ నిధులు రూ.17.97లక్షలు, ప్లాన్ గ్రాంట్ నిధులు రూ.13లక్షలు, మురికివాడల అభివృద్ధికి ఈజయఎస్ నిధులు రూ.10లక్షలు మంజూరై పనులు చాలా వరకు పూర్తి అవుతున్నట్లు తెలిపారు. పట్టణంలో 475 వ్యక్తిగత మరుగుదొడ్లు, 5 కమ్యూనిటీ, 3 పబ్లిక్ టాయిలెట్లు నిర్మించామని, శానిటేషన్ పర్యవేక్షణకు బృందాల ఏర్పాటు చేశామన్నారు. తాగునీటి సమస్య లేకుండా ప్రతి రోజు నీటిసరఫరా చేస్తున్నామని, హరిత పట్టణంగా తీర్చిదిద్దాలని 25వేల మొక్కలు నాటి పరిరక్షించడం జరిగిందని వివరించారు. 1910 స్తంభాలకు ఎల్ఈడీ లైట్లు వేసి కరెంట్ చార్జీ నెలకు రూ.3 లక్షల నుంచి రూ.1.25 లక్షలకు తగ్గించామని, మున్సిపల్ స్కూల్స్‌లో మౌలిక వసతులు కల్పించి, భవన సమస్యలు తీర్చడం, ఐబటి పౌండేషన్ కోర్సు ఏర్పాటు ఉత్తమ ఫలితాలిచ్చాయన్నారు. ఆస్తి పన్ను 88శాతం, నీటిపన్ను 93శాతం వసూళ్లు చేశామని, ప్రజల సౌకర్యం కోసం పురసేవ ప్రవేశపెట్టడం, సిటిజన్ సర్వీసు సెంటర్ ఏర్పాటుతో ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. అందరి సహకారంతో మున్సిపాలిటీని అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళుతున్నట్లు వివరించారు.

ప్రమాదాల నివారణపై అవగాహన ర్యాలీ



విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

చౌడేపల్లె: రోడ్డు ప్రమాదాలు నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలంటూ విద్యార్థులు, పోలీసులు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పుంగనూరు రూరల్ సీఐ రవీంద్ర మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా యువత, విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించేందుకే ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిబంధనలు పాటించకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు మోటర్ సైకిళ్లు, నాలుగుచక్రాల వాహనాలు ఇవ్వరాదని, మైనర్లు డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహనాలు నడిపేవారు లైసెన్స్, వాహన, బీమా రికార్డులు దగ్గర ఉంచుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మార్ టీకాతో ప్రాణాంతక వ్యాధులు దూరం



ఎమ్మార్ టీకాలు వేస్తున్న డాక్టర్ సోనియా

రామసముద్రం/సోమల: ఎమ్మార్ టీకాతో ప్రాణాంతక వ్యాధులైన రుబెల్లా, తట్టును నివారించ వచ్చని రామసముద్రం వైద్యాధికారిణి గ్రీష్మబిందు పేర్కొన్నారు. గురువారం రామసముద్రం ఆదర్శ పాఠశాలలో ఎమ్మార్ టీకాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రుబెల్లా వైరస్ వల్ల పుట్టబోయే శిశువులు వినికిడి లోపం, బుద్ధిమాంద్యం, గుండె జబ్బు తదితర వ్యాధులతో జన్మించడం జరుగుతుందన్నారు. ఎమ్మార్ టీకాలపై అపోహలు మాని 15 ఏళ్ల లోపు ప్రతి ఒక్కరికీ వేయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పాఠశాలలోని 6నుంచి పదో తరగతి పిల్లలు 398మందికి టీకాలు వేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామాంజులు, అధ్యాపకులు మల్లికార్జునరెడ్డి, సుబ్రహ్మణ్యం, మనోహర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ● ప్రభుత్వం ఉన్నతాశయంతో చేపట్టిన ఎమ్మార్ టీకాలపై విద్యార్థుల తల్లిదండ్రులు అపోహలు పడాల్సిన పనిలేదని సోమల వైద్యాధికారిణి సోనియా అన్నారు. గురువారం సోమల మండలంలోని వడ్డిపల్లె, సూరయ్యగారిపల్లె పాఠశాలల్లో ఎమ్మార్ టీకాలు వేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తట్టు, రుబెల్లా టీకాలను తొమ్మిది నెలల చిన్నారుల నుంచి 15 ఏళ్ల పిల్లలందరికీ వేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వందశాతం రాయితీతో ఎరువుల పంపిణీ

రొంపిచెర్ల: మండలంలోని రైతులకు ప్రభుత్వం వందశాతం రాయితీతో ఎరువులు పంపిణీ చేస్తున్నట్లు రొంపిచెరల● మండల వ్యవసాయాధికారి సూర్యప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఒక్కొక్క రైతుకు జిప్సం రెండు బస్తాలు, బోరాన్ రెండు కిలోలు, జింక్ సల్ఫేట్ ఒక బస్తా ఉచితంగా ఇస్తామన్నారు. రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్‌లతో వ్యవసాయ కార్యాలయం వద్ద సంప్రదించి ఎరువులు పొందవచ్చన్నారు.

డ్రైవర్లకు లైసెన్సు తప్పనిసరి

రొంపిచెర్ల: వాహనం నడిపే డ్రైవర్లు విధిగా లైసెన్సు కలిగి ఉండాలని పీలేరు రూరల్ సీఐ మహేశ్వర్ అన్నా రు. గురువారం రొంపిచెర్లలో ఆటో, ట్రాక్టర్, కారు డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్రైవర్లు లైసెన్సు, వాహనాల రికార్డులు కలిగి ఉండాలన్నారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, తాగి సేవించి వాహనాలు నడిపి చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఆటోల్లో అధిక సంఖ్యలో ప్రయాణికులను తరలించరాదని అన్నారు. అనంతరం ప్రమాదాల నివారణకు కృషి చేస్తాం అంటూ డ్రైవర్ల చేత సీఐ ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఎస్ఐ రహీముల్లా, పోలీసు సిబ్బంది, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



గ్రామసభలో మాట్లాడుతున్న రమణ

రామసముద్రం: పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు ఎంవీ.రమణ అన్నారు. గురువారం మండలంలోని కాప్పల్లె, అరికెల పంచాయతీ కార్యాలయాల్లో గ్రామసభలు జరిగాయి. కాప్పల్లె గ్రామసభలో ఆయన మాట్లాడుతూ ఇళ్లులేని ప్రతి ఒక్కరినీ గుర్తించి గృహాలు మంజూరుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో గృహ నిర్మాణాలకు వినతులు అందజేశారు. అర్జీలను పరిశీలించి అర్హులకు న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు. సమావేశంలో కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు ఎంవీ.రమణ, వీఆర్వోల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, జన్మభూమి కమిటీ సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్ఐ సోమశేఖర్

రామసముద్రం: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ సోమశేఖర్ హెచ్చరించారు. గురువారం రామసముద్రం బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన ఆటోడ్రైవర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆటో వెనకవైపు డోర్కు వెల్డింగ్ చేయాలని, డ్రైవర్ కుడివైపు పూర్తిగా మూత వేయాలని సూచించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే లైసెన్సు రద్దు చేస్తామన్నారు. డ్రైవర్ సీటు పక్కన ప్రయాణికులు ఉంటే జరిమానా విధించడం జరుగుతుందన్నారు. వాహనాల రికార్డులతో పాటు లైసెన్స్ తప్పక ఉండాలన్నారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రన్న బీమా పేదలకు వరం



బాధితురాలి కుటుంబానికి చెక్కు అందజేస్తున్న కమిషనర్ వర్మ

పుంగనూరు: పేద ప్రజలకు చంద్రన్న బీమా వరమని మున్సిపల్ కమిషనర్ కెవిఎల్.వర్మ అన్నారు. స్థానిక తూర్పుమొగశాలకు చెందిన కళ్యాణి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో భర్త సుబ్రహ్మణ్యంకు తాత్కాలిక ఉపశమనంగా రూ.5వేలు నగదును గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల్లో సభ్యురాలిగా చేరి చంద్రన్న బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అమ్ము, ఇబ్రహీం, టీడీపీ నాయకులు చంద్ర, పీవో మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.